

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గిల్ 'డబుల్'
రికార్డులు బద్దలు



ఇంగ్లండ్‌పై 269 పరుగులతో చిరస్మరణీయ ఇన్నింగ్స్

భారత కెప్టెన్‌గా టెస్టుల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు

2003 తర్వాత ఇంగ్లండ్‌లో ద్విశతకం బాదిన తొలి విదేశీ కెప్టెన్

10

శుక్రవారం | 4-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 118 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తిథి: నవమి సా.4:32 తదుపరి దశమి, నక్షత్రం: చిత్త సా.4:50 తదుపరి స్వాతి, వర్జ్యం: రా.11:08-12:56, దుర్ముహూర్తం: ఉ.8:25-9:17, మ.12:45-1:37, అమృతఘడియలు: ఉ.9:38-11:26, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 5:49, సూర్యాస్తమయం: 6:50 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal |Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భూ సమస్యలను నాటి వైసీపీ ప్రభుత్వం మరింత జటిలం చేసేసింది. కొత్త ప్రభుత్వమైనా వాటిని పరిష్కరిస్తుందేమో అని జనం ఎదురు చూస్తూనే ఉన్నారు. ప్రజలకు ఎప్పుడూ సమస్యలు ఉంటేనే తమకు పని ఉంటుందనుకునే బ్యూరో క్రాట్లు ఈ వ్యవహారాన్ని తేల్చడానికి సుముఖంగా లేరు. వెరసి.. రాష్ట్రంలో భూసమస్యలు రావణకాష్ఠంలా రగులుతూనే ఉన్నాయి. ఇటు ఫ్రీహోల్డ్ అంశానికి పరిష్కారం దొరక్క, పాస్ పుస్తకాలు చేతికి రాక, అటు బ్యాంకు రుణాలు అందక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీంతో ముఖ్యమంత్రి శుక్రవారం రెవెన్యూశాఖపై నిర్వహించే సమీక్షా సమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

జగన్ హయాంనాటి అసైన్డ్ అక్రమాలను రెవెన్యూ శాఖ నిర్ధారించింది. ఇక బాధ్యులైన నేతలు, అధికారులు, కబ్జాకోరులపై సర్కారు చర్యలు తీసుకోవడమే తరువాయి అని అంతా భావించారు. కానీ, ఈ దిశగా అడుగులే పడలేదు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించి ఎనిమిది నెలలైనా అధికారుల్లో కదలిక లేదు. మంత్రివర్గ ఉపసంఘం కూడా ఏమీ తేల్చకుండా నాన్చుతోంది. అక్రమంగా నిషేధ జాబితా నుంచి తొలగించిన భూములను పక్కనపెట్టి.. అసలైన హక్కుదారులవద్ద ఉన్న భూములకు స్వేచ్ఛ కల్పించాలన్న విన్నపాలను పట్టించుకోవడంలేదు.

రెవెన్యూ రచ్చ

భూసమస్యల పరిష్కారానికి జనం ఎదురుచూపులు

జగన్ ప్రభుత్వ హయాంలో భారీగా ఫ్రీహోల్డ్ అక్రమాలు

రెవెన్యూ శాఖ తీరుతో వాటికి మరిన్ని పీటముడులు

ఈ సమస్యకు పరిష్కారం ఎప్పుడు?

టాస్క్‌ఫోర్స్ వేయాలని సీఎం చెప్పి 8 నెలలు

అయినా రెవెన్యూశాఖలో స్పందన శూన్యం

3సార్లు భేటీ అయినా ఏమీ తేల్చని ఉపసంఘం

ఇంత కాలమైనా ఏమిటీ నాన్చుడు?

జగన్‌బొమ్మ పాస్ పుస్తకాల సంగతేమిటి?

రైతులకు రుణం తిరస్కరిస్తున్న బ్యాంకులు

అయోమయంలో ప్రజలు, హక్కుదారులు

నేడు రెవెన్యూ శాఖపై చంద్రబాబు సమీక్ష



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆనాడు జగన్ ప్రభుత్వం భూముల రీ సర్వే పేరిట ఊరూరా భూ వివాదాలు సృష్టించింది. భూముల సర్వేలో జరిగిన తప్పులు, ఉద్దేశపూర్వక తప్పిదాల వల్ల రైతుల కాలికింద నేల కదిలిపోయింది. విస్తీర్ణాల్లో తేడాలు వచ్చాయి. హక్కుదారులు, సాగుదారుల పేర్లు, విస్తీర్ణాలు మారిపోయాయి. సర్వే నంబర్లు ఇష్టానుసారంగా మార్చేశారు. ఫలితంగా సరిహద్దు వివాదాలు చెలరేగాయి. రీ సర్వేను అడ్డంపెట్టుకొని కొందరు వైసీపీ నేతలు కన్నుబడ్డ ప్రైవేటు, ప్రభుత్వ భూములను చేజిక్కించుకున్నారు. రెవెన్యూ అధికారులను ప్రలోభపెట్టి కీలకమైన ఇనాం, ఎస్టేట్, ప్రభుత్వ, ప్రైవేటు భూముల రికార్డులను తారుమారు చేశారు. ఆ తర్వాత జగన్ బొమ్మలతో

మిగతా 13వ పేజీలో...

జవాబు చెప్పండి

బనకచర్లపై కేంద్ర జలసంఘం లేఖ

వరద జలాలంటే ఏంటి?.. వాటినెలా లెక్కిస్తారు?

ప్రాజెక్టులవారీగా నీటి వినియోగం, సాగునీటి వివరాలు సమర్పించండి

జలాశయాల నుంచి నీటి విడుదల లెక్కలు కూడా

ఏపీలో ప్రస్తుత, నిర్మాణ, ప్రతిపాదిత ప్రాజెక్టుల మ్యాప్ సైతం ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి సీడబ్ల్యూసీ స్పష్టీకరణ

జవాబులపై వ్యాప్కోస్‌తో కలిసి అధికారుల కసరత్తు

అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై పలు వివరాలు, గణాంకాలు సమర్పించాలని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) రాష్ట్రాన్ని కోరింది. వరద జలాల ఆధారంగా ఈ పథకాన్ని తలపెట్టినందున.. అసలు వరద జలాల నిర్వచనమేంటో చెప్పాలని, వాటిని ఎలా లెక్కిస్తారో వివరించాలని రాష్ట్రానికి సూచించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్‌ఆర్)ను రాష్ట్రప్రభుత్వం మే 26న జలసంఘానికి నివేదించిన సంగతి తెలిసిందే. దీనిని పరిశీలించిన జలసంఘం.. తన పరిశీలనలు, అభిప్రాయాలతో ప్రాథమిక నివేదికను నాలుగు రోజుల కిందట (గత నెల 30న) రాష్ట్రానికి పంపింది. అదే రోజు కేంద్ర పర్యావరణ-అటవీ మంత్రిత్వ శాఖకు చెందిన నిపుణుల మదింపు కమిటీ (ఈఏసీ) ఢిల్లీలో ఈ ప్రాజెక్టుపై

మిగతా 12వ పేజీలో...

హైకోర్టు న్యాయమూర్తిగా తుహిన్ కుమార్



తెలంగాణకు మరో నలుగురు కొత్త జడ్జిలు

కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

14



కుప్పంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

దిద్దుబాటుకు తొలి అడుగు!

ఒకే కార్యక్రమంతో రెండు లక్ష్యాలపై గురి

ఏడాది విజయాలను ప్రజలకు చెప్పడం

దారి తప్పిన ఎమ్మెల్యేలను గాడినపెట్టడం

మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు పార్టీ శ్రేణులన్నీ నెల రోజులు జనంలోనే

కార్యాలయానికీ రావద్దని స్పష్టమైన ఆదేశం

2029 ఎన్నికలకు ఇప్పటి నుంచే అడుగులు

జనంతో మమేకమయ్యేలా బాబు వ్యూహం

ఒకే బాణం.. రెండు లక్ష్యాలు. ఒకటి.. కూటమి ప్రభుత్వం ఏడాదిలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించి చెప్పడం. రెండు.. దారి తప్పుతున్న కొందరు ఎమ్మెల్యేలను గాడిన పెట్టడం. చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో 'తొలి అడుగు' కార్యక్రమం ద్వారా ఒకేసారి ఈ రెండు లక్ష్యాలను సాధించడంపై దృష్టి సారించారు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సుపరిపాలనలో 'తొలి అడుగు' కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు అందివచ్చిన ఓ అవకాశంగా భావిస్తున్నారు. జనంలో ప్రభుత్వం పట్ల సానుకూలత కొనసాగేలా తొలి ఏడాది నుంచే జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పార్టీ శ్రేణులు నెల రోజుల పాటు జనంతో మమేకమయ్యేలా

మిగతా 13వ పేజీలో...

రాజకీయాల్లో చీడపురుగులు!

వైసీపీ బ్యాచ్ రాష్ట్రానికే పెనుసవాల్‌గా మారారు: చంద్రబాబు

నేను ఫేక్ ఫెలోస్‌తో రాజకీయం చేయలేదు

అవాస్తవాలను వాస్తవంగా చూపే యత్నాలు

బనకచర్ల ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదు

కుప్పంలో రెండో రోజు పర్యటనలో సీఎం

టీడీపీ కార్యకర్తలతోనూ సమావేశం





నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ప్రాణాలు కోల్పోతే బీమా సొమ్ము రాదు

» కంపెనీ చెల్లించాల్సిన పనిలేదు: సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ, జూలై 3: అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ప్రాణాలు కోల్పోతే బాధితుడి కుటుంబానికి బీమా పరిహారం రాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పరిహారం చెల్లించాల్సిన అవసరం బీమా కంపెనీకి లేదని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం తీర్పు చెప్పింది. 2014 జూన్ 18న ఎన్.ఎస్. రవీషా అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రంలోని మల్లసంద్ర గ్రామం నుంచి అరిసికెరె పట్టణానికి కారు నడుపుతూ ప్రమాదంలో మరణించారు. ప్రమాదంలో మరణించినందున బీమా కంపెనీ నుంచి రూ.80 లక్షల పరిహారం ఇప్పించాలని కోరుతూ ఆ వ్యక్తి తల్లిదండ్రులు, భార్య, కుమారుడు తొలుత కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. కారును సొంతంగా, అతివేగంగా నడుపుతూ ప్రమాదానికి గురయినందున పరిహారం ఇవ్వాల్సిన పనిలేదని హైకోర్టు తీర్పు చెప్పింది. ట్రాఫిక్ నిబంధనలను పాటించకుండా అతివేగంగా నడపడం వల్లనే ప్రమాదం జరిగిందని పేర్కొంది. ఈ తీర్పుపై ఆ కుటుంబ సభ్యులు సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం హైకోర్టు తీర్పుతో ఏకీభవించింది.

ఎగరని రాయల్ ఎఫ్-35 !

» ఊడదీసి కార్గోలో బ్రిటన్‌కు తరలించాల్సిందే

న్యూఢిల్లీ, జూలై 3: ది బ్రిటిష్ రాయల్ నేవీకి చెందిన ఎఫ్-35 యుద్ధ విమానంలో సాంకేతిక సమస్యలు ఏర్పడటంతో జూన్ 14న కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా దిగింది. అప్పటి నుంచి దానికి మరమ్మతులు చేసేందుకు ఇంజనీరింగ్ సిబ్బంది ఎంతగా ప్రయత్నిస్తున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. దీంతో దాన్ని ఊడదీసి విడిభాగాలను మిలిటరీ కార్గో విమానంలో బ్రిటన్‌కు తరలించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఇది ఐదో జనరేషన్‌కు చెందిన స్టీల్త్ జెట్. గతనెలలో కేరళ తీరానికి 100 నాటికల్ మైళ్ల దూరంలో హెచ్ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్ నిర్వహించిన ఆపరేషన్లలో ఈ యుద్ధ విమానం పాల్గొంది. ప్రతికూల వాతావరణం, ఇంధనం తక్కువగా ఉండటంతో ఈ యుద్ధ విమానాన్ని అత్యవసరంగా తిరువనంతపురం వైపు మళ్లించారు. అది సురక్షితంగా తిరువనంతపురంలో దిగేలా భారత వైమానిక దళం తోడ్పాటు అందించింది.

లక్ష కోట్ల విలువైన రక్షణ పరికరాల కొనుగోళ్లు

» ఆమోదం తెలిపిన డీఏసీ

న్యూఢిల్లీ, జూలై 3: దేశ భద్రతను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.1.05 లక్షల కోట్ల విలువైన రక్షణ పరికరాలను కొనుగోలు చేయనుంది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన గురువారం జరిగిన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్(డీఏసీ) 10 రకాల రక్షణ సామగ్రి కొనుగోళ్లకు పచ్చజెండా ఊపింది. ఈ పరికరాలన్నీ మేకిన్ ఇండియాలో భాగంగా భారత్‌లో తయారై ఉండాలని స్పష్టం చేసింది. తాజాగా డీఏసీ ఆమోదించిన పరికరాల్లో ఆర్మర్డ్ రికవరీ వాహనాలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థలు, త్రివిధ దళాలకు ఉమ్మడి ఇంటిగ్రేటెడ్ ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఐఐఎంఎస్), భూతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే క్షిపణులు, నౌకాదళానికి మైన్స్, మైన్స్ కౌంటర్ మేజర్ వెసల్స్, సూపర్ ర్యాపిడ్ గన్ మౌంట్‌లు, జలాంతర్గాములు ఉన్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు గాను యాక్సెప్టెన్స్ ఆఫ్ నెసెసిటీ(ఏఓఏన్)ను తాజా సమావేశంలో డీఏసీ జారీ చేసింది.

భారత్-అమెరికా మధ్య పదేళ్ల రక్షణ ఒప్పందం

» త్వరలోనే అమెరికా, భారత రక్షణ మంత్రులు పీట్ హెగ్సెత్, రాజ్‌నాథ్ సింగ్ సంతకాలు

న్యూఢిల్లీ, జూలై 3: భారత్, అమెరికా దేశాలు తమ మధ్య వ్యూహాత్మక, రక్షణ సంబంధాల బలోపేతం దిశగా పదేళ్లకాలానికి రక్షణ ఒప్పందం చేసుకోనున్నాయి. ఈ మేరకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ మధ్య జరిగిన సుదీర్ఘంగా ఫోన్ చర్చల్లో ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ సందర్భంగా తేజస్ మార్క్ 1ఏ యుద్ధ విమానాల్లో వినియోగించే అమెరికన్ జీఈ సంస్థ నుంచి ఎఫ్404 ఇంజన్ల సరఫరాను వేగవంతం చేయాలని రాజ్‌నాథ్ సింగ్ కోరారు. రక్షణ మంత్రుల చర్చల వివరాలతో అమెరికా రక్షణ కార్యాలయం పెంటగాన్ తాజాగా ఒక ప్రకటన విడుదల చేసింది. "పదేళ్ల కాలానికి సంబంధించిన రక్షణ ఒప్పందంపై త్వరలో జరిగే సమావేశంలో సంతకాలు చేయాలని ఇరు దేశాల ఆర్థిక మంత్రులు నిర్ణయానికి వచ్చారు. పెండింగ్‌లో ఉన్న రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లు, రక్షణ పరిశ్రమలకు సహకారం తదితర అంశాలపైనా వారు చర్చించారు. 2025 ఫిబ్రవరిలో ట్రంప్, మోదీ ప్రకటించిన ఉమ్మడి రక్షణ లక్ష్యాల సాధన దిశగా ఇరు దేశాలు గణనీయమైన పురోగతి సాధించాయని ఇరువురు నేతలు పేర్కొన్నారు" అని ఆ ప్రకటనలో పేర్కొంది.

రష్యాకు 30 వేల మంది ఉత్తర కొరియా సైనికులు

కీవ్, జూలై 3: ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు మరింత సహకారం అందించేందుకు ఉత్తర కొరియా సిద్ధమవుతోంది. ఉక్రెయిన్ మిలటరీ నిఘా వర్గాల సమాచారం మేరకు.. దాదాపు 30,000 మంది ఉత్తర కొరియా సైనికులు త్వరలో రష్యా సైన్యంలో చేరబోతున్నారు. వీరంతా రష్యా సైన్యంతో కలిసి ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొననున్నారు. ఈ మేరకు సీఎన్ఎన్ ఓ కథనాన్ని ప్రచురించింది. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ సరిహద్దుకు సమీపంలోని కుర్స్క్ ప్రాంతంలో రష్యన్ నేవీ డిప్యూటీ చీఫ్ మేజర్ జనరల్ మిఖాయిల్ గుడ్కోవ్ హత్యకు గురైనట్టు అధికారులు తెలిపారు. జనరల్ గుడ్కోవ్ తన బలగాలను సందర్శించిన సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే ఈ ఘటన ఎప్పుడు జరిగిందనే విషయాన్ని అధికారులు వెల్లడించలేదు.

పాక్ చానెళ్లపై భారత్ మళ్లీ నిషేధం

» ఆంక్షల తొలగింపుపై నెటిజన్ల కన్నెర్రతో దిద్దుబాటు

న్యూఢిల్లీ, జూలై 3: పాకిస్థాన్ న్యూస్ చానెళ్లు, యూ ట్యూబ్ చానెళ్లు, సెలబ్రిటీల సోషల్ మీడియా అకౌంట్లపై భారత్ మరోమారు నిషేధం విధించింది. బుధవారం ఆంక్షలు తొలగించడంపై నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పాక్ సెలబ్రిటీల సోషల్ మీడియా అకౌంట్లపై ఆంక్షలు ఎందుకు తొలగించాల్సి వచ్చిందని నెటిజన్లు ప్రశ్నించారు. దీంతో కేంద్రం మళ్లీ నిషేధం విధించింది. సాంకేతిక సమస్య వల్లే బుధవారం పాక్ సెలబ్రిటీల అకౌంట్లు తిరిగి ప్రత్యక్షమయ్యాయని అధికార వర్గాల ద్వారా తెలిసింది. అయితే దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ప్రకటన వెలువడలేదు. ఆపరేషన్ సిందూర్ సమయంలో తప్పుడు సమాచారం ప్రసారం చేయడంతో పాటు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారంటూ డాన్ న్యూస్, జియో న్యూస్, ఏఆర్‌వై న్యూస్, సమా టీవీ వంటి పాకిస్థాన్ న్యూస్ చానెళ్లను కేంద్రం నిషేధించింది.

గిరిజనులకు మామిడిపండ్లు పంపిన పవన్

డుంబ్రిగుడ, జూలై 3(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామ రాజు జిల్లా డుంబ్రిగుడ మండలం కురిడి గ్రామస్థులకు రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ మామిడి పండ్లు పంపించారు. ఆయన ఐదారు నెలల కిందట అడవితల్లి బాట కార్యక్రమంలో భాగంగా కురిడి గ్రామాన్ని సందర్శించి, గిరిజనులతో మమేకమయ్యారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులకు పవన్‌కల్యాణ్ మామిడి పండ్లు పంపించారు. ఆయన అనుచరులు గురువారం ఇంటింటికీ వెళ్లి గ్రామస్థులందరికీ మామిడిపండ్లు అందజేశారు. పవన్‌కు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.






కురిడి గ్రామంలో పవన్ టీమ్ పంపిణీ చేసిన మామిడి పండ్లతో చిన్నారులు

సింహళీయులు మనోళ్లే!

» దక్షిణాది నుంచి వేల ఏళ్ల క్రితం శ్రీలంకకు వలస



చెన్నై, జూలై 3: శ్రీలంకలో నివసించే సింహళీయుల జన్యు మూలాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. వీరి పూర్వీకులకు దక్షిణ భారతదేశంలో నివసించే ద్రవిడులతో సంబంధం ఉందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. పరిశోధన వివరాలు 'కరెంట్ బయాలజీ' జర్నల్‌లో ఇటీవల ప్రచురితమయ్యాయి. స్థానికంగా నివసించే రెండు ఆదివాసీ తెగలకు చెందినవారి జన్యువులు, సింహళీయుల జన్యువులు ఒకదానికొకటి సంబంధం కలిగి ఉన్నట్లు వెల్లడైంది. ఈ అధ్యయనం కోసం 35 మంది పట్టణ ప్రాంత సింహళీయులతో పాటు రెండు విభిన్నమైన భౌగోళిక ప్రాంతాలకు చెందిన 19 మంది ఆదివాసీల జన్యు నమూనాలను పరీక్షించారు. దాదాపు 3,000 సంవత్సరాల క్రితం సింహళీయుల పూర్వీకులు ఉత్తర, వాయవ్య భారతదేశం నుంచి శ్రీలంకకు వలస వెళ్లారని మునుపటి అధ్యయనాలు పేర్కొన్నాయి. అయితే ప్రస్తుత పరిశోధన ఫలితాలు మాత్రం దీనికి భిన్నంగా ఉన్నాయి. సింహళీయులు, ఆదివాసీల పూర్వీకుల జన్యు నిష్పత్తులు ప్రస్తుతం దక్షిణాదిన నివసిస్తున్న ద్రవిడ భాష మాట్లాడే ప్రజలతో చాలావరకూ పోలి ఉన్నట్లు గుర్తించామని పరిశోధకుల్లో ఒకరైన లఖ్‌నవూలోని బీర్బల్ సాహ్ని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలియోసైన్సెస్(బీఎస్ఐపీ)కి చెందిన డాక్టర్ నీరజ్‌రాయ్ వివరించారు. 'ప్రస్తుతం లంక లోని ఆదివాసీలు జన్యుపరంగా సింహళీయులను, శ్రీలంక తమిళులను పోలిఉన్నారు. దక్షిణ భారతం నుంచి వలస వెళ్లిన సింహళీయులు, శ్రీలంక తమిళులు, ఇతర సమూహాలు ఇక్కడున్న ఆదివాసీలతో సంబంధాలు ఏర్పరుచుకొని ఉంటాయని అధ్యయనంలో పాల్గొన్న చికాగో వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మానసా రాఘవన్ వెల్లడించారు.

వేతనాల్లో హైదరాబాద్ టాప్

అనుభవం ఉన్న సాంకేతిక నిపుణులకు అక్కడే అత్యధిక వేతనాలు

» నెలకు సగటు వేతనం రూ.47,200 నుంచి రూ.69,700

» ఢిల్లీ, ముంబైలలో జీవనవ్యయం భారం

» 'ఇండీడ్ పే మ్యాప్ సర్వే'లో వెల్లడి



న్యూఢిల్లీ, జూలై 3: అభివృద్ధి, నూతన టెక్నాలజీ, కొత్త ఉద్యోగాలు.. భారతదేశం రూపురేఖల్ని మార్చేస్తున్నాయి. పలు నగరాలు దేశ రాజకీయ, ఆర్థిక రాజధానులైన ఢిల్లీ, ముంబైలను దాటి కొత్త రికార్డులను నెలకొల్పుతున్నాయి. వేతనాల పెరుగుదల, ఉద్యోగావకాశాలకు సంబంధించి హైదరాబాద్, చెన్నై, అహ్మదాబాద్ నగరాలు అగ్రస్థానంలో ఉన్నాయని.. ఢిల్లీ, ముంబైలను అధిగమించి ముందుకు వెళ్లాయని 'ఇండీడ్' అనే సంస్థ పే మ్యాప్ సర్వే పేరుతో నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా 1300మంది కంపెనీల యజమానులు, 2500 మంది ఉద్యోగుల అభిప్రాయాలు సేకరించారు. వేతనాలు, వివిధ పరిశ్రమ రంగాలు, జీవనవ్యయం తదితర అంశాలపై వారిని ప్రశ్నించారు.

అనుభవానికి పెద్ద పీట

సర్వే ప్రకారం.. కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న వారికి చెన్నైలో అత్యధిక వేతనం లభిస్తోంది. ఆ నగరంలో ఫ్రెషర్లకు నెలకు సగటున రూ.30,100 జీతం ఇస్తున్నారు. ద్వితీయస్థానంలో ఉన్న హైదరాబాద్‌లో ఇది రూ.28,500గా ఉంటోంది. ఒక మోస్తరు అనుభవం ఉన్న వారికి ఇచ్చే వేతనానికి సంబంధించి మాత్రం హైదరాబాద్ అగ్రస్థానంలో ఉంది. 2-5 ఏళ్ల అనుభవం ఉన్న వారికి హైదరాబాద్‌లో నెలకు సగటున రూ.47,200, 5 నుంచి 8 ఏళ్ల అనుభవం ఉన్న వారికి రూ.69,700 జీతం లభిస్తోంది. హైదరాబాద్ తర్వాత స్థానాల్లో చెన్నై, అహ్మదాబాద్ ఉన్నాయి. టెక్నాలజీ, డిజిటల్ రంగాల్లో కెరీర్ ప్రగతి కోరుకుంటున్న వాళ్లు ప్రస్తుతం ఈ నగరాలకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని సర్వే వెల్లడించింది.

జీవన వ్యయం భారం

పెరుగుతున్న జీవన వ్యయానికి జీతం సరిపోతుందా అని సర్వేలో ప్రశ్నించగా.. 69 శాతం మంది లేదనే చెప్పటం గమనార్హం. వేతనం పెరుగుతున్నా కూడా రోజురోజుకీ అధికమవుతోన్న ఖర్చులకు అది సరిపోవటం లేదని వీరు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చెప్పిన వారు ఢిల్లీలో 96% మంది ఉండగా, ముంబైలో 95%, పుణెలో 94%, బెంగళూరులో 93% మంది ఉన్నారు. పెద్ద నగరాల్లో జీవనవ్యయం భరించలేని స్థాయికి చేరుకోవటం వల్లనే గ్రామాలు, పట్టణాల నుంచి ఎక్కువ మంది నగరాలకు రావటం లేదని పలువురు అభిప్రాయపడ్డారు.

ఐటీ, తయారీ.. ఆకర్షణీయ రంగాలు

ఐటీ, తయారీ, టెలికాం రంగాల్లో అధిక వేతనాలు లభిస్తున్నాయని సర్వేలో వెల్లడైంది. కొత్తగా చేరుతున్న వారికి ఈ రంగాల్లో నెలకు సగటున రూ.28,100 నుంచి రూ.28,300 వరకూ జీతం లభిస్తోంది. అనుభవం ఉన్న వారికి రూ.68,200 వరకూ సగటు వేతనం ఉంటోంది. ప్రొడక్ట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో గరిష్ఠ వేతనాలు (సగటున నెలకు రూ.85,500) దొరుకుతున్నాయి. వెబ్‌సైట్‌లు, యాప్‌లకు రూపకల్పన చేసే ఉద్యోగాల్లో ఉన్న నిపుణులకు (యూఐ, యూఎక్స్ డిజైనర్లకు) సాఫ్ట్‌వేర్ డెవలపర్లతో సమానంగా వేతనాలు లభిస్తున్నాయి. సీనియర్ స్థాయిల్లో సగటున నెలకు రూ.65,000 వేతనం ఉంటోంది. పెద్ద నగరాలు, పేరు మోసిన నగరాలకే ఉద్యోగాలు పరిమితం కావటం లేదని, దేశంలోని ఇతర నగరాలు కూడా ఉద్యోగ, ఉపాధి కేంద్రాలుగా మారుతున్నాయని, ఈ నగరాల్లో జీవన వ్యయం కూడా తక్కువగా ఉంటోందని సర్వే వెల్లడించింది.

నగరం - వేతనం (రూపాయల్లో)

	వృత్తిపరమైన అనుభవం		
	5-8 ఏళ్లు	2-5 ఏళ్లు	0-2 ఏళ్లు
హైదరాబాద్	69,700	47,200	28,500
అహ్మదాబాద్	69,000	46,200	27,300
చండీగఢ్	68,400	45,500	26,300
బెంగళూరు	67,100	46,000	28,400
చెన్నై	66,400	46,600	30,100
ముంబై	66,400	45,700	28,500
ఢిల్లీ	64,400	43,600	26,300

లోకం తీరు



మా దేశంలో 2500కు పైగా పార్టీలు

» ఘనా పార్లమెంట్‌లో ప్రధాని మోదీ

» ఆశ్చర్యం వ్యక్తం చేసిన అక్కడి ఎంపీలు

» మోదీకి 'ది స్టార్ ఆఫ్ ఘనా'తో సత్కారం

అక్రా, జూలై 3: పశ్చిమ ఆఫ్రికా దేశం ఘనాలో పర్యటిస్తున్న ప్రధాని మోదీ.. ఆ దేశ పార్లమెంట్‌లో ప్రజాస్వామ్యం గురించి గురువారం ప్రసంగించారు. ఘనాలో పర్యటించడం తనకు దక్కిన గౌరవమన్నారు. భారత్‌లో 2500కు పైగా రాజకీయ పార్టీలున్నాయని ఆయన చెప్పగా.. ఘనా ఎంపీలు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. ఇది చూసి ప్రధాని మళ్లీ అదే విషయాన్ని గట్టిగా ప్రస్తావించగా.. అంతా చిరునవ్వులు చిందించారు. భారత్‌లో ప్రజాస్వామ్యం అనేది ఓ వ్యవస్థ మాత్రమే కాదని.. ప్రాథమిక విలువల్లో భాగమన్నారు. భారత్‌ను ప్రజాస్వామ్యానికి తల్లిగా ఆయన అభివర్ణించారు. 'మా దేశంలో 22 పార్టీలు వివిధ రాష్ట్రాలను పాలిస్తున్నాయి. 22 అధికారిక భాషలున్నాయి. వేల కొద్ది మాండలికాలున్నాయి' అని వ్యాఖ్యానించారు. అంతకుముందు మోదీని 'ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' అవార్డుతో సత్కరించారు. ఇక పర్యటనలో భాగంగా రెండు దేశాల మధ్య పరిశోధన, అభివృద్ధి, ఔషధ తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి.



ఘనా పార్లమెంట్‌లో మాట్లాడుతున్న మోదీ

బలవర్ధక భారతం

» దేశంలో పెరిగిన ప్రొటీన్ వినియోగం

» అదే సమయంలో ఆందోళనకర స్థాయిలో కొవ్వు తినేస్తున్నారు

» కేంద్ర ప్రభుత్వ తాజా గణాంకాల వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 3: ప్రొటీన్ వినియోగంలో భారత్ బలవర్ధకంగా మారుతోందని కేంద్ర ప్రభుత్వ తాజా గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. అదే సమయంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అనే తేడాలేకుండా భారతీయులు కొవ్వు పదార్థాలను తెగ తినేస్తున్నారని, ఇది ఆందోళనకరమని కేంద్ర ప్రభుత్వ పరిధిలోని గణాంకాల కార్యాలయం బుధవారం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. 2009-10తో పోలిస్తే 2023-24 సంవత్సరంలో ప్రొటీన్, కొవ్వు పదార్థాల వినియోగం పెరిగిందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు 2009-10లో రోజుకు సగటున 59.3గ్రాముల ప్రొటీన్‌ను తీసుకోగా 2023-24 అది 61.8గ్రాములకు పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో ప్రొటీన్ వినియోగం 58.8 గ్రాముల నుంచి 63.4 గ్రాములకు పెరిగింది. ప్రజలు పప్పుధాన్యాలు, గుడ్లు, చేపలు, మాంసాన్ని ప్రొటీన్‌గా తీసుకుంటున్నట్లు నివేదిక తెలిపింది. నగరాలు, పట్టణాల్లో పప్పుధాన్యాల వినియోగం కొంత తగ్గడం గమనార్హం..! రాజస్థాన్, హరియాణా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌వంటి రాష్ట్రాల్లో ప్రొటీన్ వినియోగం స్వల్పంగా పడిపోయింది. ప్రొటీన్, కొవ్వు పదార్థాలను భారతీయులు ఎక్కువగా తీసుకోవడం ఆందోళనకరమని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు సగటు కొవ్వు పదార్థాల వాడకం 43.1 గ్రాముల నుంచి 60.4 గ్రాములకు, నగరాల్లో 53 గ్రాముల నుంచి 69.8 గ్రాములకు పెరిగింది.

ప్రజాగ్రహానికి తలవంచిన ఢిల్లీ సర్కారు

» పాత వాహనాల రద్దుపై ఆదేశాల అమలు నిలిపివేత

న్యూఢిల్లీ, జూలై3: ప్రజాగ్రహానికి ఢిల్లీ సర్కారు తలొగ్గింది. రోడ్లపై పాత వాహనాలు తిరగకూడదని, వాటికి బంకుల్లో ఇంధనం పోయకూడదంటూ ఇచ్చిన ఆదేశాలను ప్రస్తుతానికి పక్కనపెట్టింది. 15ఏళ్లు నిండిన డీజిల్ వాహనాలు, 10ఏళ్లు దాటిన పెట్రోలు వాహనాలను జీవితకాలం ముగిసిన (ఈఓఎల్) వాహనాలుగా గుర్తించి వాటికి ఇంధనం పోయకూడదంటూ ఆదేశాలుఇచ్చింది. ఈఓఎల్ విధాన ఉత్తర్వులు ఈనెల ఒకటో తేదీ నుంచి అమల్లోకివచ్చాయి. వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) ఈ ఉత్తర్వులను జారీ చేసింది. దీనిపై పెద్దయెత్తున వ్యతిరేకత రావడంతో ఆ ఆదేశాల అమలును నిలిపేసింది. పాత వాహనాలను గుర్తించి ఇంధనం పోయకూడదన్న ఆదేశాలను అమలు చేయడం చాలా కష్టమని ఢిల్లీ పర్యావరణ మంత్రి మన్‌జీందర్ సింగ్ సిర్సా గురువారం చెప్పారు. 10, 15ఏళ్లు దాటినా జాగ్రత్తగా నిర్వహిస్తున్న కార్లు, బైకులకు నష్టం కలిగించబోమన్నారు. నిర్వహణ సరిగ్గాలేని వాహనాల స్వాధీనాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఈఓఎల్ విధానంతో జాతీయ రాజధాని ప్రాంతంలోని 62లక్షల వాహనాలపై ప్రభా వం చూపనుండడంతో యజమానుల్లో ఆందోళన వ్యక్తమైంది.

జపాన్‌లో రేపు ఏం జరగనుంది?

జూలై 5న భయంకరమైన సునామీ వస్తుందని 1999లో చెప్పిన జపనీస్ మాంగా ఆర్టిస్ట్ టట్సుకీ

» కొవిడ్ గురించి, 2011లో జపాన్‌ను వణికించిన భూకంపం, సునామీలపై నిజమైన ఆమె జోస్యాలు

» రెండు వారాలుగా జపాన్‌లోని టొకారో దీవుల్లో 900కు పైగా భూప్రకంపనలతో ప్రజల్లో ఆందోళన



టోక్యో, జూలై 3: "జపాన్‌లో 2025 జూలై 5న ఒక పెనువిపత్తు సంభవిస్తుంది. జపాన్‌కి, ఫిలిప్పీన్స్‌కి నడుమ సముద్ర గర్భంలో చీలిక ఏర్పడుతుంది. దాని ప్రభావంతో 2011లో పెను విధ్వంసం సృష్టించిన సునామీకన్నా ఎత్తైన అలలు సముద్రంలో ఏర్పడతాయి"

..జపాన్‌కు చెందిన మాంగా ఆర్టిస్ట్, 'న్యూ బాబా వంగా'గా పేరొందిన ర్యోటట్సుకీ రాసిన 'ద ఫ్యూచర్ ఐ సా' పుస్తకంలో చెప్పిన జోస్యం ఇది! 1999లో మొదటిసారి ప్రచురితమైన ఈ పుస్తకం.. 2021 అక్టోబరులో పునఃప్రచురితమైంది. 2019లో ప్రపంచాన్ని కుదిపేసిన కొవిడ్ సహా ఆ పుస్తకంలో ఆమె చెప్పిన పలు జోస్యాలు నిజంకావడంతో ఇది కూడా నిజమవుతుందేమోనని జపనీయులు భయపడుతున్నారు. గత రెండువారాలుగా దక్షిణ జపాన్‌లోని టొకారా దీవుల్లో 900కుపైగా భూప్రకంపనలు నమోదవడం వారి భయాన్ని మరింత పెంచుతోంది. "ఎప్పుడూ కదులుతున్నట్టే ఉంది. నిద్రపోవాలంటే భయమేస్తోంది" అని ఆ దీవుల ప్రజలు వాపోతున్నారు. సునామీ భయంతో సురక్షిత ప్రాంతానికి తరలిపోవాలని భావిస్తున్నారు. జూన్ 21 నుంచి మొదలైన ఈ భూప్రకంపనల తీవ్రత క్రమంగా పెరుగుతూ తాజాగా 5.5 తీవ్రతతో ఒక భూకంపం నమోదుకావడంతో జపాన్ వాతావరణ సంస్థ అప్రమత్తమైంది. అయితే.. టట్సుకీ జోస్యాన్ని నమ్మలేమని, అలాంటి సునామీ వస్తుందనడానికి ఎలాంటి సహేతుకమైన, శాస్త్రీయ ఆధారాలూలేవని జపాన్ వాతావరణ సంస్థ అధికారులు కొట్టిపారేస్తున్నారు. 12 దీవుల సమాహారమైన టొకారాలో.. 7 దీవుల్లో 700 మంది నివసిస్తున్నారు. 4 ప్రధాన టెక్టానిక్ ప్లేట్ల నడుమ 'పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్'గా పేర్కొనే ప్రాంతంలో ఉండే జపాన్‌కు భూప్రకంపనలు కొత్తకాదు. ముఖ్యంగా టొకారో దీవుల్లో ఉండే వారికి భూప్రకంపనలు సాధారణమే. 2023 సెప్టెంబరులో అక్కడ 346 ప్రకంపనలు నమోదయ్యాయి. కానీ టట్సుకీ చెప్పిన తేదీ దగ్గర పడుతున్న సమయంలో ఇన్ని ప్రకంపనలు వారిని భయపెడుతోంది.

టూరిస్టులూ రావట్లే..

టట్సుకీ జోస్యం గురించి విస్తృతంగా ప్రచారంకావడంతో చైనా, దక్షిణ కొరియా, తైవాన్ దేశాల నుంచి జపాన్‌కు ఎక్కువగా వచ్చే పర్యాటకుల సంఖ్య మూడు నెలలుగా బాగా తగ్గిపోయింది. కిందటి ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో పర్యాటకుల సంఖ్య 50శాతం తగ్గింది. సాధారణంగా హాంకాంగ్ నుంచి జపాన్‌కు వెళ్లే పర్యాటకులు సంఖ్య ఎక్కువుంటుంది. జూన్-జూలై నెలల్లో హాంకాంగ్ నుంచి జపాన్‌కు విమాన టికెట్ల బుకింగ్‌లు 83శాతం పడిపోయాయి. బుకింగ్‌లు లేకపోవడంతో దక్షిణ జపాన్‌లోని పలు నగరాలకు ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో నడపాల్సిన విమానాలను హాంకాంగ్ ఎయిర్‌లైన్స్ రద్దు చేసింది. తస్మాత్ జాగ్రత్త: "2020 ఏప్రిల్‌లో ప్రపంచమంతా ఒక వైరస్ వ్యాపిస్తుంది.."అంటూ కొవిడ్ గురించి టట్సుకీ 1999లోనే జోస్యం చెప్పారు. అది నిజమైంది. ఆమె జోస్యం అక్కడితో ఆగలేదు. "ఆ వైరస్ కొంతకాలం పాటు మాయమై 2030లో మరింత ప్రాణాంతకంగా మారి మళ్లీ వస్తుంది"అని చెప్పారు. ఆమె చెప్పినట్టే జపాన్‌లో ఇప్పుడు సునామీవస్తే 2030ని తల్చుకుని ప్రపంచం వణికిపోవడం ఖాయం!!

పెళ్లయిన 45 రోజులకే భర్తను చంపించింది!

» ఇద్దరు కిరాయి హంతకులతో హత్య చేయించిన వధువు

» పెళ్లికి నెలన్నర ముందు నుంచి మేనమామతో వివాహేతర సంబంధం.. బిహార్‌లో ఘటన

పట్నా, జూలై 3: మేఘాలయలో హనీమూన్ హత్య ఘటన తరహాలోనే బిహార్‌లోని ఔరంగాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. పెళ్లయిన 45 రోజులకే ఓ యువతి, తన ప్రియుడి సహకారంతో భర్తను కిరాయి హంతకులతో చంపించింది. నిందితురాలు 23ఏళ్ల గుంజాదేవి. ఆమెకు నబీన్‌నగర్ సమీపంలోని బర్వాన్ గ్రామానికి చెందిన ప్రియాంశు (25)తో పెళ్లయింది. ఈ వివాహం ఆమెకు ఇష్టంలేదు. పెళ్లికి నెలన్నర ముందు నుంచి గుంజాదేవికి తన మేనమామ జీవన్‌సింగ్ (55)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. గుంజాదేవి-జీవన్ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. దీనికి ఇరువైపుల పెద్దలు అంగీకరించలేదు. ఆ తర్వాత ప్రియాంశుతో గుంజాదేవికి బలవంతంగా పెళ్లి జరిపించారు. ఆ తర్వా త కూడా.. జీవన్‌ను ఆమె మరిచిపోలేకపోయింది. భర్త ప్రియాంశును హత్య చేయించేందుకు జీవన్ సహకారంతో ఇద్దరు కిరాయి హం తకులను మాట్లాడుకుంది. జూన్25న తన సోదరిని కలిసేందుకు వెళ్లిన ప్రియాంశు నబీనగర్ రైల్వే స్టేషన్‌లో దిగాడు. తనను తీసుకెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు ఎవరినైనా పంపాలని గుంజాదేవికి ఫోన్ చేశాడు. దీన్నే అవకాశంగా తీసుకున్న ఆమె కిరాయి హంతకులను రైల్వే స్టేషన్‌కు పంపింది. వారు ప్రియాంశును బైక్‌పై ఎక్కించుకొని మార్గమధ్యలో తుపాకీతో కాల్చిచంపారు. ఈ ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఎస్పీ ఏర్పాటు చేశారు. కుటుంబసభ్యులను పోలీసులు ప్రశ్నిస్తుండటంతో భయపడి అత్తగారి ఇంట్లోంచి పారిపోయేందుకు ప్రయత్నించిన గుంజాదేవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలి ఫోన్‌లో కాల్‌లిస్ట్‌ను పరిశీలించిన పోలీసులు.. భర్త హత్యకు గురైన రోజు జీవన్ నంబర్‌కు ఆమె పదేపదే ఫోన్ చేసినట్లు గుర్తించారు. గుంజాదేవి నుంచి హత్యకు సుపారీ తీసుకున్న ఇద్దరిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న జీవన్‌ను పట్టుకునే పనిలో ఉన్నారు. కాగా ఔరంగాబాద్ జిల్లా నబీనగర్ సమీపంలో రెండు వారాల క్రితం ఇలాంటి ఘటనే జరిగింది. పెళ్లయిన కొన్నిరోజులకే పూజ అనే యువతి, తన ప్రియుడు కమలేశ్ యాదవ్‌తో కలిసి భర్త బిక్కూను హత్యచేసేందుకు యత్నించింది.

యువతిని రేప్ చేసి.. ఆమె ఫోన్‌తో సెల్ఫీ దిగి!

» కొరియర్ బాయ్‌నని చెప్పుకొని ఇంట్లోకి ప్రవేశించిన దుండగుడు..

» పుణెలోని రెసిడెన్షియల్ సొసైటీలో ఘోరం

పుణె, జూలై 3: డెలివరీ బాయ్‌నని చెప్పుకొని ఇంట్లోకి చొరబడ్డ దుండగుడు ఒంటరిగా ఉన్న యువతి (22)పై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫోన్‌తోనే అతడు సెల్ఫీ దిగి.. 'నేను మళ్లీ వస్తా'అంటూ బెదిరింపు సందేశాన్నుంచడం గమనార్హం! పుణెలోని అత్యంత కట్టుదిట్టమైన భద్రత గల కోండ్వాలోని రెసిడెన్షియల్ సొసైటీలో ఈ ఘటన జరిగింది. కొరియర్ డెలివరీ బాయ్‌గా చెప్పుకొని దుండగుడు యువతి ఉంటున్న ఫ్లాట్‌కు వెళ్లాడు. బ్యాంకు నుంచి లెటర్ వచ్చిందని సంతకం చేసి తీసుకోవాలంటూ యువతితో దుండగుడు చెప్పాడు. పెన్నుందా? అని అడిగిన యువతి, అతడు తన వద్ద లేదని చెప్పడంతో తెచ్చేందుకు ఆమె పడకగదిలోకి వెళ్లింది. వెంటనే ఇంట్లోకి ప్రవేశించిన దుండగుడు పడకగదిలోకి వెళ్లి ఆమె ముఖంపై మత్తు మందు స్ప్రే కొట్టాడు. స్పృహ కోల్పోయిన ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలికి మెలకువ వచ్చేసరికి ఫోన్లో.. 'నేను మళ్లీ వస్తాను'అనే మెసేజ్ ఉంది. దుండగుడు ఆమె ఫోన్‌తోనే సెల్ఫీ దిగాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

తిరుమల ఘాట్‌లో ఏనుగుల గుంపు

తిరుమల, జూలై 3(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో గురువారం రాత్రి ఏనుగుల గుంపు సంచారం కలకలం సృష్టించింది. పిల్ల ఏనుగులతో పాటు మొత్తం ఏడు ఏనుగులు గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఏనుగుల ఆర్చ్ వద్దనున్న రోడ్డు సమీపానికి వచ్చాయి. దీంతో వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది అక్కడికి చేరుకుని టార్చ్‌లైట్లు వేస్తూ సైరన్లు మోగించడంతో ఏనుగుల గుంపు తిరిగి అడవిలోకి వెళ్లిపోయింది. అనంతరం ఫారెస్ట్, విజిలెన్స్ సిబ్బంది వాహనదారులను అప్రమత్తం చేసి పంపారు.


ఘాట్ రోడ్డు సమీపానికి వచ్చిన ఏనుగులు

'ది డెక్'లో రైల్వే జోనల్ కార్యాలయం

▸▸ ఒక అంతస్థు కేటాయించాలని వీఎంఆర్‌డీఏకు లేఖ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగరాభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) సిరిపురం జంక్షన్‌లో నిర్మించిన మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ భవనం(ది డెక్)లో దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం ఏర్పాటు కానుంది. నగరం నడిబొడ్డున షిప్ డెక్ మోడల్‌లో నిర్మించిన ఈ నిర్మాణం అందరినీ ఆకట్టుకుంటోంది. ఇది 12 అంతస్థుల భవనం కాగా అందులో మూడు బేస్‌మెంట్లు, గ్రౌండ్ ఫ్లోర్, ఏడు అంతస్థులు, టెర్రస్ ఉన్నాయి. పార్కింగ్‌కు కేటాయించిన ప్రాంతంలో 440 కార్లు, 250 ద్విచక్ర వాహనాలు నిలపవచ్చు. వీఎంఆర్‌డీఏ అవసరాలకు పోను మిగిలిన వాటిని (ఐదు అంతస్థులు-గ్రౌండ్ ఫ్లోర్, 3వ అంతస్థు, అందులో డెక్, 6వ అంతస్థు, ఏడో అంతస్థు, టెర్రస్) అద్దెకు ఇస్తామని ఇటీవల ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఐదో అంతస్థును రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కోసం తీసుకుంది. నాలుగో అంతస్థును ఐటీ కార్యకలాపాల కోసం తీసుకునేందుకు భెల్ సంస్థ ఒప్పందం చేసుకుంది. తాజాగా విశాఖ రైల్వే అధికారులు ఆ భవనాన్ని పరిశీలించి రెండు అంతస్థులు తమకు ఇవ్వాలని కోరారు. అయితే ఒకటి (ఆరో అంతస్థు) సరిపోతుందని పేర్కొంటూ వీఎంఆర్‌డీఏ అధికారులకు గురువారం లేఖ సమర్పించారు. అందులో దక్షిణ కోస్తా రైల్వే జోన్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఏర్పాటు చేస్తారని భావిస్తున్నారు. ఈ భవనంలో స్థలం కోసం పలు ఐటీ కంపెనీలు, రెస్టారెంట్ల నిర్వహణ వాణిజ్య సంస్థలు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నాయి.

గుంటూరు, గుంతకల్లు రైల్వే డివిజన్‌లకు 'కవచ్'

▸▸ రూ.204 కోట్లతో ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల



గుంటూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు, గుంటూరు రైల్వే డివిజన్‌ల పరిధిలో కవచ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు రైల్వే శాఖ నిర్ణయించింది. ఇందుకోసం రైల్వేబోర్డు నుంచి అనుమతి రావడంతో దక్షిణ మధ్య రైల్వే టెండర్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనికి రూ.204 కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనా వేసింది. ప్రధానంగా రైల్వేస్టేషన్లు, లెవల్ క్రాసింగ్ గేట్లు, ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నల్, ఇంటర్మీడియట్ బ్లాక్ సిగ్నల్స్, రిమోట్ ఇంటర్‌ఫేర్ యూనిట్ల వద్ద ఈ కవచ్‌లను ఏర్పాటు చేస్తారు. ఈ వ్యవస్థ వలన ఎదురెదురుగా, వెనక నుంచి రైళ్లు ఢీకొనే అవకాశం ఉండదు. ప్రమాదరహిత డివిజన్లుగా గుంటూరు, గుంతకల్లు మారనున్నాయి.

కాంట్రాక్టు లెక్చరర్లకు 'సర్దుబాటు' శిక్ష!

▸▸ పాలిటెక్నిక్‌లలో వందల కిలోమీటర్ల దూర ప్రాంతాలకు విధుల మార్పు

▸▸ జోన్లు మార్చి సుదూర ప్రాంతాలకు.. అంత దూరం ఎలా వెళ్లాలని లెక్చరర్ల ఆందోళన

అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కాంట్రాక్టు లెక్చరర్లకు సాంకేతిక విద్యాశాఖ అధికారులు 'పని సర్దుబాటు' పేరుతో వందల కిలోమీటర్ల దూరంలోని కాలేజీలకు పంపడం విమర్శలకు దారితీసింది. ఎక్కడో జోన్-4లో పనిచేస్తున్న వారిని దాదాపు వెయ్యి కిలోమీటర్ల దూరంలోని జోన్-1 పాలిటెక్నిక్‌లకు పంపుతూ ఆదేశాలు జారీచేశారు. ఇటీవల రెగ్యులర్ లెక్చరర్ల బదిలీల అనంతరం.. పని సర్దుబాటు చేసి 57 మంది కాంట్రాక్టు లెక్చరర్లను సుదూ ర ప్రాంతాలకు పంపారు. దీనిపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేరే దారిలేక వారిలో పలువురు కొత్త స్థానాల్లో రిపోర్ట్ చేసి, వెంటనే సెలవుపై వెళ్లిపోయారు. తమకు న్యాయం చేయాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. సాంకేతిక విద్యాశాఖ ఇటీవల లెక్చరర్ల బదిలీ చేపట్టింది. ఆ తర్వాత జూన్ 24న ఆన్‌లైన్‌లో కాంట్రాక్టు లెక్చరర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి పని సర్దుబాటు చేసింది. కాగా, రెగ్యులర్ లెక్చరర్లనే జోన్ దాటి బదిలీ చేయ రు. కాంట్రాక్టు లెక్చరర్లకు బదిలీలే ఉండవు. అయితే సర్దుబాటు పేరుతో ఇష్టమొచ్చినట్లు వారిని సుదూర ప్రాంతాలకు పంపడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

వెళ్లకపోతే ఉద్యోగం పోతుందని బెదిరింపులు!

కర్నూలు జిల్లాలో మెకానికల్ విభాగంలో పనిచేస్తున్న ఓ మహిళా లెక్చరర్‌ను 885 కిలోమీటర్ల దూరంలో ఉన్న విజయనగరంలోని గుమ్మ లక్ష్మీపురం పాలిటెక్నిక్‌కు సర్దుబాటు చేశారు. తిరుపతి జిల్లా గూడూరులో పనిచేస్తున్న ఫిజిక్స్ లెక్చరర్‌ను దాదాపు 820 కిలోమీటర్ల దూరంలోని టెక్కలికి పంపారు. ఒంగోలులోని కెమిస్ట్రీ లెక్చరర్‌ను తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురానికి, నెల్లూరులోని ఓ ఫిజిక్స్ లెక్చరర్‌ను సుమారు 800 కిలోమీటర్ల దూరంలో ఉన్న పార్వతీపురం మన్యంలోని సీతంపేటకు సర్దుబాటు చేశారు. మరో ఆటోమొబైల్ లెక్చరర్‌ను కర్నూలు నుంచి రాజమండ్రికి పంపించారు. ఇలా జోన్-3, 4కు చెందిన 57 మందిని జోన్-2, 3లకు సర్దుబాటు చేశారు. అందులోనూ 50 మందిని జోన్-1కు పంపారు. గతంలో రెగ్యులర్ లెక్చరర్లను జోన్లు దాటి బదిలీ చేయడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. అలాంటప్పుడు కేవలం కాంట్రాక్టుపై పనిచేస్తున్న తమను ఇన్ని వందల కిలోమీటర్లు ఎలా పంపుతారని కాంట్రాక్టు లెక్చరర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులను కలిసే ప్రయత్నం చేయగా.. అవకాశం ఇవ్వడం లేదని, వెళ్లకపోతే ఉద్యోగం పోతుందని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక ప్రణాళిక


▸▸ ఏలూరులో 'ఈగల్' ఐజీ రవికృష్ణ వెల్లడి

▸▸ అక్రమ రవాణా సమాచారంతో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు

ఏలూరు క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయిని రూపుమాపేందుకు ప్రత్యేక ప్రణాళికతో 'ఆపరేషన్ విజయ్' నిర్వహిస్తున్నామని ఈగల్ టీమ్ ఐజీ ఎ.రవికృష్ణ పేర్కొన్నారు. ఇందులో భాగంగా గురువారం ఏలూరు రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక పోలీసు బలగాలు, జాగిలాలతో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలును తనిఖీ చేశారు. ఏలూరు నుంచి విజయవాడ వరకూ ఈ తనిఖీలు చేపట్టారు. ఐజీ రవికృష్ణ మీడియాతో మాట్లాడుతూ ఒడిశా నుంచి రైళ్లల్లో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం ఉండడంతో తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఆరు నెలల్లో రాష్ట్రంలో 21,736 కేజీల గంజాయి పట్టుకుని, నిందితులను అరెస్టు చేశామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 375 గ్రామాల్లో 359 కుటుంబాలు గంజాయి సాగు చేయడంతో.. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించామని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలుగా 22 రకాల వివిధ జాతుల 46 లక్షల మేర మొక్కలను 10,256 మంది రైతులకు అందజేశామన్నారు. పదేపదే గంజాయి స్మగ్లింగ్ చేసే వారిని గుర్తిస్తున్నామని, ఐదు కేసుల్లో ఎన్‌డీపీఎస్ చట్టం చాప్టర్-5ఏ ప్రకారం వారికి సంబంధించిన రూ.7 కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేశామని వివరించారు. ఇంకా 16 కేసుల్లో ఆస్తులు సీజ్ చేయడానికి ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు.


ఏలూరులో రైలును తనిఖీ చేస్తున్న ఈగల్ టీమ్ ఐజీ రవికృష్ణ, ఈగల్ ఎస్పీ నగేష్‌బాబు, ఏలూరు ఎస్పీ కిశోర్, ఏఎస్పీఎన్.సూర్యచంద్రరావు

శాంతి నారాయణకు తెలుగు వర్సిటీ పురస్కారం



అనంతపురం టౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాకు చెందిన సాహితీ వేత్త, విమలా శాంతి సాహిత్య సామాజిక సేవా సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతి నారాయణకు తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారం ప్రకటించింది. సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు గురువారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాలకు చెందిన 12 మందిని తెలుగు వర్సిటీ పురస్కారాలకు ఎంపిక చేసింది. సాహిత్య విభాగంలో(నవల, కథా ప్రక్రియ) ఉభయ తెలుగు రాష్ట్రాల తరపున శాంతి నారాయణను ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో త్వరలో పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించి, శాంతి నారాయణకు పురస్కారం, రూ.20,116 నగదు బహుమతి అందజేసి సత్కరిస్తామని రిజిస్ట్రార్ తెలియజేశారు.


ఉద్యోగ జేఏసీ నూతన చైర్మన్ విద్యాసాగర్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ డి.వి.రమణను సత్కరిస్తున్న ఉద్యోగులు

ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

▸▸ ప్రభుత్వానికి ఏపీ ఎన్జీజీఓ విజ్ఞప్తి

▸▸ ఉద్యోగ జేఏసీ చైర్మన్‌గా విద్యాసాగర్, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా డి.వి.రమణ ఎన్నిక

విజయవాడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కార్యాచరణ ప్రకటించాలని ఏపీ ఎన్జీజీఓ జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి(జేఏసీ) నూతన చైర్మన్‌గా విద్యాసాగర్, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా డి.వి.రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం గురువారం విజయవాడలోని ఎన్జీజీఓ హోమ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పదవిని అలంకారంగా కాకుండా బాధ్యతగా భావిస్తానన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోవడం వల్లే ఎన్నికల్లో నూతన ప్రభుత్వానికి మద్దతు పలికామన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు రూ.27 వేల కోట్లు బకాయిలు పెట్టిందని, సంవత్సర కాలంలో ఈ ప్రభుత్వం రూ.7500 కోట్లు ఉద్యోగులకు చెల్లించిందని విద్యాసాగర్ పేర్కొన్నారు. ఇప్పటికీ మూడు డీఏలు ప్రభుత్వం నుంచి బకాయి ఉండగా, జూలైలో నాలుగో డీఏ ప్రకటించాల్సి ఉందన్నారు. కేవలం వైద్య, ఉపాధ్యాయ రంగాల్లో ఉన్న పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్నారని తెలిపారు. 2004కు ముందు ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారికి ఓపీఎస్ విధానం అమలుచేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కేఎస్ఎస్ ప్రసాద్ కోరారు.

ఇండోసోల్ కోసం ఊరినే ఖాళీ చేయిస్తారా: షర్మిల

అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): 'ఇండోసోల్ కోసం ఊరినే ఖాళీ చేయిస్తారా..! ఇది కూటమి ప్రభుత్వ నియంత పోకడకు నిదర్శనం. ఊరిని చంపి పరిశ్రమను పెడతామంటే చూస్తూ ఊరుకునేది లేదు' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హెచ్చరించారు. గురువారం ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. 'గత వైసీపీ ప్రభుత్వం షిరిడీ సాయి అనుబంధ కంపెనీకి అనుమతులు ఇస్తే... ఇప్పుడు కూటమి ప్రభుత్వం గ్రామ సభలు జరపకుండానే భూములు కేటాయిస్తోంది. మూడు పంటలు పండే పచ్చటి పొలాల్లో పరిశ్రమలు వద్దంటున్న రైతుల గోడును కూటమి ప్రభుత్వం వినడం లేదు. షిరిడీ సాయి సోలార్‌కు కేటాయించిన కరేడు గ్రామంలోని భూములపై ప్రభుత్వం వెనక్కు తగ్గాలి. రైతులది బతుకు పోరాటం. పచ్చటి పొలాల్లో ప్రజాభిప్రాయాన్ని సేకరించకుండా భూసేకరణకు నోటిఫికేషన్ ఇవ్వడం దుర్మార్గం. సోలార్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా కరేడు గ్రామ రైతులు చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది. పరిశ్రమల ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదు. అలా అని రైతుల శవాల మీద అక్రమంగా భూ సేకరణ చేయాలని చూస్తే మాత్రం సహించేది లేదు' అని షర్మిల పేర్కొన్నారు.

నేను రాకముందే ఓఎంసీ లీజు నిర్ణయం

▸▸ నేను అమలు చేశాను... అంతే: టీహైకోర్టులో ఏపీ సీనియర్ ఐఏఎస్ శ్రీలక్ష్మి

హైదరాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): 'ఓబులాపురం మైనింగ్ కంపెనీకి లీజుల కేటాయింపుపై నేను పరిశ్రమల శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించే నాటికే నిర్ణయం జరిగిపోయింది. నాకంటే ముందున్న పరిశ్రమల శాఖ కార్యదర్శి, ఆ శాఖ మంత్రి, కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నాయి' అని ఏపీ సీనియర్ ఐఏఎస్ శ్రీలక్ష్మి తెలంగాణ హైకోర్టుకు నివేదించారు. శ్రీలక్ష్మి క్రిమినల్ అప్పీల్ (డిశ్చార్జి) పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం గురువారం విచారణ కొనసాగించింది. శ్రీలక్ష్మి తరపున సీనియర్ న్యాయవాది వివేక్‌రెడ్డి వాదించారు. 'పరిశ్రమల శాఖ కార్యదర్శిగా నేను 2006, మే 17న బాధ్యతలు తీసుకున్నా. అప్పటికే నాకంటే ముందు ఉన్న కార్యదర్శి కృపానందం, మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఓఎంసీకి లీజు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అటవీ అనుమతులు సైతం ఇచ్చేసింది. నేను వచ్చిన తర్వాత నాకంటే ముందున్న వారి నిర్ణయాలను అమలు చేసే ప్రాసెస్ మాత్రమే చేశా. లీజు జీవోలో క్యాప్టివ్ మైనింగ్ అనే పదం కావాలనే పెట్టలేదు అని సీబీఐ ఆరోపిస్తోంది. అసలు క్యాప్టివ్ మైనింగ్ అనే షరతు విధించరాదని కేంద్ర ప్రభుత్వమే ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం వద్దన్న షరతును పెట్టాలని సీబీఐ ఎలా కోరుకుంటుంది? నా కంటే ముందున్న కార్యదర్శి, అప్పటి మంత్రి నిర్దోషులుగా తేలిన తర్వాత నా పాత్రను ఎలా తప్పుబడతారు?" అని ప్రశ్నించారు. తదుపరి విచారణ ఈ నెల 10కి వాయిదాపడింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సాంత్వననివ్వని క్వాడ్

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పాతికమంది పర్యాటకులను ఉగ్రవాదులు చంపివేసిన ఘటనను క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశం ఖండించినందుకు సంతోషించాల్సిందే. 'ఉగ్రవాద, తీవ్రవాద చర్యలను క్వాడ్ ఖండిస్తుంది,ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు మా సహకారం ఉంటుంది, ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ దాడిపై త్వరగా దర్యాప్తు పూర్తిచేసి, నేరస్థులనూ వారిని ప్రోత్సహించేవారినీ శిక్షించాలి' అని ఆ ప్రకటన పేర్కొంది. అమెరికాలో జరిగిన ఈ సమావేశంలో భారతవిదేశాంగ మంత్రి జయశంకర్ ప్రసంగిస్తూ, పహల్గాం ఉగ్రదాడి, అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి లోతుగా వివరించారు. ఉగ్రవాదులనుంచి తన ప్రజలను రక్షించుకొనే హక్కు భారత్‌కు ఉన్నదన్న భారత్ వాదనను క్వాడ్ భాగస్వాములు అర్థంచేసుకున్నారంటూ ఆయన కృతజ్ఞతలు కూడా తెలియచేశారు. ఆపరేషన్ సిందూర్‌ను ఆపింది నేనేనని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అదేపనిగా అంటున్నప్పటికీ, భారత్ ప్రతీకారదాడిని క్వాడ్ దేశాలు మౌనంగా ఆమోదించాయనే అనుకుందాం. అయితే, పహల్గాం దాడికి కారకులైనవారినీ, ఆ ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్నవారినీ శిక్షించాలన్న ఓ సాధారణ వ్యాఖ్యతో ఖండనను సరిపెట్టడం మాత్రం చాలామంది రాజకీయ విశ్లేషకులకు నచ్చడం లేదు. ఉగ్రదాడి కారకులూ, ప్రోత్సాహకులు ఎవరో తెలిసికూడా, శిక్షపడాల్సినవారూ శిక్షించాల్సినవారూ కలసి చేసిన కుట్ర ఇది అన్న గుర్తింపు ఉండి కూడా పాకిస్థాన్ పేరు క్వాడ్ ప్రస్తావించకపోవడం సరికాదని వారి అభిప్రాయం. బాధితులనూ, నేరస్థులనూ సమానంగా చూడకండని అంతగట్టిగా బల్లగుద్దిన విదేశాంగమంత్రి, పహల్గాం ఉగ్రఘాతుకాన్ని ప్రస్తావించి, ఖండించినందుకే సంతోషపడటం రాజకీయ విశ్లేషకులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. చైనామీద ఎన్నడూ లేనంతగా విరుచుకుపడిన ఆ సంయుక్త ప్రకటనలో, పహల్గాంతో ముడిపడిన పాక్ ప్రస్తావన కూడా కాస్తంత స్పష్టంగా ఉండివుంటే మరింత బాగుండేది.

ఇది సీమాంతర ఉగ్రవాదం, పాకిస్థాన్ నుంచి చొరబడిన టెర్రరిస్టులు పర్యాటకులమీద ఈ దారుణానికి ఒడిగట్టారని భారత్ ప్రపంచానికి స్పష్టంగా చెబుతోంది. ఈ మధ్యనే జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సివో) సదస్సులో పహల్గాం ప్రస్తావన చేయనందుకు భారత్‌కు ఆగ్రహం కలిగింది. బలూచిస్థాన్ రైలుదాడి ఘటనను ప్రస్తావించి, పహల్గాం ఊసెత్తనందుకు అవమానం కూడా మిగిలింది. పైగా, బలూచ్ ఉగ్రవాదులకు భారత్ సహకరిస్తోందని పాకిస్థాన్ ఈ సదస్సులో విరుచుకుపడింది కూడా. అయినా, పాకిస్థాన్‌ను పల్లెత్తు మాట అననీయకుండా చైనా ఈ సదస్సులో అడ్డుపడిందన్నది సుస్పష్టం. రష్యా కూడా సభ్యదేశంగా ఉన్నా ఆ సదస్సులో మనకు అన్యాయమే జరిగింది. ఈ నేపథ్యంలో, సంయుక్త ప్రకటనపై సంతకం చేసేందుకు నిరాకరించి రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చాలా మంచిపనిచేశారు.

మరి, కరడుగట్టిన చైనా వ్యతిరేక క్వాడ్ కూటమి సమావేశంలో పాకిస్థాన్‌ను ఓ మాట అనకుండా ఆపిందెవరు? పాకిస్థాన్ ఊసెత్తకుండా పహల్గాం ప్రస్తావన చేయడానికి మనం అంగీకరించడంతో నాలుగుదేశాలూ కలిసి ఒక్కమాటగా ఈ నాలుగుమాటలైనా అనగలిగాయట. అమెరికా అధ్యక్షుడికి మనమీద ప్రేమనశించి, పాకిస్థాన్ మీద మనసు పడుతున్న ఈ కాలంలో ఈ మాత్రం సాధించడమే గగనమనుకోవచ్చు. పహల్గాం పాపానికి మేమేకారకులమని ప్రకటించిన రెసిస్టెన్స్‌ఫ్రంట్ పేరును కూడా ఆఖరునిముషంలో ఐక్యరాజ్యసమితి తీర్మానంనుంచి తీసివేయించిన గతాన్ని గుర్తుచేసుకుంటే క్వాడ్ తీర్మానం బాగున్నట్టే. ఎస్‌సివో, క్వాడ్ రెండూ భిన్న ధ్రువాలు. వాటి నిర్మాణం, నేపథ్యం, భౌగోళిక దృక్కోణం పూర్తిగా వేరు. ఆసియాలో పాశ్చాత్యదేశాల ప్రాభవ ప్రభావాలను అడ్డుకోవడానికి ఎస్‌సీవో ఏర్పడితే, చైనా వీరంగానికి ముకుతాడు వేయడానికి క్వాడ్ పుట్టుకొచ్చింది. భారత్ సహకారంలేకుండా ఈ సంస్థ ఆవిర్భావ లక్ష్యం నెరవేరదన్నది నిజం. చైనాను నియంత్రించాలంటే బలమైన భారత్‌ను మరింత బలోపేతం చేయాల్సిందే. ఇటీవలి ఎస్‌సివో సంయుక్త ప్రకటనను పాక్ అనుకూల తీర్మానంగా మన విశ్లేషకులు అభివర్ణించారు. మరి, క్వాడ్ తీర్మానం బాధలో ఉన్న భారత్‌ను సముచితంగా ఓదార్చిందా? అన్నది ప్రశ్న.

'న్యూ ఇండియా'లో నిరర్థక భాషా సమరాలు



భాషాయుద్ధాలు చేస్తున్నవారు తాము విఫలం కానున్న పోరాటాలు చేస్తున్నామనే సత్యాన్ని గ్రహించాల్సిన అవసరమున్నది. అవి తాత్కాలిక రాజకీయ లబ్ధినివ్వవచ్చునేమో కాని నిరవధిక ప్రయోజనాలను సమకూర్చలేవు. భాషా వైవిధ్యమే భారతదేశ మహా బలం. బహు–భాషా నైపుణ్యాలు స్పర్థాత్మక సానుకూలతలను కల్పిస్తాయి. కొత్త ఆలోచనలు చేయలేని రాజకీయవేత్తలే భాషా దురహంకారాన్ని పనిగట్టుకుని ప్రోత్సహిస్తున్నారు. అయితే యువ భారతీయులలో అత్యధికులు ఉద్యోగార్థులే గానీ భాషా దురభిమానులు కానే కారు.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

'ఈ దేశంలో ఇంగ్లీషు మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు రానున్నాయి. అటువంటి భారత దేశ ఆవిర్భావం మరెంతో దూరంలో లేదు' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభిభాషించారు 'మరాఠీ భాషీయులపై హిందీని రుద్దేందుకు జరిగే ఎటువంటి ప్రయత్నాన్ని సహించబోమని' మహారాష్ట్ర నవ్‌నిర్మాణ్ సేన నాయకుడు రాజ్ థాక్రే గర్జించారు. 'మరాఠీ మాతృభాషగా ఉన్న ప్రజల్లో హిందీ ద్వారా విభజనలు సృష్టించేందుకు ఎట్టి పరిస్థితులలోను పూనుకోవద్దు' అని శివసేన (యూబీటీ) నాయకుడు ఉద్ధవ్ థాక్రే హెచ్చరించారు. 'తమిళనాడులో తమిళ భాషకు యుక్తమైన స్థానముండాలని గట్టిగా కోరడం నేరమా? అలా కోరినందుకే, తమ భాషే అన్నిటికీ అర్హమైనదని సంకుచితంగా ఆలోచించే కొంతమంది మనలను తమిళ భాషా దురభిమానులు అని నిందిస్తున్నారు; తమిళ భాషావాదులు జాతివ్యతిరేకులు అని ఆక్షేపిస్తున్నారు. నిజానికి భాషా దురభిమానులు ఎవరు? హిందీ భాషా దురహంకారులే. జాతీయ భాషా ప్రతిపత్తి హిందీ హక్కు అని ఆ భాషా దురహంకారులు విశ్వసిస్తున్నారు. ఆ అభిజాత్యాన్ని, ఆధిపత్యాన్ని మనం ప్రతిఘటించడాన్ని దేశద్రోహంగా వారు పరిగణిస్తున్నారు' అని తమిళనాడు ముఖ్య మంత్రి ఎమ్‌కే స్టాలిన్ నిరసించారు.

మన రాజకీయ పార్టీల అజెండాలలో భాషా 'యుద్ధాలు' మళ్లీ ప్రాధాన్యం పొందుతున్నాయి. భాషా దురభిమానం స్వతంత్ర భారత రాజకీయాలలో మొదటి నుంచీ ఒక రాజకీయ ఆయుధంగా ఉపయోగపడుతూ వస్తోంది. సుదీర్ఘ విరామమనంతరం రాజకీయులు మళ్లీ ఆ అస్త్రాన్ని ఝుళిపిస్తున్నారు. అది తుప్పుపట్టి పోయిందని ప్రజలు భావిస్తున్నారు. దాన్ని ప్రయోగిస్తున్నవారు తమ కపట ఉద్దేశాలను కప్పిపుచ్చగలరా? కాలం కుమ్మరించిన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే నాయకులు సంకుచిత రాజకీయ అజెండాలను తలకెత్తుకుంటున్నారు.

అమిత్ షా మనోవేదన ఏమిటి? ఆంగ్ల భాషా ప్రాభవంపై ఆయన అయిష్టత, ఆగ్రహం సంఘ్ పరివార్ హిందీ–హిందూ–హిందుస్తాన్ భావజాల జనితాలే, సందేహం లేదు. ఇంగ్లీషు వలస పాలన అవశేషమని, 'భారతీయ సంస్కృతి'కి అది విరుద్ధమైనదని ఆ భావజాలం విశ్వసిస్తుంది. అమిత్ షా ఆ భావజాల అనుయాయుడు. అయితే మన హోం మంత్రి తన విద్యార్థి జీవితంలో అహ్మదాబాద్‌లోని సెయింట్. జేవియర్ కళాశాలలో ఒక బయోకెమిస్ట్రీ కోర్సులో చేరారు. ఆ కళాశాల ఆంగ్ల విద్యాధికులు అయిన ఉన్నతవర్గాల వారి విద్యాలయంగా సుప్రసిద్ధమైనది. ఆ తరువాత ఆయన అదే నగరంలోని సీయూ షా కళాశాలకు మారారు. అమిత్ షా తనయుడు జే షా (క్రికెట్ క్రీడా సామ్రాజ్య సర్వోన్నత సంస్థ ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు) అహ్మదాబాద్‌లోని లయోలా హాల్‌లో చదివారు. ఉన్నత వర్గాలవారు తమ పిల్లల విద్యాభ్యాసానికి అగ్రప్రాధాన్యమిచ్చే ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో అదొకటి.

అయినా అమిత్ షా ఆంగ్ల భాష పట్ల తన అసహ్యాన్ని ఎన్నడూ దాచుకోలేదు. అహ్మదాబాద్‌లోని సీనియర్ జర్నలిస్ట్ ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. ఆయన 'టైమ్స్ ఆఫ్ ఇండియా' విలేఖరి. భారతదేశ అగ్రగామి వార్తాపత్రిక అయిన ఆ దినపత్రికను తాను చదవనే చదవనని రాజీవ్‌కు ఒకసారి అమిత్ షా (గుజరాత్ మంత్రిగా ఉన్న కాలంలో) చెప్పారట. అది ఇంగ్లీష్ డైలీ కావడమే అందుకు కారణమని కూడా ఆయన సెలవిచ్చారు. నెలల అనంతరం ఒక ఎన్నికల ప్రచార సభలో రాజీవ్‌ను చూసిన అమిత్ షా టైమ్స్ ఆఫ్ ఇండియాలో వచ్చిన ఒక వార్త విషయమై ఆక్షేపణ తెలిపారట. మీరు ఇంగ్లీష్ పత్రికలు చదవరు కదా ఆ వార్త విషయం ఎలా తెలిసింది అని రాజీవ్ ప్రశ్నించగా మీ పత్రికను నేను చదవకపోయినా అందులో వచ్చిన వార్త గురించి చాలా మంది నాకు చెప్పారని అమిత్ షా వెన్వెంటనే తీక్షణంగా సమాధానమిచ్చారట.

అమిత్ షా వలే థాక్రేలు కూడా తమ పిల్లలను ఆంగ్ల మాధ్యమ పాఠశాలలకే పంపారు. హిందీలో సంభాషించడం, ఇంటర్వ్యూలు ఇవ్వడాన్ని కూడా వారు మానుకోలేదు. అయినప్పటికీ థాక్రేల రాజకీయాలు నిరంతరం 'మరాఠీ–ఫస్ట్' అజెండా ప్రాతిపదికనే ఉంటాయి. అమిత్ షా దృష్టిలో 'హిందీ–కేంద్రిత ప్రపంచ దృక్పథం' నెహ్రూవియన్ కాంగ్రెస్‌ను ధీటుగా ఎదుర్కోగల 'జాతీయవాద శక్తి'గా భారతీయ జనతా పార్టీని నిలిపేందుకు దోహదం చేసేది కాగా, థాక్రేలకు భాషా వివాదాన్ని మళ్లీ రగిలించడమనేది శివసేన సంస్థాపకుడు బాల్ థాక్రే ఆద్య అజెండా 'భూమి పుత్రుల ఉద్యమం'ను పునరుద్ధరించే ప్రయత్నమే. బొంబాయిలోని మరాఠీయేతర భాషీయులను నిరంతరం తెగనాడినప్పటికీ కార్టూనిస్ట్‌గా ఆయన మొదట పనిచేసింది ఒక ఇంగ్లీష్ డైలీ (ఫ్రీ ప్రెస్ జర్నల్)లో మరి. ఇప్పుడు శివసేన ఒకటికి మూడు 'సేన'లుగా చీలిపోయి అస్తిత్వ సంక్షోభంలో ఉన్నది. అందుకే కాబోలు యువ థాక్రేలు తమ ప్రాభవాన్ని పునరుద్ధరించుకునేందుకు మరాఠీ భాషా దురభిమానాన్ని రెచ్చగొట్టేందుకు ఉద్యుక్తులయ్యారు.

సరే ఎమ్‌కే స్టాలిన్‌కు, ఆయన పార్టీ డీఎంకేకు హిందీ బూచీని ముంచుకొస్తున్న మహా ముప్పుగా తమ ప్రజలకు చూపడం కొత్త పరిణామమేమీ కాదు. తమిళనాడులో ఎన్నికలు జరిగే ప్రతిసారీ ప్రజల మాటా మంతీ, పిచ్చా పాటీ అంతా ఈ హిందీ బూచీ గురించే సాగుతూ ఉంటుంది. హిందీని రుద్దడానికి కేంద్రం పూనుకుంటుందని స్టాలిన్, ఆయన సహచరులు గగ్గోలు పెడుతుంటారు. 1960లలో ద్రవిడ పార్టీ ఉత్థానం హిందీ వ్యతిరేక ఆందోళనాగ్నుల నుంచే జరిగింది. ద్రవిడ సంస్కృతీ పునరుద్ధరణ, వికాసాన్ని అడ్డుకునేందుకే హిందీని తమకు వ్యతిరేకంగా ప్రయోగిస్తున్నారని డీఎమ్‌కే నేతలు ఆరోపించడం పరిపాటి. ఆరు దశాబ్దాల అనంతరం మోదీ ప్రభుత్వ కొత్త విద్యా విధానం ప్రతిపాదించిన త్రిభాషా సూత్రాన్ని అమలుపరిచేందుకు స్టాలిన్ ప్రభుత్వం ససేమిరా అంటోంది. తమిళ ప్రజలపై హిందీని రుద్దేందుకే ఆ విధానాన్ని ప్రవేశపెట్టారని ఆయన ఆరోపిస్తున్నారు. తమిళనాడులో తమిళ భాషకే తొలి, మలి, తుది ప్రాధాన్యమని స్టాలిన్ స్పష్టం చేస్తున్నారు. అయితే డీఎమ్‌కే ప్రథమ కుటుంబంలోని యువతరం వారు తమ పిల్లలను ప్రతిష్ఠాత్మక విదేశీ విశ్వవిద్యాలయాలకే పంపిస్తున్నారు చెన్నైలోని ప్రైవేట్ పాఠశాలలు త్రిభాషా సూత్రాన్ని అమలుపరిచేందుకు మొగ్గు చూపుతున్నాయి. హిందీకి సముచిత ప్రాధాన్యమిచ్చేందుకు అవి వెనుకాడడం లేదు.

బోధనా మాధ్యమంగా ఆంగ్ల భాషను వ్యతిరేకిస్తున్న పాతకాలం నాటి సోషలిస్ట్ లోహియా వాదుల నుంచి హిందుత్వ వాదులు, ప్రాంతీయ యోధుల వరకు అందరూ తమ పిల్లలను ఆంగ్ల మాధ్యమ పాఠశాలలకే పంపిస్తున్నారు! ఇంగ్లీష్‌కు వ్యతిరేకంగా గొంతు చించుకుంటున్న అమిత్ షా, కేంద్ర కేబినెట్‌లోని తన సహచరులలో ఎంత మంది తమ పిల్లలను హిందీ లేదా ప్రాంతీయ భాషా మాధ్యమ పాఠశాలలకు పంపుతున్నారో తెలుసుకునేందుకు ప్రయత్నించాలి. కనీసం అరడజను మంది కేంద్ర కేబినెట్ మంత్రుల పిల్లలు ప్రతిష్ఠాత్మక విదేశీ విశ్వవిద్యాలయాలలో చదువుతున్నారు. ఇంగ్లీష్‌ను ఇంకెంత మాత్రం వలస పాలన అవశేషంగా కాకుండా ఆశయ సాధనకు, స్వీయ అభివృద్ధికి మార్గంగా భావిస్తున్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఏ ప్రాంతానికి అయినా వెళ్లి చూడండి. సర్వత్రా ఇంగ్లీష్ లాంగ్వేజ్ కోచింగ్ సెంటర్‌లు కనిపిస్తాయి. 'న్యూ' ఇండియా యువత సామాజికంగా ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశాలను అవి సమకూరుస్తున్నాయి. ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నందుకు సిగ్గుపడకపోగా ఆ భాషా పటిమలో మేటి అయ్యేందుకు యువ భారతీయులు ఆరాట పడుతున్నారు. విచారకరమైన విషయమేమిటంటే విద్యాలయాలలో ఆంగ్ల భాషా బోధన ప్రమాణాలు ప్రశస్తంగా లేవు. గుజరాతీ యువతకు ఆంగ్ల భాషలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు కొరవడినందునే ఆ నైపుణ్యాల ఆధారిత సేవల రంగంలో గుజరాత్ వెనుకబడి పోయింది.

ముంబై మహా నగర జీవనంలో కూడా ఇప్పుడు (గతంలో ఎన్నడూ లేని రీతిలో) మహారాష్ట్రియన్ స్వరూప స్వభావాలు తక్కువగా ఉన్నాయి. హిందీ, కేవలం ఈ నగర విశ్వవిఖ్యాత బాలీవుడ్ సినిమా పరిశ్రమ భాష మాత్రమే కాదు, జీవనోపాధికి ఉత్తర భారతావని నుంచి వలసవచ్చిన వివిధ వృత్తులవారు అద్వితీయంగా పెంపొందిస్తోన్న స్థానిక భాష. సౌందర్యమూ, సౌలభ్యమూ ఉన్న ముంబై యాస అది. ఈ విశ్వనగర పలుకులమ్మ ఝంకారంలో బాంబే వెర్సెస్ ముంబై వెర్సెస్ బంబాయి చర్చకు ప్రాధాన్యమేముంటుంది? అది ప్రయోజనశూన్యమైనది. ఈ మహానగర జీవన సందడి భాషాపరమైన విభజనలు, వ్యత్యాసాలపై అస్తిత్వ ఆందోళనలు, జీవిత అనిశ్చితులకు సంబంధించిన భయాలకు తావు లేకుండా చేస్తోంది. నిజమే, మరాఠీ భాషా అభిజాత్యం ఇంకా ప్రభావశీలంగా ఉన్నది. అయితే ఒక భాషకు మరో భాషకు వ్యతిరేకంగా ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఇంకెంత మాత్రం లేదు.

ఈ వాస్తవాలు స్పష్టం చేస్తున్నదేమిటి? భాషా యుద్ధాలు చేస్తున్నవారు తాము విఫలం కానున్న పోరాటాలు చేస్తున్నామనే సత్యాన్ని గ్రహించాల్సిన అవసరమున్నది. అవి తాత్కాలిక రాజకీయ లబ్ధినివ్వవచ్చునేమో కాని నిరవధిక ప్రయోజనాలను సమకూర్చలేవు. భాషా వైవిధ్యమే భారతదేశ మహా బలం. బహు–భాషా నైపుణ్యాలు స్పర్థాత్మక సానుకూలతలను కల్పిస్తాయి. కొత్త ఆలోచనలు చేయలేని రాజకీయవేత్తలే భాషా దురహంకారాన్ని పనిగట్టుకుని ప్రోత్సహిస్తున్నారు. అయితే యువ భారతీయులలో అత్యధికులు ఉద్యోగార్థులే గానీ భాషా దురభిమానులు కానే కారు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

కలహశీల కల్లోల ప్రపంచం



■ సునీతా నారాయణ్

మట్టివాసన

మనం ఇప్పుడు ఒక కొత్త ప్రపంచంలో ఉన్నాం. తార్కిక క్రమం లోపించిన సంఘటనలు సంభవిస్తున్నాయి. ఏదీ అర్థవంతమైనదిగా కనిపించడం లేదు. వలసపాలన ముగిసిపోయిన కాలంలో పుట్టి పెరిగిన నాలాంటి వారు అర్ధ శతాబ్ది కాలంగా ఒక నియమబద్ధమైన ప్రపంచ వ్యవస్థను చూస్తూ వచ్చారు. సందేహం లేదు, అది అసమానతల లోకమే. అయితే సంస్కరణలకు మార్పులకు ఆస్కారమున్న ప్రపంచమది. బహుశా, అది ఒక అమాయక కాలం కావచ్చు. దృశ్యమానమవుతున్న యథార్థాల మాటున కఠోర వాస్తవాలు ఉండి ఉండవచ్చు. అయితే ప్రపంచ వ్యవస్థకు ఆర్థికంగా, సైనికంగా శక్తిమంతమైన రాజ్యాలే సారథ్యం వహిస్తున్నప్పటికీ అది సకల దేశాలకు న్యాయం చేయగలదనే నమ్మకం మాకు ఉండేది. వివేకవంతమైన వాదాలు, దార్శనిక దృక్పథాలకు ఆమోదం లభించి సహేతుకమైన నిర్ణయాలకు దోహదం జరగగలదనే నిండు నమ్మకం మాకు ఉండేది.

ఇప్పుడు నేను ఇది రాస్తున్న సమయంలో కాళ్లకింద భూమి కుంగిపోతున్న భావన కలుగుతోంది. మనం దారి తప్పిపోయామా? కచ్చితంగా. ప్రస్తుత ప్రపంచ వ్యవస్థను నేను అర్థం చేసుకోలేకపోతున్నాను. కొన్ని దేశాలు ఇరుగు పొరుగు, సుదూర దేశాలపై మారణాయుధాలతో దాడులు జరుపుతున్నాయి. ఈ దాడుల్లో కొన్ని ఎటువంటి కవ్వింపు చర్యలు లేకుండానే భావించడం దారుణం. ఏకపక్ష నిర్ణయాలతో బాంబు దాడులు చేస్తున్నాయి. జనసంహారానికి పాల్పడుతున్నాయి. ప్రపంచం నిస్సహాయంగా, మౌనంగా చూస్తూ మిన్నకుండిపోతోంది! పరాయి దేశంలో పాలన మార్పు గురించిన ప్రకటనలు వింటున్నాం. ఇదొక సాధారణ విషయమని సరిపెట్టుకుంటున్నాం; పొరుగు దేశంపై దాడి చేయడమే కాకుండా అక్కడి ప్రజలను ఆకలి దప్పులతో మరణించేలా చేస్తున్నాం. జాతి సంహారం సైతం యథేచ్ఛగా కొనసాగుతోంది ఈ దారుణాలను ఉపేక్షిస్తున్నాం. వాటిని భరించలేము. ఏమి చేయగలం? మనం పరిపూర్ణ నిస్సహాయులం.

ఇరాన్‌పై దాడి ఇజ్రాయెల్, అమెరికా చర్యల నైతికతకు మాత్రమే పరిమితమైన అంశం కాదు. సార్వభౌమిక దేశాలు ఉమ్మడిగా చర్చించి నిర్ణయించిన న్యాయసూత్రాల ప్రాతిపదికన నిర్మించిన ప్రపంచ వ్యవస్థ భవిష్యత్తు ఏమిటనే ప్రశ్నను ఆ సందర్భం తీక్షణంగా లేవనెత్తుతోంది. అణ్వాయుధాల వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పీటీ)లో ఇరాన్ భాగస్వామిగా ఉన్నది. అణ్వాయుధాలను నియంత్రించేందుకు ఉద్దేశించిన అంతర్జాతీయ ఒడంబడిక అది. 1970లో అమలులోకి వచ్చిన ఆ ఒప్పందాన్ని 191 దేశాలు అంగీకరించి ధ్రువీకరించాయి. ఇరాన్‌తో సహా భాగస్వామ్య దేశాలు అన్నీ ఆ ఒప్పందానికి కట్టుబడి ఉండేలా చేసేందుకు వియన్నాలోని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ)కు అధికారాలు కల్పించారు. అణ్వస్త్ర రాజ్యాలుగా గుర్తింపు పొందిన దేశాలు ఐదు ఉన్నాయి: అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా. ఈ ఐదు దేశాలూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో వీటో అధికారమున్న శాశ్వత సభ్య దేశాలు. తమకు అణ్వస్త్ర సామర్థ్యమున్నదని భారత్, పాకిస్థాన్‌లు ప్రకటించాయి. ఎన్‌పీటీపై సంతకం చేయలేదు. ఎన్‌పీటీపై సంతకం చేసిన ఇరాన్ అణ్వస్త్రాలు సమకూర్చుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టిందని, అణ్వాయుధ ఇరాన్ తన మనుగడకే ప్రమాదకరమని ఇజ్రాయెల్ అభ్యంతరం తెలిపింది. ఈ దేశం ఎన్‌పీటీపై సంతకం చేయలేదు. అంతేకాదు, ఇజ్రాయెల్ రహస్యంగా అణ్వస్త్రాలను అభివృద్ధిపరుచుకోవడానికి పూనుకున్నదని చాలా దేశాలు అంగీకరిస్తున్నాయి. అంతర్జాతీయ నియమాలకు కట్టుబడి ఉన్న ఒక దేశంపై ఆ నియమాలకు లోబడి వ్యవహరించని మరొక దేశం దాడి చేసింది. ఈ పరిస్థితి ప్రపంచ వ్యవస్థ సవ్యంగా పని చేసేందుకు దోహదం చేస్తుందా?



సార్వభౌమిక దేశాలు ఉమ్మడిగా నిర్దేశించుకున్న నియమ నిబంధనలు ఆధారంగా పనిచేసే ప్రపంచ వ్యవస్థ అస్తవ్యస్తమవుతున్న పరిస్థితుల్లో వాతావరణ మార్పు లాంటి మహా సంక్షోభానికి పరిష్కారాన్ని కనుగొనడం ఎలా సాధ్యం? పురుషహంకార, యుద్ధ నిమగ్న కల్లోల ప్రపంచం మనిషికి శాంతినిస్తుందా? ధరిత్రిని ధ్వంస రచన నుంచి కాపాడుతుందా?

ఇరాన్ శుద్ధి చేసిన యురేనియం నిల్వలను పెంచుకుంటుందని మే 2025లో ఐఏఈఏ నివేదిక ఒకటి వెల్లడించింది. అయితే ఇరాన్ ఆయుధాగారంలో అణ్వాయుధాలు ఉన్నాయనేందుకు ఎటువంటి సాక్ష్యాధారాలు లభించలేదని ఆ నివేదిక స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ భద్రతా మండలి దృష్టికి తీసుకువెళ్లి ఉండవల్సింది. అయితే అలా చేయకుండా ఇరాన్‌పై బాంబుదాడులకు పాల్పడింది. ఇరాన్‌లోని అణు కేంద్రాలపై దాడులు జరిపింది. దీనివల్ల ఆ కేంద్రాల నుంచి అణు ధార్మికత వెలువడి మహావిపత్తు సంభవించేందుకు అస్కారం కలిగించేలా ఇజ్రాయెల్ వ్యవహరించింది. ఇదెలా న్యాయబద్ధం? ఇజ్రాయెల్ చర్య వల్ల ఐఏఈఏ విశ్వసనీయత దెబ్బతినలేదా? ఎన్‌పీటీపై సంతకాలు చేసిన దేశాలన్నీ ఆ నియమాలకు కట్టుబడి ఉండేలా చేసే బాధ్యతలను ఆ సంస్థ ఎలా నిర్వర్తించగలుగుతుంది? మరో దేశంపై బాంబుదాడులు జరిపేందుకు ఒక దేశం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని నిరాటంకంగా అమలుపరిస్తే మిగతా దేశాలు అంతర్జాతీయ ఒప్పందాల మర్యాదలను ఎందుకు పాటించాలి? ఈ మొత్తం వ్యవహారంలో ఐక్యరాజ్యసమితి, దాని ప్రధాన కార్యదర్శి పాత్ర ప్రకటనలు జారీ చేసేందుకే పరిమితమైపోయింది. సంయమనంతో వ్యవహరించాలన్న సలహాను ఎవరూ వినలేదు. ఐఏఈఏ, ఇతర అంతర్జాతీయ సంస్థలు తమ కర్తవ్యాలను ఎందుకు నిర్వర్తించలేదు? శక్తిమంతమైన దేశాల దౌర్జన్యశీల తీరుతెన్నులను ఎందుకు నియంత్రించలేదు? పరస్పరాధారిత ప్రపంచ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు ఇదెలా తోడ్పడుతుంది?

అంతేకాదు, ఈ విపత్కర పరిస్థితిలో మరింత ఎక్కువ ప్రమాదమున్నది. వాతావరణ మార్పు ఒక యథార్థమని మనకు తెలుసు. ఆ వైపరీత్యంతో వాటిల్లుతున్న ముప్పు చాలా తీవ్రమైనది. దానిని ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా ఎదుర్కోవలసిన అవసరమున్నది. అయితే అది సులభంగా పరిష్కారం కాని సమస్య. వాతావరణ మార్పుతో ధ్వంసమవుతోన్న పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు సకల సమాజాలూ ఏకాభిప్రాయంతో పరస్పర విశ్వాసంతో సమష్టిచర్యలు చేపట్టాలి. ఏ ఒక్క దేశమూ కలిసిరాకపోయినా సమస్య సశేషంగానే ఉండిపోతుంది. మరి ఉమ్మడిగా నిర్దేశించుకున్న నియమ నిబంధనలు ఆధారంగా పని చేసే ప్రపంచ వ్యవస్థ అస్తవ్యస్తమవుతూ అంతర్జాతీయ సంస్థల ప్రతిష్ఠ దిగజారిపోతున్న పరిస్థితుల్లో వాతావరణ మార్పు లాంటి మహా సంక్షోభానికి పరిష్కారాన్ని కనుగొనడం ఎలా సాధ్యం? బలవంతుడి న్యాయమే రాజ్యం చేస్తోంది కదా. పురుషహంకార, యుద్ధ నిమగ్న కల్లోల ప్రపంచం మనిషికి శాంతినిస్తుందా? ధరిత్రిని ధ్వంస రచన నుంచి కాపాడుతుందా?

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

ఏడేళ్లు బందీగా సారస్వత 'మూర్తి'

మహాభారతాన్ని ఆంధ్రీకరించిన సారస్వతమూర్తి తిక్కన. వర్ణవివక్ష కారణంగా ఆయన ఏడేళ్లుగా ఓ గదిలో బందీగా ఉంటున్నారు. గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం కూడా ఆయన్ను విడుదల చేయలేకపోయారు. అసలు విషయానికొస్తే... నెల్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలో తిక్కనకవి విగ్రహం ఏర్పాటు చేయాలని 2018లో నాటి టీడీపీ ప్రభుత్వం సంకల్పించి, ఆయన కాంస్య విగ్రహాన్ని తయారు చేయించింది. కానీ ఆ విగ్రహం పసిడి రంగుకు చేరువలో ఉండడంతో 'పసుపు ముద్ర' అపవాదు కారణంగా ప్రతిష్ఠకు దూరమైంది.

తెలుగువారికి గర్వకారణమైన తిక్కన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చివరి వరకు ప్రయత్నించి విఫలమయ్యారు. కొవిడ్‌తో ఆసుపత్రిలో చేరే ముందు కూడా తిక్కన విగ్రహ ప్రతిష్ఠ విషయమై అప్పటి నెల్లూరు జిల్లా కలెక్టర్‌తో బాలు మాట్లాడారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేయాలని అభ్యర్థించారు. ప్రముఖుల అభ్యర్థనతో నాటి శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ విగ్రహ ప్రతిష్ఠకు పూనుకున్నారు. 2019లో మహోత్సవం పేరుతో తిక్కన విగ్రహ ఆవిష్కరణ, 'తిక్కన తిరునాళ్లు' పేరుతో మూడు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా జరపాలని నిర్ణయించారు. కానీ సరిగ్గా ఆ సమయంలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఈ కార్యక్రమం వాయిదా పడింది. దాంతో తిక్కన విగ్రహాన్ని నెల్లూరు సంగీత కళాశాలలోని ఓ గదిలో ఉంచారు.

ఎన్నికల అనంతరం నాటి మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ దృష్టికి కొందరు విగ్రహ ప్రతిష్ఠ విషయాన్ని తీసుకెళ్లారు. ఈ విషయాన్ని పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబు అదిగో ఇదిగో అంటూ మీనమేషాలు లెక్కిస్తూ కాలయాపన చేశారు. కలెక్టరేట్‌లో మహాత్మాగాంధీ విగ్రహం, 100 అడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. అదే ప్రాంగణంలో తిక్కన విగ్రహం కూడా ఏర్పాటు చేయవలసి ఉంది. విగ్రహం అందుబాటులో ఉన్నా, విగ్రహ ప్రతిష్ఠకు సాహిత్య కళాభిమానులు పట్టుబడుతున్నా.. అధికారులు పాలకులేమాత్రం స్పందించడం లేదు.

తెలుగుదేశం పార్టీ తయారు చేయించిన విగ్రహం కావడం, దానికితోడు రంగు సమస్య వెంటాడడంతో తిక్కన చీకటిలోనే బందీగా ఉండిపోయారు. రాజకీయ సుడిగుండంలో చిక్కుకుని ఉన్నారు. ఏడేళ్లుగా ఆ సారస్వత 'మూర్తి'కి రాజకీయ రంగులు పులిమి, గదిలో బందీని చేయడం సబబు కాదు. ఈ విషయంపై వెంటనే పాలకులు, అధికారులు స్పందించాలని, కలెక్టరేట్ ప్రాంగణంలో తిక్కన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని చరిత్రకారులు, సాహిత్య అభిమానులు కోరుతున్నారు.

– ఈతకోట సుబ్బారావు, నెల్లూరు

మహోజ్వలశక్తి అల్లూరి

విప్లవం పేరు చెబితే ఠక్కున గుర్తొచ్చే పేరు.. అల్లూరి సీతారామరాజు. ఆయన విప్లవ వీరుడు, తెలుగు జాతి ముద్దు బిడ్డ. బ్రిటిషర్లను గడగడలాడించి, వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన వీరపుత్రుడు. అల్లూరి పేరు చెబితే మన్యం పులకిస్తుంది. ఉప్పొంగే ఆవేశానికి ప్రతీక అల్లూరి.

తెల్లవాడి కబంధ హస్తాల్లో భరతమాత కన్నీరు పెడుతున్న రోజులు అవి. ఉత్తర భారతంలో స్వాతంత్ర్యోద్యమం ఉవ్వెత్తున ఎగసి పడుతున్న రోజులు కూడా. అలాంటి సమయంలోనే పశ్చిమ గోదావరి జిల్లా అడవుల్లో ఓ అగ్నికణం పుట్టింది. ఆ అగ్ని కణమే దావానలంలా వ్యాపించి బ్రిటిష్ సామ్రాజ్యపు గుండెల్లో వణుకు పుట్టించింది. అలా తెల్లవాళ్ల పెత్తనం మీద గర్జించిన తెలుగు తేజమే అల్లూరి సీతారామరాజు. నేడు ఆ విప్లవ వీరుని 128వ జయంతి. ఈ సందర్భంగా ఆయన త్యాగాలను ఒక్కసారి గుర్తు చేసుకుందాం.



భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో తెల్లదొరలకు సింహస్వప్నంగా నిలిచిన పోరాట యోధుల్లో అల్లూరి సీతారామరాజు ఒకరు. స్వాతంత్ర్యం పొందటానికి సాయుధ పోరాటం ఒక్కటే మార్గమని నమ్మిన అల్లూరి.. తన పోరాట పటిమతో బ్రిటిష్ సైన్యాన్ని వణికించాడు. మన్యం ప్రాంతంలో గిరిజనులను సమీకరించి బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేశాడు. కొన్నేళ్లపాటు సమరశీల ఉద్యమాలకు అల్లూరి సీతారామరాజు నాయకత్వం వహించాడు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని నమ్మి, స్వరాజ్యం కోసం తన ప్రాణాలర్పించిన యోధుడు అల్లూరి. నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులైన తన అనుచరులతో, చాలా పరిమిత వనరులతో కేవలం 27 ఏళ్ల వయసులోనే బ్రిటిషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడు.

అడవుల్లోని ప్రకృతి సంపదలను అనుభవించే హక్కు గిరిజనులదేనని ఎలుగెత్తి చాటాడు అల్లూరి. ఆయన పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యం. పోడు వ్యవసాయానికి పన్ను కట్టనక్కర్లేదన్నాడు. గిరిజనులను నిలువు దోపిడీ చేస్తున్న దళారుల మీద, వారికి అండగా ఉన్న బ్రిటిషువారి మీద అల్లూరి తన విల్లును ఎక్కుపెట్టాడు. ప్రతి గిరిజనుడినీ ఒక గెరిల్లా యోధునిగా మార్చి తెలుగు నేలకు స్వతంత్ర్య పోరాట మార్గం చూపాడు.

సమాచారం ఇచ్చి మరీ పోలీసు స్టేషన్లపై దాడులు చేశాడు. అయితే అదే ఏడాది అల్లూరి సీతారామరాజు విప్లవ దళానికి మొదటి ఎదురుదెబ్బ తగిలింది. 1922 డిసెంబరు 6న జరిగిన పోరులో 12 మంది అనుచరులను సీతారామరాజు కోల్పోయాడు. ఆ తర్వాత ఆయన కొన్నాళ్లు ఎలాంటి పోరాటాలు జరపలేదు. ఆ సమయంలో అల్లూరి మరణించాడనే వదంతులు కూడా వ్యాపించాయి. అయితే ఆయన 1923 ఏప్రిల్‌లో మళ్లీ ప్రత్యక్షమయ్యాడు. మరోసారి తెల్లవాళ్లపై దాడులకు దిగాడు. అల్లూరికి సాయం చేస్తున్నారన్న కోపంతో మన్యం ప్రజలను బ్రిటిషర్లు వేధించడం మొదలు పెట్టారు. తనకున్న అవకాశాలతో పూర్తి స్థాయిలో మన్యం ప్రజలకు రక్షణ కల్పించలేనని తెలిసి తెల్లదొరలకు రామరాజు లొంగిపోవాలనుకున్నాడు. తాను స్నానానికి చెరువు దగ్గరకు రాబోతున్నట్టుగా తన అనుచరుల ద్వారా బ్రిటీష్ అధికారులకు సమాచారం అదించాడు.

1924 మే 7న ఏటి ఒడ్డున స్నానం చేస్తుండగా అల్లూరిని బంధించిన పోలీసులు, ఎటువంటి విచారణ చేపట్టకుండానే అదే రోజున ఆయన్ను కాల్చిచంపారు. బ్రిటిష్ అధికారులు ఓ నాయకుడిని చంపగలిగారు కానీ ఆయన ప్రజల్లో రగిలించిన స్వతంత్ర్య ఆకాంక్షను మాత్రం ఆర్పివేయలేకపోయారు. తెలుగుతేజం అల్లూరి మరణం లేని ఓ విప్లవ వీరుడు. తెలుగు జాతికి, దేశానికి స్ఫూర్తి ప్రదాత. అడవి బిడ్డలకు ఆరాధ్య దైవం.

సీతారామరాజు అంటే వ్యక్తి కాదు సమూహ శక్తి. సంగ్రామ భేరి. స్వాతంత్ర్య నినాదం. సమరగీతం. ఓ ఉద్యమ జ్వాల. తెలుగు నేల మీద స్వాతంత్ర్య సమరానికి బీజాలు వేసిన మహా నాయకుడు అల్లూరి జయంతి సందర్భంగా ఆ వీరునికి మరోసారి ఘన నివాళి అర్పిద్దాం.

● అనంతాత్మకుల కొండబాబు
జర్నలిస్ట్

(నేడు అల్లూరి సీతారామరాజు జయంతి)

'రెవిన్యూ' తప్పులకు రైతులకు శిక్షా?

జగన్ జమానాలో జరిగిన రీ సర్వే రైతులను సమస్యల ఊబిలో పడేసింది. 'వందేళ్ల తరువాత మేమే సర్వే చేస్తున్నాం' అని గొప్పగా చాటుకొని రైతాంగానికి ఎన్నో సమస్యలను అంటగట్టింది జగన్ ప్రభుత్వం. రైతుల సమక్షంలో రీ సర్వే చేయకుండా.. అత్యాధునిక పరికరాలతో సర్వే చేస్తున్నామని పదే పదే చెప్పిన నాటి ఉన్నతాధికారులు.. సర్వేను, నమోదును తమ ఇష్టానుసారం చేశారు. ఒక రైతు పేరిట ఉన్న సర్వే నెంబర్‌ను మార్చి, పక్కనే ఉన్న ఇద్దరి ముగ్గురు రైతులను కలిపి ఎల్‌పీఎం పేరుతో ఒకే సర్వే నెంబర్ ఇచ్చారు. ఒకే కుటుంబానికి చెందిన వారినే కాకుండా, ఇతరులతో కలిపి జాయింట్ ఎల్‌పీఎం ఇచ్చారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ అధికారులు 'ఆ జాయింట్ ఎల్‌పీఎంను విడదీసి, ప్రతి వారికి ప్రత్యేకంగా ఒక సర్వే నెంబర్ కేటాయిస్తే తప్ప రిజిస్ట్రేషన్ చేయడానికి వీలులేదు' అంటున్నారు. దీనివల్ల లక్షలాది మంది రైతులు తమ భూమిని కుటుంబ అవసరాలకు అమ్ముకోవడానికి, బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడానికి వీలుకాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ తప్పిదాన్ని గుర్తించింది. రీ సర్వే చేసి జాయింట్ ఎల్‌పీఎంలను విడదీయడానికి రూ. 50 చెల్లించాలని, జూన్ 30 వరకు మాత్రమే ఈ అవకాశం అని రైతులకు తెలిపింది. జులై 1 తర్వాత దరఖాస్తు చేసుకుంటే వారు రూ. 550 కట్టాలని చెప్పింది. తప్పులు చేసింది రెవిన్యూ అధికారులు, శిక్ష రైతులకా! అని రైతన్నలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సచివాలయాల్లో వందల సర్వేయర్లను ప్రభుత్వం నియమించింది. వారితో ఉచితంగా సర్వే చేయించకుండా రైతులతో 550 రూపాయలు కట్టించుకోవడం సరికాదని ప్రభుత్వానికి రైతులు విన్నవిస్తున్నారు. ఇలాంటి వాటివల్ల లక్షలాది మంది రైతుల్లో కూటమి ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. ఈ సమస్యపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలి. రీ సర్వే చేసి రైతుల చిక్కులను తొలగించాలి.

– మారిశెట్టి జితేంద్ర, రాజమహేంద్రవరం

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
శుక్రవారం 4 జూలై 2025



- ఇప్పటికే అవస్థల ప్రయాణాలు
- బస్సుల కొరతతో.. సర్వీసులు రద్దు
- పల్లె బాట పట్టని ఆర్టీసీ రథచక్రాలు
- మహిళల ఉచిత ప్రయాణానికి కసరత్తు
- డిపోల వారీగా రెండు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక



ఉచితానికి.. బస్సులేవి?

మహిళలకు.. ఆర్టీసీ ఉచిత ప్రయాణ హామీ అమలుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఆగస్టు 15 నుంచి అక్కచెల్లెళ్లు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు పలు వేదికలపై ప్రకటిస్తున్నారు. అయితే అందుకు ఆర్టీసీ సిద్ధంగా ఉందా.. ఆ మేరకు బస్సులు ఉన్నాయా.. గ్రామాలకు సర్వీసులు నడిపే పరిస్థితి ఉందా అంటే అనుమానాలు వస్తున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో పల్లెలు ఎక్కువగా ఉన్నాయి. ఉచిత ప్రయాణం అంటే మహిళలు పెద్దసంఖ్యలో ఆర్టీసీ బస్సుల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉంటోంది. ఈ పరిస్థితుల్లో ఇప్పటికే అవస్థల ప్రయాణాలు సాగుతున్నాయి. ఆక్యుపెన్సీ లేదని కొన్ని గ్రామాలకు.. రోడ్లు బాగాలేవని కొన్ని గ్రామాలకు సర్వీసుల రద్దు.. ట్రిప్పులను ఆర్టీసీ కుదించింది. మూడు జిల్లాల పరిధిలో అన్ని డిపోల్లోనూ బస్సులకు కొరత ఉంది. ఉన్న బస్సుల కండీషన్ కూడా అంతంతే. వీటి పరిష్కారంపై ప్రభుత్వం దృష్టిపెడితేనే ఉచిత బస్సు పథకం అమలు సజావుగా జరిగే వీలుంటోంది.

గుంటూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ హామీల్లో ప్రధానమైన మరో హామీ అమలుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. బస్సుల ప్రస్తుత కండీషన్‌తో పాటు డిపోల వారీగా ఉన్న బస్సుల సంఖ్య, అదనపు బస్సులు, ఆర్టీసీపై పడే భారం తదితర అంశా లతో నివేదిక పంపాలని ఆర్టీసీ యంత్రాంగాన్ని ప్రభుత్వం ఇప్పటికే కోరింది. ఇందుకు సంబంధించి కసరత్తు చేస్తున్న యంత్రాంగం మరో రెండు రోజుల్లో పూర్తి వివరాలతో ప్రభు త్వానికి నివేదిక అందించనున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికే అనేక డిపోల్లో బస్సులు కొరత అత్యధికంగా ఉంది. డ్రైవర్లు, కండెక్టర్ల పోస్టులు అనేకం ఖాళీగా ఉన్నాయి. ఉన్న బస్సుల్లో చాలావరకు కండీషన్‌లో లేవు. గ్రామీణ ప్రజలకు ఆర్టీసీ సేవలను మరింత చేరువ చేసేందుకు పల్లెవెలుగు పేరుతో ప్రవేశపెట్టిన ఆర్డినరీ సర్వీసులు ఆ దిశగా గ్రామీణ ప్రాంతాలకు చేరటం లేదన్న విమర్శలున్నాయి. ఏటేటా ఆదాయం పేరుతో బస్సు సర్వీసులను ఆర్టీసి తగ్గిస్తోంది. పల్లె వెలుగు బస్సులు కండీషన్‌లో ఉండటంలేదు. కాలం చెల్లిన బస్సులు కూడా ఆర్టీసీ నిర్వహిస్తూ ప్రయాణి కుల భద్రతతో చెలగాటమాడుతోంది. అయినా అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో ఆయా బస్సులను నడుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఉచిత పథకం ఆచరణలోకి వస్తే ఆక్యు పెన్సీ పెరగడంతో పాటు సర్వీసు లేని గ్రామాల నుంచి కూడా బస్సు తిప్పమనే డిమాండ్లు


(మిగతా 8లో)

సర్వీసులు రద్దు.. ట్రిప్పుల కోత

గుంటూరు జిల్లా పరిధిలో అనేక గ్రామాలకు బస్సుల రాకపోకలను నిలిపివేశారు. కొన్ని గ్రామాలకు ట్రిప్పులను తగ్గించారు. ఆక్యుపెన్సీ సరైన మార్గం లేకపోవడంతో మంగళగిరి డిపో నుంచి రాజధాని అమరావతి ప్రాంతం మీదగా తుళ్లూరు, తాడికొండ వరకు సర్వీసులను నిలిపివేశారు. గుంటూరు నుంచి సౌపాడు, పల్లపాడుకు గతంలో గంటకో ట్రిప్పు ఉండగా ప్రస్తుతం ఉదయం, సాయంత్రం మాత్రమే నడుపుతున్నారు. గోళ్లమూడికి బస్సును పూర్తిగా నిలిపివేశారు. గతంలో తుళ్లూరులో రెండు సర్వీసులు నైట్ అవుట్ ఉండగా ప్రస్తుతం ఒకటి ఉంది. మండేపూడి, తాళ్లూరు గతంలో రెండు సర్వీసులు ఉండగా ఇప్పుడు ఒక సర్వీసు మాత్రమే తిప్పుతున్నారు. లగడపాడు, వరగాని గ్రామాలకు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బస్సు సౌకర్యం అందుబాటులో ఉంచారు. మందపాడు నైట్ అవుట్ సర్వీసును రద్దు చేశారు. గతంలో ఉన్న ట్రిప్పులను కూడా కుదించారు. పొన్నూరు నియోజకవర్గంలో 55 గ్రామాలకు 21 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. తెనాలి డిపోలో ఆర్డనరీ సర్వీసుల ట్రిప్పులను పూర్తిగా తగ్గించేశారు.

ఎంఎల్ఎస్‌లో.. పాగా

- నాలుగేళ్లుగా పాతుకుపోయి బియ్యం దోపిడీ
- ఉన్నతాధికారుల బదిలీ ఆదేశాలను నిలిపేసిన వైనం
- నిబంధనలకు పాతరేసి తన అనుయాయుడికి పోస్టింగ్
- పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ ఇలాకాలోనే బరితెగింపు



గుంటూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అడ్డగోలు దోపిడీకి అలవాటుపడి.. నాలుగేళ్లుగా పాగా వేసి.. బదిలీ ఆదేశాలను కూడా రద్దు చేయించుకుని గుంటూరు లోని ఓ ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి దర్జాగా తన దోపిడీని కొనసాగిస్తున్నాడు. పైగా తన పరిధిలో ఉన్న మరో రెండు ఎంఎల్ఎస్ పాయింట్లలో కూడా తనవారే ఉండేలా అడుగులు వేస్తున్నాడు. వారం క్రితం గుంటూరు రూరల్ ఎంఎల్ఎస్‌కు బదిలీపై వచ్చిన ఉద్యోగిని విధుల్లో చేరకుండా రాత్రికి రాత్రి చక్రం తిప్పి అర్హత లేని వారికి పోస్టింగ్ వచ్చేలా చేసుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. జాయింట్ కలెక్టర్ ఆదేశాలను తుంగలో తొక్కి బదిలీని నిలుపుదల చేసిన వ్యవహారాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చినా సదరు ఉద్యోగి దర్జాగా తన పంతాన్నే నెగ్గించుకోగలిగాడు. అనర్హులను ఎంఎల్ఎస్ పాయింట్లలో నియమించుకుని దోపిడీని విస్తరించాడు. పౌర సరఫరాలశాఖ మంత్రి జిల్లాలోనే ఇంత వ్యవహారం నడుస్తుండడం అందరినీ విస్మయానికి గురి చేస్తోంది. వారం క్రితం విధుల్లో చేరిన పౌరసరఫరాల మేనేజర్ పాత మేనేజర్ ఇచ్చిన ఆదేశాలను తుంగలోతొక్కి అనర్హులను అందలం ఎక్కించడం సర్వత్రా విమర్శలు, అనుమానాలకు తావిస్తోంది.

అక్రమాలలో దశాబ్దాల చరిత్ర

గుంటూరులోని ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిగా ఉంటూ బదిలీని ఆపుకున్న ఘనాపాటికి అక్రమాలు, దోపిడీల్లో దశాబ్దాల చరిత్ర ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో నరసరావుపేట ఎంఎల్ఎస్ పాయింట్‌లో విధులు నిర్వహిస్తున్నప్పుడు ఆరోపణలతో ప్రభుత్వం శ్రీకాకుళం బదిలీ చేయగా ఆరునెలల్లో చక్రం తిప్పి గుంటూరులోని ప్రధాన ఎంఎల్ఎస్ పాయింట్లో సదరు ఉద్యోగి పాగా వేశాడు. అడ్డగోలుగా పేదల బియ్యాన్ని కొల్లగొడుతూ అడ్డంగా దొరికిపోయినా అక్రమార్జనతో చక్రం తిప్పుతున్నాడు. తన పాయింట్‌తోపాటు గుంటూరు రూరల్, తాడికొండ పాయింట్లలో కూడా ఆర్వోలను డిలీట్ చేసి కొత్త ఆర్వోలు జనరేట్ చేసి టన్నుల కొద్దీ బియ్యాన్ని దర్జాగా తరలించాడు. సప్లై చైన్ మేనేజ్మెంట్‌నే తన చేతిలోకి తీసుకుని డీఎంని సైతం బురిడీ కొట్టించాడు. జిల్లా మేనేజర్ లాగిన్‌లో ఉన్న ఆర్వోను డిలీట్ చేయడం ఎంఎల్ఎస్ ఉద్యోగికి సాధ్యం కాదు. అయితే సదరు ఉద్యోగి, జిల్లా ఆఫీసులోని అకౌంట్స్ ఉద్యోగి సహకారంతో డీఎం యూజర్ ఐడీ, పాస్వర్డ్‌ని వాడి ఆర్వోలను డిలీట్ చేశాడని సమాచారం. వాటి స్థానంలో కొత్త ఆర్‌వోలు రూపొందించి లారీలకు లారీలు పేదల బియ్యాన్ని అక్రమంగా తరలించాడన్న ఆరోపణలున్నాయి. ఆరు నెలల క్రితం ఈ వ్యవహారం బయట పడగా అధికారులే అవాక్కయ్యారు. అయినా సదరు ఉద్యోగిని కదల్చలేకపోయారు.

జేసీ ఆదేశాలకే దిక్కులేదు..

జేసీ స్థాయిలో జరిగిన బదిలీ ఆగిన విషయం వారం క్రితం వెలుగుచూసింది. దీనిపై ప్రస్తుత డీఎంను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఆ సమయంలో బదిలీ ఆగదని, ఉత్తర్వుల ప్రకారమే నియామకం ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. కానీ వారం తిరిగేసరికి బదిలీ ఆదేశాలు మారిపోయాయి. కొత్త ఆర్డర్‌తో అనర్హుడు గుంటూరు రూరల్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు ఇన్‌చార్జిగా వచ్చాడు. సాధారణ ఉద్యోగి తన బదిలీతోపాటు, మిగిలిన ఎంఎల్ఎస్ పాయింట్ల బదిలీలను కూడా ప్రభావితం చేయడం విస్మయానికి గురిచేస్తోంది. అకౌంటెంట్లను గోడౌన్ ఇన్‌చార్జిలుగా నియమించరాదని సివిల్ సప్లైస్ కార్పొరేషన్ సర్క్యులర్‌ను తుంగలో తొక్కి పోస్టింగ్ ఇవ్వడం సర్వత్రా చర్చనీయాంశమైంది. బదిలీ ప్రక్రియ ఏ స్థాయిలో జరిగింది? ఎవరి ప్రమేయం ఉంది? పాత డీఎం ఇచ్చిన ఆదేశాలను ఎవరు తొక్కిపెట్టారు? అనర్హులను, ఆరోపణలు ఎదుర్కొంటున్నవారికి తిరిగి అవకాశం ఎవరు కల్పించారు అనేది నిగ్గు తేల్చాల్సి ఉంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత మంత్రి, ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది వేచి చూడాల్సిందే!

భూములు బలవంతంగా తీసుకోము

రైతులకు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ హామీ

తాడికొండ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి అంగీకారంతోనే భూములు తీసుకుంటామని, బలవంతంగా తీసుకోమని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ రైతులకు హామీ ఇచ్చారు. రాజధాని భవిష్యత్ అవసరాలకు తాడికొండ మండలం పాములపాడు, బేజాత్‌పురం, రావెలలో భూ సమీకరణపై గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండో దశలో భూములు తీసుకున్న రైతులకు సంవత్సరంలో ప్లాట్లు అభివృద్ధి చేసి ఇస్తామన్నారు. తాడికొండ మండలంలో ఎయిర్‌పోర్టు, పరిశ్రమలు, ఐటీ, ఆర్థిక కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతాయన్నారు. ఏవియేషన్‌హబ్, విమానాశ్రయ ఏర్పాటుకు టాటా సంస్థ ముందుకు వచ్చిందన్నారు. మండలంలో 50 వేల ఎకరాలు సమీకరించినా రైతులకు ప్లాట్లు, విమానశ్రయం, కంపెనీలకు భూములు కేటాయిస్తే 12 వేల ఎకరాల మాత్రమే ఉంటాయన్నారు. కౌలుతో పాటు ఇల్లు లేనివారికి టిడ్కో ఇళ్ల, భూములు లేని వారికి రూ.5 వేలు పింఛన్ మంజూరు చేయిస్తామన్నారు. భూములు ఇవ్వమని ఓ రైతు అనడంతో బేజాత్‌పురంలో రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.



పాములపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

- గ్రామకంఠంలో 300 మీటర్లు వదిలేయాలని, చెరువు పొలంలో డెబ్బై ఏళ్లుగా సాగు చేస్తున్న వారికి ప్లాట్లు కేటాయించాలని, ప్యాకేజీ మార్చాలని పాములపాడు సభలో రైతులు కోరారు.
- పూలింగ్ నుంచి మినహాయించాలని రావెల సభలో కొంత మంది రైతులు ఎమ్మెల్యేకి వినతిపత్రాన్ని అందజేశారు. కౌలు 50 వేలకు పెంచి ఇవ్వాలన్నారు. ప్రభుత్వాలు మారితే భూములు ఇచ్చిన రైతుల పరిస్థితి ఎంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ మెహర్‌కుమార్, ఎంపీడీవో సమతావాణి, టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, అధికార ప్రతినిధి గుంటుపల్లి మదుసూదన రావు, సర్పంచ్‌లు బిక్కి శివరామకృష్ణ, రావెల శైలజ, వడ్ల మూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ యజమానులు నిబంధనలు అతిక్రమిస్తున్నారు

- అందుకే పెనాల్టీలు విధించి కేసులు పెడుతున్నాం
- 'ఆంధ్రజ్యోతి'కి డీటీసీ సీతారామిరెడ్డి స్పందన

6

జడ్పీ ఆదాయంపై.. ప్రైవేటు

- బల్లకట్టు వెనుక కనికట్టు ఛేదించేది ఎప్పుడో..
- రేవుల వేలానికి ఎవరూ రాకుండా స్కెచ్..
- ప్రైవేట్‌గా నిర్వహణతో.. జడ్పీ ఆదాయానికి గండి
- ఇదీ గోవిందాపురం, మాదిపాడు బల్లకట్టు పరిస్థితి

8

విద్యాహక్కుకి.. కొర్రీలు

- సీట్లు నిరాకరించేందుకు ఎత్తుగడలు
- ఆర్టీఈ అడ్మిషన్ల ఫీజు గిట్టుబాటు కాదంట
- ప్రభుత్వ ఆదేశాలపై ప్రైవేటు విద్యాసంస్థల ఆందోళన
- క్షేత్రస్థాయి పరిశీలనకు త్వరలో విద్యాశాఖ అధికారులు సిద్ధం

గుంటూరు(విద్య), జూలై 3 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా.. ఆయా యాజమాన్యాలు కొర్రీలు వేస్తున్నాయి. విద్యాహక్కు చట్టం కింద తప్పనిసరిగా ఒకటో తరగతిలో పేద విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 300కు పైగా ఉన్న విద్యాసంస్థల్లో ఈ ఏడాది 1500 వరకు ఆర్టీఈ అడ్మిషన్లు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే పాఠశాలల వారీగా విద్యాశాఖ అధికారులు జాబితాలను పంపారు. అయితే ఆర్టీఈ అడ్మిషన్లకు అనేక ప్రైవేటు పాఠశాలలు నిరాకరిస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కొన్ని యాజమాన్యాలు ఎత్తుగడలు వేస్తున్నాయి. ఆర్టీఈ అడ్మిషన్ ప్రవేశాలకు ప్రభుత్వం ఇచ్చే ఫీజు గిట్టుబాటు కాదంటూ గురువారం ప్రైవేటు విద్యాసంస్థలు బంద్ కూడా నిర్వహించాయి.

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ

ప్రైవేటు విద్యాసంస్థలు అనేకం ప్రభుత్వ నియమ నిబంధనలకు

(మిగతా 8లో)





నిండు కుండలా శ్రీశైలం జలాశయం

సాగర్‌కు జలకళ

- నిండు కుండలా శ్రీశైలం జలాశయం
- సాగర్‌కు 63,150 క్యూసెక్కుల నీటి విడుదల
- కృష్ణానదిలో కొనసాగుతున్న వరద ప్రవాహం

నరసరావుపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో గత కొన్ని రోజులుగా కృష్ణమ్మకు వరద పోటెత్తుతోంది. ఆల్మట్టి నుంచి సాగర్ వరకు అన్ని జలాశయాల్లోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు జలకళను సంతరించుకుంటున్నాయి. శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతుండటంతో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి 68,169 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. డ్యాం నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా దిగువకు 63,150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శ్రీశైలానికి ఇదేస్థాయిలో వరద ప్రవాహం కొనసాగితే నాలుగు రోజుల్లో డ్యాం గేట్లు తెరుచుకుంటాయని జలవనరులశాఖ అధికారుల అంచనా. గురువారం సాగర్‌కు వరద ప్రవాహం కొనసాగడంతో జలాశయంలో నీటి మట్టం పెరిగింది. సాగర్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా 150.45 టీఎంసీ లకు నీటి నిల్వ చేరింది. సాగర్ ఆయకట్టులో తీవ్ర వర్షాభావం నెలకొనగా జలాశయాలకు వరద ప్రవాహం కొనసాగుతుండటంతో ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

రైలు ప్రయాణానికి.. మరో మార్గం

- నడికూడి-శ్రీకాళహస్తి రూట్‌లో నేడు ప్రత్యేక రైలు పరుగు
- ప్రయాణికులతో నడవనున్న నాందేడ్ - తిరుపతి వీక్లీ ఎక్స్‌ప్రెస్
- ఎట్టకేలకు పీఆర్ఎస్‌లోకి నెమలిపురి, రొంపిచర్ల రైల్వేస్టేషన్లు



నెమలిపురి రైల్వేస్టేషన్

పిడుగురాళ్ల, గుంటూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కలైన నడికూడి-శ్రీకాళహస్తి రైల్వేమార్గం ఎట్టకేలకు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. ఈ ప్రాంతవాసులు పదేళ్లుగా ఎదురుచూస్తున్న రైలు ప్రయాణం కల శుక్రవారంతో తీరనున్నది. న్యూ పిడుగురాళ్ల - శావల్యాపురం మార్గంలో శుక్రవారం ప్రయాణికులతో ప్రత్యేక రైలు తొలిసారిగా పరుగులు పెట్టనున్నది. నడికూడి - శ్రీకాళహస్తి రైల్వేమార్గంలో 2020 నాటికి శావల్యాపురం వరకు పనులు పూర్తయ్యాయి. అయితే ట్రాక్‌ను పటిష్టపరిచేందుకు రైల్వేశాఖ ఈ మార్గంలో మూడేళ్లుగా గూడ్సు రైళ్లను నడిపింది. నాందేడ్ నుంచి తిరుపతి, తిరుపతి నుంచి నాందేడ్‌కు ప్రత్యేక వీక్లీ రైలును నడిపేందుకు రెండు రోజుల క్రితం రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. తొలుత ఈ రైలును ఈ నెల 25 వరకు నడిపేందుకు రైల్వేశాఖ సన్నద్ధమైంది. శుక్రవారం నాందేడ్ నుంచి తిరుపతి వరకు బయలుదేరే రైలు న్యూ పిడుగురాళ్ల నుంచి కొత్త రైల్వే మార్గంలోని నెమలిపురి - రొంపిచర్ల మీదగా వినుకొండ వరకు వెళ్లి అక్కడి నుంచి నంద్యాల మార్గంలో తిరుపతి వరకు నడిపేందుకు రైల్వేబోర్డు షెడ్యూల్ ప్రకటించింది.

షెడ్యూల్ ఇలా..

ప్రతి శుక్రవారం మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి తిరుపతికి బయలుదేరే ప్రత్యేక రైలు(07189) పల్నాడు జిల్లాలో నడికూడికి

(మిగతా 8లో)

జెడ్పీ ఉద్యోగులకు షో కాజ్ నోటీసులు

గుంటూరు సిటీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లోని కొందరు ఉద్యోగులు చాలా విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు. బదిలీ అయ్యి నెల రోజులు కావొస్తున్నా.. ఉన్న చోట నుంచి కదలడానికి ఇష్టపడడం లేదు. కొందరు ఉద్యోగులు ఒకే చోట 12 ఏళ్ల నుంచి పనిచేస్తూ.. అక్కడే ఉండేందుకు పావులు కదుపుతున్నారు. నాదెండ్ల మండలం తూబాడు, ఈపూరు, దుర్గి, కొల్లూరు మండల పరిషత్‌ల నుంచి ఆఫీస్ సబార్డినేట్లు బదిలీ అయ్యారు. వారికి బదిలీ ఉత్తర్వులు కూడా పంపారు. అయినా రిలీవ్ అయ్యేందుకు సదరు ఉద్యోగులు సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలుసుకున్న జడ్పీ అధికారులు బదిలీ అయినా.. ఇంకా రిలీవ్ కాని ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని గురువారం ఆదేశించారు.

నేటి ఒక అవసరంగా ఏఐ

● ఏపీఎస్ఎస్‌డీసీ మాజీ సీఈవో, ఎండీ గంటా సుబ్బారావు



సదస్సుకు హాజరైన గంటా సుబ్బారావు

గుంటూరు(విద్య),జూలై 3(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) నేడు ఒక అవసరంగా మారిపోయిందని ఏపీ ఎస్ఎస్‌డీసీ మాజీ సీఈవో, ఎండీ గంటా సుబ్బారావు పేర్కొన్నారు. విద్యార్థులు ఏ విభాగంలో ఉన్నా ఏఐపై ప్రాథమిక అవగాహన ఉండాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ అకడమిక్స్, అసెస్‌మెంట్, అవార్డ్స్ అండ్ ఫ్యాకల్టీ అఫైర్స్ ఆధ్వర్యంలో " ఇంటరాక్టివ్ సెషన్ ఆన్ ఏఐ ఫోకస్డ్ యూనివర్సిటీ" అనే అంశంపై వర్సిటీలోని ఆయా విభాగాల డీన్స్, డైరెక్టర్స్, విభాగాధిపతులతో ప్రత్యేక కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గంటా సుబ్బారావు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక యుగంలో ఏఐ ప్రాముఖ్యత దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. మరో ముఖ్య అతిథి ఐఐటీ మద్రాస్ పూర్వ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ ఎన్.శివ ప్రసాద్ మాట్లాడుతూ విద్యా సంస్థల నిర్వహణలో ఏఐ వినియోగంపై అధ్యాపకులు దృష్టి సారించాలన్నారు. విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

జగన్ దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలి

● వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కొనసాగుతున్న సుపరిపాలనపై మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. గురువారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. జగన్ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. కూటమి పాలన ద్వారా అన్ని రంగాలను పునఃవ్యవస్థీకరించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాజధాని అమరావతిని ఒక ఆదర్శ రాజధానిగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు దూసుకుపోతున్నాయన్నారు. టీడీపీ శ్రేణులు సుపరిపాలన విషయంపై జనసేన, బీజేపీ నాయకులతో సమైక్యంగా ఉండి ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, యార్డు చైర్‌పర్సన్ జయపూర్ణకుమారి పాల్గొన్నారు.

సాగర్ రిజర్వాయర్‌లో చేపల వేట నిషేధం

● జిల్లా మత్స్యశాఖాధికారి సంజీవరావు

మాచర్ల రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్, కేఎల్ రావు పులిచింతల రిజర్వాయర్లలో ప్రభుత్వం చేపల వేట నిషేధించినట్లు జిల్లా మత్స్య శాఖాధికారి సంజీవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చేపల సంతానోత్పత్తి సమయం కావడం వల్ల ఆగష్టు 31వ తేదీ వరకు నిషేధం కొనసాగుతుందని పేర్కొన్నారు. నిర్దేశించిన సమయం వరకు మత్స్యకారులెవరూ రిజర్వాయర్‌లలో చేపల వేటకు వెళ్లవద్దని తెలిపారు. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే లైసెన్సు రద్దు చేయడంతోపాటు అపరాధ రుసుం విధిస్తామని పేర్కొన్నారు.

బాపట్ల రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు



బాపట్ల రైల్వేస్టేషన్ తనిఖీలో పోలీసులు

బాపట్ల, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిరోధంలో భాగంగా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు క్రైమ్ డీఎస్పీ జగదీష్ నాయక్ సిబ్బందితో కలిసి బాపట్ల రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి విస్తృత తనిఖీలు చేపట్టారు. పోలీసు, ఈగల్ టీమ్, ఎస్‌ఐఎఫ్, జీఆర్పీ సిబ్బందితో కలిసి పరిశీలించారు. మత్తు పదార్థాలను ఎరగా వేసి యువత భవిష్యత్తతో ఆడుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. శబరి ఎక్స్‌ప్రెస్ రైలులో కొంత దూరం ప్రయాణించి, బోగీలను విస్తృతంగా శోధించారు. మాదక ద్రవ్యాలను గుర్తించే పోలీసు డాగ్ స్క్వాడ్, సిబ్బంది రైల్వేస్టేషన్ పరిసరాలను, పార్శిల్ సర్వీస్ సెంటర్లను, బోగీలను, అనుమానాస్పద వ్యక్తులను ముమ్మరంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బదిరం బంధాన్ని తుంచేసింది..

● బాలికను కాల్వలో తోసేసి చంపేసిన సొంత తాతే..

తాడేపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 1న రాత్రి కుంచనపల్లి బకింగ్ హామ్ కెనాల్‌లోకి తోసేయడంతో.. 11 ఏళ్ల బాలిక మృతి చెందిన విషయం విదితమే. ఆ బాలికను ఆమె తాతే కాల్వలోకి తోసి, చంపేశాడు. మృతి చెందిన బాలిక తాడికొండ మండలం బడేపురం గ్రామానికి చెందిన కూరపాటి హేమగా పోలీసులు గుర్తించారు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోవడంతో బాలిక.. తాత మాధవరావు వద్దే పెరుగుతోంది. పుట్టుకతోనే మూగ, చెవుడు కావడంతో సదరు బాలికను పోషించలేక తాతే ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. కుంచనపల్లి వంతెన వద్దకు తీసుకువచ్చి కాలువలోకి తోసేశాడు. కాగా, నిందితుడు మాధవరావును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

ఇసుక లారీ యజమానులు..

నిబంధనలు అతిక్రమిస్తున్నారు

● అందుకే పెనాల్టీలు విధించి కేసులు పెడుతున్నాం

● 'ఆంధ్రజ్యోతి'కి డీటీసీ సీతారామిరెడ్డి స్పందన

గుంటూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇసుక లారీ యజమానులు/డ్రైవర్లు మోటారు వాహన చట్టం నిబంధనలు అతిక్రమించి, భారీ మోతాదులో లోడింగ్ చేసి రవాణ చేస్తున్నారని జిల్లా ఉప రవాణ శాఖ అధికారి సీతారామిరెడ్డి తెలిపారు. దీనిపై తాము చట్టప్రకారం చర్యలు తీసుకొంటే లారీ యజమానులు, డ్రైవర్లు తమపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'నెలవారి మామూళ్ల డిమాండ్ చేస్తున్నారు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి డీటీసీ స్పందించారు. వాహన చట్టం ప్రకారం అనుమతించిన దానికంటే అదనంగా 5 శాతం వరకు మార్జిన్ పర్మిషన్ ఇస్తామన్నారు. అంతకుమించి అధిక బరువుతో వాహనాన్ని నడిపితే రూ. 20 వేలు పెనాల్టీ, అదనంగా ప్రతీ టన్నుకు రూ.2 వేలు అపరాధ రుసుం వసూలు చేస్తామని చెప్పారు. గత ఆరు నెలల్లో అధిక బరువుతో తిరుగుతున్న ఇసుక లారీలపై 103 కేసులు నమోదు చేశామని వెల్లడించారు. అలానే టార్పాలిన్ పట్టా కప్పకుండా నడుపుతున్న వాహనాలపై 325 కేసులు పెట్టామన్నారు. వీటిల్లో 48 వాహనాలకు రూ. 3.42 లక్షలు వసూలు చేశామని, 277 వాహన యజమానులు రూ. 11,78,510 పెనాల్టీలు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. రహదారి భద్రత కోసమే ఈ చర్యలు చేపట్టామని డీటీసీ వివరణ ఇచ్చారు. పెనాల్టీలు మినహా మరెలాంటి నగదుని లారీ యజమానుల వద్ద వసూలు చేయడం లేదని చెప్పారు. వాళ్లకు ఏమైనా సమస్య ఉంటే నేరుగా ఉప రవాణ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చన్నారు.

ఇసుక లారీ యజమానుల ధర్నాని అడ్డుకొన్న పోలీసులు

గుంటూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇసుక లారీ యజమానులు చేస్తున్న ధర్నాని రెండో రోజు గురువారం పోలీసులు అడ్డుకొన్నారు. పోలీసు శాఖ నుంచి అనుమతి తీసుకోకుండా నిరసన కార్యక్రమాలు చేయడానికి వీల్లేదని అసోసియేషన్ నాయకులకు చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు చేపడతామని హెచ్చరించారు. దీంతో అమరావతి రోడ్డులోని హోసన్నా మందిరం వద్ద శిబిరాన్ని తొలగించారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

● మంత్రి అనగాని సత్యప్రసాదు



సజ్జావారిపాలెంలో కరపత్రం అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

నగరం, జూలై 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. గురువారం నగరం మండలం సజ్జావారిపాలెంలో తొలి అడుగు సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనగాని మాట్లాడుతూ 365 రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన 365 మంచి పనులను ప్రజలకు వివరించామన్నారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. యువత, మహిళలు, రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. మహిళల కోసం దీపం పథకంతో పాటు తల్లికి వందనం అమలు చేస్తున్నామని ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకాన్ని అమల్లోకి తీసుకువస్తున్నామన్నారు. యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం శ్రమిస్తోందని మంత్రి తెలిపారు. నగరం మండలంలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించామని, పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, అనగాని శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు చింతల సుబ్బారావు, ఎన్‌వీకేప్రసాద్, విచారపు వీరయ్య, మేకా వెంకటశివరామకృష్ణ, టీడీపీనాయకులు పాల్గొన్నారు.

నవ శకానికి దిక్సూచిగా..

కూటమి ఏడాది పాలన

●చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



కరపత్రం అందజేస్తున్న చీఫ్ విప్ జీవీ, డీసీసీబీ చైర్మన్ మక్కెన

ఈపూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రలో నవ శకానికి దిక్సూచిగా కూటమి ఏడాది పాలన నిలిచిందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం ఈపూరు మండలం ఇనుమెళ్ల, ముప్పాళ్ళలో తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసిన రాష్ట్రంలో కూటమి ఏడాది పాలన ప్రతి అడుగు ప్రగతి బాటలో సాగిందన్నారు. పన్నెండు నెలలు వ్యవధిలోనే వ్యవస్థల్ని గాడిన పెట్టి పునర్నిర్మాణం దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. జగన్ మోహన్‌రెడ్డి రూ.10 లక్షల కోట్ల అప్పుల వారసత్వంలో మరొకరైతే చేతులెత్తేసే వారని, కానీ చంద్రబాబునాయుడు మాత్రం సవాళ్లకు ఎదురు నిలిచి సంక్షేమం, అభివృద్ధిలో సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నారని అన్నారు. రానున్న రోజులలో మరింత సంక్షేమం, అభివృద్ధిని అందిస్తారన్నారు. జీవీ ఆంజనేయులు స్థానిక ప్రజలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని అధికారులకు సూచించారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల

పరిష్కారానికి కృషి చేయాలి: కొమ్మాలపాటి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ ఏడాది పరిపాలన, సూపర్ సిక్స్ పథకాలపై ప్రజాభిప్రాయం తెలుసుకుని, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీదర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్రంలో అధ్వానంగా ఉన్న రహదారులపై గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రూ.12 వేల కోట్లు ఖర్చు చేసి 20 వేల కిలో మీటర్లు రోడ్లను బాగు చేసినట్టు చెప్పారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన చెత్త పన్నును రద్దు చేసి ప్రజలకు ఊరట కలిగించిన సంగతి గుర్తు చేశారు. 8.50 లక్షల మంది రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.13.5 వేల కోట్లు చెల్లించామన్నారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించబోతున్నారని తెలిపారు. అతి త్వరలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కూడా ఇస్తారని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు మూడు విడతలుగా రూ.20 వేలు అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రజలు అండగా నిలవాలన్నారు. సమావేశంలో గొట్టిపాటి జనార్దన బాబు, కోట నాగ సుధీర్, తిరుమలకొండ నరసింహారావు, దండా అనీల్ తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ హెచ్‌డబ్ల్యువోపై విజిలెన్స్ విచారణ

●ఆ శాఖ డైరెక్టర్ నుంచి ఆర్వీఈవోకు లేఖ

● నెలలో నివేదిక ఇవ్వాలని ఆదేశం

గుంటూరు (విద్య) జులై 3 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఆరుసార్లు సస్పెన్షన్‌కు గురైన ఆయన తీరులో మార్పు రాలేదు. అంతే కాదు రైతుల నుంచి ధాన్యం కొని రూ.20 లక్షలకు ఎగనామం పెట్టి వారిని నట్టేట ముంచాడు. దీనిపై కేసు కూడా నమోదైంది. అంతేకాదు ఉన్నతాధికారులను దూషించిన ఘటనపై గుంటూరులోని నగరంపాలెంలో మరో కేసు, మహిళలని అసభ్య పదజాలంతో దూషించాడని ఇంకొక కేసు నమోదైంది. ఇలా అనేక తప్పిదాలకు పాల్పడిన సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.సుభాషణ్‌పై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తూ ఆ శాఖ డైరెక్టర్ బి.లావణ్యవేణి గుంటూరులోని ప్రాంతీయ విజిలెన్స్ ఎస్పీకి లేఖ రాశారు. ఈ ఘటన సాంఘిక సంక్షేమ శాఖలో కలకలం సృష్టిస్తోంది. ప్రస్తుతం గుంటూరు నగరంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సుభాషణ్ చిలకలూరిపేట, అమర్తలూరు, పొన్నూరు, తెనాలి, గుంటూరు తదితర ప్రాంతాల్లో హెచ్‌డబ్ల్యుఓగా పనిచేస్తున్న సమయంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు దీంతో అప్పట్లో అధికారులు ఆయనను సస్పెండ్ చేశారు. అంతేకాకుండా చేబ్రోలు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పని చేస్తున్న సమయంలో రైతుల నుంచి ధాన్యం కొని రూ. 20 లక్షలు చెల్లించలేదు. దీనిపై చేబ్రోలు పోలీస్ స్టేషన్లో రైతులు ఫిర్యాదు చేయడంతో అక్కడ కూడా కేసు నమోదైంది. అదేవిధంగా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, డీఎస్‌డబ్ల్యూవోలను దూషించిన ఘటనపై నగరంపాలెంలో కేసు నమోదైంది. అంతేకాదు మహిళా ఉద్యోగుల్ని అసభ్య పదజాలంతో దూషించినట్లు ఫిర్యాదుల ఉన్నాయి. ఇటువంటి ఉద్యోగికి గ్రేడ్ వన్ హెచ్‌డబ్ల్యూవోగా పదోన్నతి ఇచ్చినట్లు ఫిర్యాదులు ఉన్నాయి ఈ నేపథ్యంలో ఆయా ఘటనలపై విచారణ నిర్వహించి నెల రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లావణ్యవేణి నుంచి ప్రాంతీయ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు గత నెల 13న లేఖ వచ్చింది. ఈ విషయం గురించి విజిలెన్స్ ఎస్పీ దువ్వారపు సూర్య శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ తమకు లేఖ అందిన విషయం వాస్తవమేనని, తదుపరి చర్యల కోసం విజిలెన్స్ ఐజీకి సదరు లేఖను పంపినట్లు "ఆంధ్రజ్యోతి"కి వివరించారు.

నల్లపాడు కేవీలో..

ప్రవేశానికి ఆహ్వానం

గుంటూరు(విద్య), జూలై 3(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయంలో 4, 6 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బొంతా శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతిలో ప్రవేశానికి కనీసం 9, 6వ తరగతిలో ప్రవేశానికి పదేళ్ల వయసు ఉండాలని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కోసం నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయంలో సంప్రదించాలని విజ్ఞప్తి పేర్కొన్నారు.

మూడు రైళ్లకు రిజర్వేషన్ కోటాల సవరణ

గుంటూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జంక్షన్ మీదగా ప్రయాణించే మూడు రైళ్ల రిజర్వేషన్ కోటాలను రైల్వే శాఖ సవరించింది. 12704 సికింద్రాబాద్ - హౌరా ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ గుంటూరు రిమోట్ లొకేషన్‌లో ఫస్టు ఏసీ 2, ఏసీ టూటైర్ ఎనిమిది, ఏసీ త్రీటైర్ 30, స్లీపర్ క్లాస్ 30 బెర్తులు అందుబాటులో ఉంటాయి. 12703 హౌరా - సికింద్రాబాద్ ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్‌కి గుంటూరుని విశాఖపట్నం రిమోట్ లొకేషన్ లోనే కొనసాగిస్తూ ఏసీ టూటైర్ 2, ఏసీ త్రీటైర్ 3, స్లీపర్ క్లాస్ 25 బెర్తులను అందుబాటులో ఉంచింది. 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్‌కి ఆగస్టు 12 నుంచి స్లీపర్ క్లాస్‌కి తత్కాల్‌లో 10, ప్రీమియం తత్కాల్‌లో 18 బెర్తులు పెరగనున్నాయి.

సచివాలయ ఉద్యోగులకు రీ కౌన్సెలింగ్ నిర్వహించాలి



వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగులు

గుంటూరు సిటీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో పలు చోట్ల తీవ్రమైన అవకతవకలు జరిగినందున రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. గురువారం గ్రామ వార్డు సచివాలయాల శాఖ ప్రధాన కార్యాలయంలో ఆ శాఖ డైరెక్టర్ శివప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ అనేకచోట్ల గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ జీవో 05 అనుసరించకుండా జరిపారని ఆరోపించారు. ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం వల్ల సీనియర్ ఉద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. అనేక జిల్లాల్లో సీనియార్టీ జాబితా ప్రదర్శించకుండానే, కేవలం ఆప్షన్స్ మాత్రమే ఇచ్చారని తెలిపారు. విజయవాడ కార్పొరేషన్ లో పనిచేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులకు కౌన్సెలింగ్ జరపకుండానే, అన్యాయంగా బదిలీలు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ విషయాలపై విచారణ జరిపి న్యాయం చేస్తానని డైరెక్టర్ హామీ ఇచ్చినట్లు అబ్దుల్ రజాక్ తెలిపారు. సంఘ సంయుక్త కార్యదర్శి పార్థా మధు, కార్యవర్గ సభ్యులు రమేష్, సంఘ నాయకులు భగీరథ, మాధవరావు, ముఖేష్, సలీం, రాజా, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ల పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



డాక్టర్ నవీన్‌కుమార్‌తో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రవి

ఈపూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ముప్పాళ్ల పీహెచ్‌సీని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రవి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిసరాలను పరివేక్షించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆల్ నేషనల్ ప్రోగ్రామ్స్ గురించి చర్చించారు. ఎన్‌సీడీ, సీడీ, సికిల్ సెల్ ఎనిమియా, పీఎంఎస్ఎంఏ, వాయోవందనా అన్నింటినీ రోజు చేయాలన్నారు. ఈవోడీలను విరివిగా ఫాలో అప్ చేసి, ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. డాక్టర్ నవీన్ కుమార్, డిప్యూటీ హెచ్ఈవో కె. నరసమ్మ, జి.శైలజా, ఏఎన్ఎం జయ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

40,612 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 38,018 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 40,612 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,525 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9700	11200
334	9500	13000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13200	334	9500	12800
273	----	-----	నెంబరు. 5	10000	13300
341	10000	13500	273	---	----
4884	10000	12200	341	10000	13400
సూపర్ 10	9700	12400	4884	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	13800	తేజ	10000	13500
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	12700
బ్యాడిగి	10000	12700	దేవనూరు డీలక్స్	10000	12500
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4500	7000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



మాట్లాడుతున్న వెలుగూరి రాధాకృష్ణమూర్తి, పాల్గొన్న ప్రజా, కార్మిక సంఘ నాయకులు

సమ్మెలో అందరూ భాగస్వాములు కావాలి

● వెలుగూరి రాధాకృష్ణమూర్తి

గుంటూరు(తూర్పు), జూలై 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి తెలిపారు. సార్వత్రిక సమ్మె సన్నాహకాలపై కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక గుంటూరు సమితి ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్‌లో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో కార్మికులు, రైతుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. లేబర్‌కోడ్, నల్ల చట్టాలను తీసుకువచ్చి వారి ఉపాధిని దెబ్బకొడుతున్నారని మండిపడ్డారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు ప్రసంగిస్తూ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మోదీ కార్మికులను, రైతులను శత్రవులుగానే చూస్తున్నారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయకుండా మాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆకిటి అరుణ్‌కుమార్, సీఐటీయూ నగర కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన అవసరం

● అదనపు ఎస్పీ అరవిందకుమార్



మాట్లాడుతున్న అరవిందకుమార్

గుంటూరు(విద్య), జూలై 3(ఆంధ్రజ్యోతి): సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు అవగాహన ఉండాలని డిప్యూటీ అదనపు ఎస్పీ అరవిందకుమార్ సూచించారు. గురువారం స్థానిక అమరావతి రోడ్డులో గల హిందూ ఫార్మసీ కళాశాలలో జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. షేర్ మార్కెట్, లోన్ యాప్స్, వివిధ ఉపాధి రంగాలలో జరిగే మోసాల గురించి వాటినుంచి రక్షణ పొందటానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని చెప్పారు. ఈ మోసాలను గురించి 1930 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు. కార్యక్రమంలో అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు, కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపల్ నాగభూషణం, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ పి.సీతారామయ్య, జె.శివజ్యోతి, సీహెచ్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయి మందిర వార్షికోత్సవాలు

గుంటూరు(తూర్పు), జూలై 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వికాసనగర్‌లోని షిర్డీ సాయి మందిర్‌లో గురువారం మందిర 26వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన నిర్వహించారు. మధ్యాహ్నం హారతి జరిగింది. గురుపౌర్ణమి సందర్భంగా 9న విశేష అభిషేకాలు, 10 విశేష హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు పూర్ణచంద్రరావు తెలిపారు.

టీజేపీఎస్‌లో వనమహోత్సం

గుంటూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): స్థానిక టీజేపీఎస్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి మాట్లాడుతూ వన మహోత్సవం మన దేశంలో పర్యావరణ పరిరక్షణ కోసం జరుపుకునే ముఖ్యమైన పండుగని, ఈ సందర్భంగా ప్రజలందరూ తమ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ అనితా దేవి, ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాదిపతి డాక్టర్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీస్తు శాంతిమార్గం అనుసరణీయం

గుంటూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): క్రీస్తు చూపిన శాంతి మార్గం మానవాళికి అనుసరణీయమని దైవ సేవకుడు ఫాదర్ కొచ్చర్ల జ్యోతిరాజు, సతీష్‌బాబు, జాన్సన్, చిన్నయ్య పేర్కొన్నారు. ఏపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్కా చంద్రపాల్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీభవన్‌లో గురువారం ఇండియన్ క్రిస్టియన్ డే జరిగింది. ఈ సందర్భంగా ఫాదర్లతో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వరరావు, రాచకొండ జాన్‌బాబు, బిళ్ళా సునీల్, జ్ఞానరాజ్ పాల్, సందీప్ తదితరులున్నారు.

హస్తకళ, చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

గుంటూరు(తూర్పు), జూలై 3(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీకళాభారతి చేనేత, హస్తకళా ప్రదర్శన గురువారం ప్రారంభమైంది. తొలుత ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ప్రధానకార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు తదితరులు ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం మస్తానయ్య మాట్లాడుతూ ప్రదర్శనలో వెంకటగిరి, కాటన్ వస్త్రాలు, మిలెట్స్, హస్తకళా ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



చేనేత ప్రదర్శనను ప్రారంభిస్తున్న మస్తానయ్య

విద్యుత్ ఒప్పందాలపై పునఃసమీక్షించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబురావు

గుంటూరు కార్పొరేషన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలంగా ఆదానీ, షిర్డీ సాయి లాంటి ప్రైవేట్ కంపెనీలతో అధికార పార్టీలు చేస్తున్న విద్యుత్ ఒప్పందాలపై పునః సమీక్ష జరిపి, అవినీతికి పాల్పడిన సంస్థలపై, అధికారులపై చర్యలు తీసుకోవాలని, స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.హెచ్. బాబురావు డిమాండ్ చేశారు. 'విద్యుత్ కుంభకోణాలు - వినియోగదారులపై భారాలు' అనే అంశంపై జనచైతన్య వేదిక హాలులో గురువారం జరిగిన చర్చా గోష్టిలో ఆయన ప్రసంగించారు. సెకీ ఒప్పందం రాబోయే 25 ఏళ్లలో ప్రజలపై లక్ష 20 వేల కోట్ల పెనుభారం మోపుతుందన్నారు. షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ చేపట్టిన ఒప్పందాల ద్వారా వేల కోట్ల ప్రజాధనం వృథా అయ్యిందన్నారు. ఈ అవకతవకలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వైసీపీ నేత జగన్ స్పందించక పోవడం దురదృష్టకరమన్నారు. పౌర సమాజం స్పందించి, పెద్దఎత్తున ఉద్యమించి, లోప భూయిష్టమైన విద్యుత్ ఒప్పందాలను ఉపసంహరించుకునేటట్లు చేయాలన్నారు. సౌర విద్యుత్ పేరుతో ఇండోసోల్ కంపెనీ కోసం కరేడు, ఉలవపాడు ప్రాంతాల నుంచి దాదాపు 8500 ఎకరాల భూమిని సేకరించడం ప్రమాదకరమన్నారు. రైతులు సంఘటితమై ఈ భూ సేకరణను తిరస్కరించాలన్నారు. ఆదానీ, మోదీ, జగన్, చంద్రబాబు ఏకమై ఈ ఒక్క సంవత్సరం దాదాపు 16 వేల కోట్ల భారాన్ని విద్యుత్ వినియోగదారులపై మోపారన్నారు. విద్యుత్ భారం భరించలేక గుంటూరు జిల్లాలో సగం స్పిన్నింగ్ మిల్లులు మూతబడ్డాయన్నారు. నాడు పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లను పగల గొట్టాలని పిలుపునిచ్చిన టీడీపీ నేతలు నేడు గృహాలకు బిగించాలని పూనుకోవడం మోసపూరితమన్నారు. నాడు షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ జగన్మోహన్‌రెడ్డి బినామీ సంస్థ అంటూ ప్రచారం చేసి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేసిన టీడీపీ అగ్రనేతలు నేడు ఆ సంస్థతోనే విద్యుత్ ఒప్పందాలు చేసుకోవడం వారి ద్వంద్వ నీతిని బహిరంగ పరుస్తుందన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ అవినీతిని నిర్మూలిస్తానని నిరంతరం పేర్కొంటున్న నారా చంద్రబాబు నాయుడు అవినీతికి పాల్పడుతున్న షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ లాంటి విద్యుత్ సంస్థ లను ప్రోత్సహించడం తగదన్నారు. హైకోర్టులో కేసు వేసిన పయ్యావుల కేశవ్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మౌనం వీడి వినియోగదారులకు సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక విశ్లేషకులు టి.ధనుంజయరెడ్డి, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి, విశ్రాంత ఏఎస్పీ చలపతిరావు, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, చావా శివాజీ తదితరులు ప్రసంగించారు.



ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు బాబురావు తదితరులు

మెకానిక్‌ల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

గుంటూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మెకానిక్‌ల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయాలని, తాను పూర్తి సహకారం అందిస్తానని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మెకానిక్ డే సందర్భంగా టూవీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీఎస్ 6పై అపోహలు మానుకుని, మెకానిక్‌లు అవగాహన పెంచుకోవాలన్నారు. ఎలక్ట్రికల్, బ్యాటరీ వాహనాలపై కూడా నైపుణ్యం సాధించాలని సూచించారు. మెకానిక్‌లు తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని, దీనికి తన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ ఆసిఫ్ అలీ,స్టేట్ ట్రెజరర్ జుబేర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఈపా, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, టౌన్ ప్రెసిడెంట్ గౌస్ మొహిద్దీన్, టౌన్ సెక్రటరి వీరాంజనేయులు, బెల్ల వెంకటేశ్వర్లు, అన్వర్, జబి, పిచ్చిరెడ్డి, శైలజ, మంత్రి శ్రీనివాసరావు, బుడే సాహెబ్, భాషా మల్లికార్జునరావు, అస్లాం, కయురుద్దీన్, భాషా పల్సర్, కుమార్, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మెకానిక్ డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

● వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేస్తాం

నల్లచెరువు వాకింగ్ ట్రాక్‌కు నూతన రూపు తీసుకొస్తామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ట్రాక్ పరిశీలించిన ఎమ్మెల్యే వాకర్లతో మాట్లాడారు. ట్రాక్ నిర్మాణంతోటు పచ్చదనం, పార్కు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

● మినీ లారీ ట్రాన్స్ పోర్టు రోడ్డు పరిశీలన

మినీ లారీ ట్రాన్స్ పోర్టు రోడ్డును ఎమ్మెల్యే నసీర్ పరిశీలించి 60 అడుగులుగా విస్తరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జ్యోతి, వహీద్, కొంపల్లి మాలకొండయ్య, సాదినేని శ్రీనివాసరావు, చల్ల ఆంజనేయ ప్రసాద్, అచ్చి కిరణ్, నరేంద్ర, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పటిష్టతకు కృషి

● కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు విఠల్



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పాండురంగ విఠల్

గుంటూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు వీవీఎన్ మాధవ్ నేతృత్వంలో పార్టీ రాష్ట్రంలో విస్తరిస్తుందని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ పాండురంగ విఠల్ అన్నారు. గురువారం జిల్లాకు వచ్చిన మాధవ్‌ని పార్టీ కార్యాలయంలో విఠల్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి వచ్చే ఎన్నికల నాటికి ఎక్కువ సీట్లలో గెలుపొందేలా కృషి చేస్తామన్నారు.

బీసీల రక్షణ చట్టం తీసుకురావాలి

గుంటూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం హామీ మేరకు బీసీలకు తక్షణమే రక్షణ చట్టాన్ని తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ కోరారు. నల్లపాడు రోడ్డులోని సంఘం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో రోజురోజుకు బీసీపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. బీసీల రక్షణచట్టాన్ని తెచ్చి అమలుచేయాలని కోరారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కోలా అశోక్, రామకృష్ణ, కొల్లూరి హనుమంతరావు, దొంత బ్రహ్మం, యేటి కోటేశ్వరరావు, ప్రసన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మద్దాలి గిరి విద్యుత్ బకాయిలు రాబట్టాలి

గుంటూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే మద్దాలి గిరి తన స్పిన్నింగ్ మిల్లులకు సంబంధించి రూ.42 కోట్లు పైబడిన విద్యుత్ బకాయిలను వెంటనే రాబట్టేలా చర్యలు తీసుకోవాలని ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సుభాని గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్‌కు విజ్ఞప్తి చేశారు. సంగడిగుంటలోని విద్యుత్ భవన్‌లో ఎస్ఈని కలిసిన ఆయన వినతిపత్రం అందజేశారు. దీనిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం సేన నాయకులు ఉన్నారు.

ఘనంగా ఎస్వీ రంగారావు జయంతి

గుంటూరు(తూర్పు), జూలై 3(ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్ల, కాపు వసతి భవనంలో తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో మహా నటుడు ఎస్వీ రంగారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నంది అవార్డు గ్రహీత, ప్రసిద్ధ నాటక కళాకారుడు నరాలశెట్టి రవికుమార్‌ను సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో పలువురు వక్తలు ఎస్వీ రంగరావు నటన ప్రస్థానంపై, సినీరంగానికి చేసిన సేవలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బాలిశెట్టి విజయకుమార్, శేషం సుబ్బారావు, ఊరిబండి కృష్ణమూర్తి, ఇమడాబత్తుని నరసింహ, బుక్కిశెట్టి శివ, జవాది కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

మేడికొండూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడిచి వెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ఆవ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘట న మండలంలోని పేరేచర్ల గుంటూరు రోడ్డు లోని పెట్రోల్ బంకు వద్ద గురువారం రాత్రి జరిగింది. మృతుడు గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామానికి చెం దిన షేక్ నాగూర్ బాషా(45)గా పోలీసులు గుర్తించారు. తాపీ మేస్త్రిగా జీవనం కొనసా గిస్తున్నాడు. తన స్నేహితుడితో కలిసి పెట్రో ల్ పోయించుకోవడానికి వెంగళాయపాలెం నుంచి పేరేచర్లకు వచ్చారు. స్నేహితుడు పెట్రోలు కొట్టించుకుండగా బాషా బైక్ దిగి రోడ్డు పక్కన నిలబడ్డాడు. అదే సమయంలో పేరేచర్ల నుంచి వస్తున్న కారు ఆయనను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బాషా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మదార్ బీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. జరిగిన ప్రమాద సంఘటనపై మేడికొండూరు ఎస్ఐ సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్లపై వ్యర్థాలు వేయకుండా అవగాహన కల్పించాలి



పారిశుధ్యం పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై వ్యర్థాలు వేయకుండా ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం కమిషనర్ సుద్దపల్లి డొంక, పాతగుంటూరు, బాలాజీనగర్, పొన్నూరు రోడ్డు, కేవీపీ కాలనీ మెయిన్‌రోడ్డు, జాతీయ రహదారి వెంబడి పలు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేస్తే అపరాధ రుసుం విధించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. సచివాలయాల వారీగా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా మైక్రో ప్లాన్ ప్రకారం శానిటేషన్ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు.

కోర్టు కేసులపై దృష్టి సారించాలి

గుంటూరు కార్పొరేషన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో విభాగాల వారీగా కోర్టు కేసుల పరిష్కారంపై విభాగాధిపతులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కోర్టు కేసుల పురోగతి, పెండింగ్ అంశాలపై గురువారం కౌన్సిల్ సమావేశ మందిరంలో సమీక్షించారు. కేసులపై రోజువారి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీపీ రాంబాబు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, మేనేజర్ బాలాజీబాష తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుప్రభా

గుంటూరు(విద్య), జూలై 3 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక పురోగతికి కీలకమైన నూతన ఆవిష్కరణలకు యువత సిద్ధం కావాలని కర్ణాటక నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అసోసియేట్ ప్రొఫెసర్, వాధ్వాని ఫౌండేషన్ గ్లోబల్ జ్యూరీ సభ్యురాలు డాక్టర్ సుప్రభా కే.ఆర్ అన్నారు. గురువారం చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. అభివృద్ధి చెందిన డిజైన్ పద్ధతులు, స్టార్టప్ వ్యాపారాల ప్రారంభానికి అవసరమైన ఎంట్రప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాలపై లోతైన అవగాహన అవసరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశించిన 'ప్రతి కుటుంబం నుంచి ఒక ఎంట్రప్రెన్యూర్ తయారవ్వాలి' అనే అంశం సఫలీకృతం కావాలంటే విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ తెలిపారు. స్టార్టప్‌లను అభివృద్ధికి తమ కళాశాల ఇంక్యుబేషన్ సెంటర్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డాక్టర్ కె.రవీంద్ర, ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.వి.పి.చంద్రశేఖరరావు, ఇంకుబేషన్ మేనేజర్ డాక్టర్ కె.శోభ, డాక్టర్ ఆర్.హఫీజ్ బాషా, డాక్టర్ సజ్జా రాధిక తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రం ఎప్పుడు ఏర్పాటు చేస్తారు

● ఎమ్మెల్యేను ప్రశ్నించిన రైతులు



ఎమ్మెల్యే రామాంజనేయులును ప్రశ్నిస్తున్న పొగాకు రైతులు

పెదనందిపాడు, జులై 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలో పొగాకు కొనుగోలు కేంద్రం ఎప్పుడు ఏర్పాటు చేస్తారంటూ ఎమ్మెల్యే రామాంజనేయులును రైతులు ప్రశ్నించారు. పెదనందిపాడులో గురువారం జరిగిన తొలిఅడుగు సన్నాహక సభలో రామాంజనేయులు వద్ద పొగాకు రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు. కాకుమానులో పర్చూరు ఎమ్మెల్యే వచ్చి గిడ్డంగి తీసుకుని పొగాకు కొనుగోలు చేయిస్తున్నారని, కాని మనం మాత్రం ఇంత వరకు గిడ్డంగి తీసుకోలేక పోవడం ఏమిటన్నారు. గోగులమూడికి చెందిన కొంత మంది రైతులు గుంటూరులోని కొనుగోలు కేంద్రానికి పొగాకు తీసుకెళితే అక్కడి అధికారులు కొర్రీలు పెట్టి తిరస్కరిస్తున్నారన్నారని, అంతే కాకుండా మద్దతు ధర కూడా లభించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తిరస్కరించిన పొగాకు బేళ్లను వెనక్కు తీసుకురావాలన్నా ఇబ్బందులు పడాల్సిన వస్తుందన్నారు. పొగాకు పండించిన రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉందని, అధికారులు సైతం వారి ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బూర్ల మీకు ఏమన్నా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. దీనిపై రైతులు కొందరు ప్రతి విషయాన్ని మీ దృష్టికి తీసుకురావడం సాధ్యపడదన్నారు. పెదనందిపాడులో గిడ్డంగులు అందుబాటులో లేవని, ఉన్న గిడ్డంగులు ఇబ్బందికరంగా ఉన్నాయని, త్వరలోనే పరిశీలించి ఇక్కడే కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

వైసీపీకి అధికారం రాదు.. రానివ్వం

● జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె స్పష్టీకరణ

● వైసీపీ తప్పుడు రాజకీయాలు మానుకోవాలని హితవు

గుంటూరు మెడికల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాబోయే కాలంలో తమ ప్రభుత్వం వస్తుందని వైసీపీ నాయకులు కలలు కంటున్నారని.. జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెప్పినట్లు వైసీపీ అధికారంలోకి రాదు.. రానివ్వం అనే మాట నిజమై తీరుతుందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం అమరావతి రోడ్డులోని పశ్చిమ నియోజకవర్గ జనసేన కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెల 18న పరామర్శల పేరిట ముగ్గురు చావుకు కారణమయ్యారని విమర్శించారు. తన వాహనం కింద పడి మృతి చెందిన శింగయ్య కుటుంబీకులను రెండు వారాల తర్వాత తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించుకుని పరామర్శ పేరిట కొత్త నాటకానికి జగన్ తెర తీశారని ఆయన మండిపడ్డారు. శింగయ్య భార్యను బెదిరించో, ప్రలోభపెట్టో ఆవిడతో కొత్త కథను చెప్పించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇందుకుగాను జగన్‌రెడ్డిపై, శింగయ్య భార్యపై మరొక కేసు నమోదు చేయాలని గాదె పోలీసులకు విజ్ఞప్తి చేశారు. బంగారు భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వానికి, జనసేన పార్టీకి అండగా నిలవాలన్నారు. జనసేన పార్టీ నాయకులు చందు సాంబశివరావు మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం ప్రధాన ప్రతిపక్ష హోదా సాధించేందుకైనా వైసీపీ నేతలు ప్రయత్నించాలని హితవు పలికారు. తప్పుడు రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తే సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతారని హెచ్చరించారు. సమావేశంలో కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నాయకులు అడపా మాణిక్యాలరావు, బిట్రగుంట మల్లిక, శిఖా బాలు, చట్టాల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి.కిషోర్‌కుమార్, పాల్గొన్న ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ నాయకులు

ఎల్ఐసీని బలహీనపరిచే విధానాలను వీడాలి

● సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి కిశోర్

గుంటూరు(తూర్పు), జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీని బలహీనపరిచే విధానాలను ప్రభుత్వం విడనాడాలని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి కిశోర్ తెలిపారు. అరండల్‌పేటలోని ఎల్ఐసీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను 74 నుంచి 100 శాతానికి పెంచాలనే ప్రభుత్వ నిర్ణయం సరైనది కాదన్నారు. పెన్షన్ నిధులను స్టాక్ మార్కెట్లకు తరలించడం నష్టదాయకమన్నారు. ఎల్ఐసీలో 1996 నోటిఫికేషన్ ద్వారా నియమించిన ఉద్యోగులకు పాత పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీమా ప్రీమయంపై ఉన్న 18శాతం జీఎస్టీని తక్షణమే రద్దు చేసి, పాలసీదారులకు ఉపశమనం కలిగించాలని కోరారు. ఎల్ఐసీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. లేబర్ కోడ్‌లు, నల్ల చట్టాలకు వ్యతిరేఖంగా 9న జరిగే సార్వత్రిక సమ్మెకు ఎల్ఐసీ ఉద్యోగ సంఘాలు పూర్తి మద్దతు ఇస్తున్నట్టు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మచిలీపట్నం డివిజనల్ సంయుక్త కార్యదర్శి వీవీకే సురేష్, శ్రీనివాస్, సైదులు, వెంకట్రావు, శివరామకృష్ణారావు, రాజశేఖర్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నసీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

వేతనాల పెంపునకు సహకరించాలి

గుంటూరు(తూర్పు), జూలై 3(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలోని పారిశుధ్య కార్మికుల జీతాల పెంపునకు సహకరించాలని ఏఐటీయూసీ నగర ప్రధానకార్యదర్శి కోటా మాల్యాద్రి కోరారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్‌కు యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాల్యాద్రి మాట్లాడుతూ మున్సిపల్ స్థాయి నుంచి గ్రేటర్ కార్పొరేషన్ అయినా నగరంలో కార్మికుల సంఖ్య పెంచలేదన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. ఆప్కాస్‌లో పనిచేస్తూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో చిన్నపోతుల వెంకట్రావు, రావుల అంజిబాబు, బట్టు సద్గుణరావు, దాసరి వెంకట్రావు, మిరియాల కోటేశ్వరావు తదితరులు ఉన్నారు.

విద్యావ్యవస్థలను నిర్వీర్యం చేస్తోన్న ప్రభుత్వాలు

● ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్‌చౌదరి

గుంటూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలను కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్‌చౌదరి విమర్శించారు. గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞానమందిరంలో గురువారం ఎన్ఎస్‌యూఐ నాయకులతో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రాథమిక పాఠశాలల వ్యవస్థతో పాటు పేద ప్రజలందరిని అక్షరాస్యులను చేయాలన్న సంకల్పంతో అనేక సంస్కరణలు తెచ్చినట్లు చెప్పారు. కాంగ్రెసేతర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాక విద్యను నిర్లక్ష్యం చేశాయని మండిపడ్డారు. విద్యా ప్రమాణాల మెరుగుకోసం ఎన్ఎస్‌యూఐ నాయకులు ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వాలతోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు షేక్ మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వరరావు, ఏపీసీసీ ప్రధానకార్యదర్శి మదన మోహన్‌రెడ్డి, డాక్టర్ రాచకొండ జాన్‌బాబు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా తదితరులున్నారు.



మాట్లాడుతున్న వరుణ్‌చౌదరి, వేదికపై మస్తాన్‌వలి, లింగంశెట్టి తదితరులు

పల్నాడులో పామాయిల్!

ఆయిల్ పామ్(పామాయిల్) తోటల పేరు చెప్పగానే కృష్ణా, గోదావరి జిల్లాలు గుర్తుకొస్తాయి. ఏడాది క్రితం వరకు అక్కడికే పరిమితమైన ఆయిల్ పామ్ తోటల పెంపకం పల్నాడు జిల్లాకు విస్తరించింది. పత్తి, మిరప పంటలు సాగు చేసి నష్టపోతున్న రైతులు ప్రత్యామ్నాయంగా అయిల్ పామ్‌పై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే 1,601 ఎకరాల్లో పామ్ సాగు చేశారు. ఈ ఏడాది 3,300 ఎకరాల్లో సాగు లక్ష్యంగా ఉద్యాన శాఖ కృషి చేస్తోంది.

- జిల్లాలో విస్తరిస్తున్న సాగు ● ప్రోత్సాహం అందిస్తున్న ప్రభుత్వాలు
- ఇప్పటికే 1,601 ఎకరాల్లో.. ● ఈ ఏడాది సాగు లక్ష్యం 3,300 ఎకరాలు
- ఉచితంగా మొక్కలు పంపిణీ ● అంతర పంటలకు, బిందు సేద్యానికీ రాయితీలు
- రైతులను చైతన్య పరుస్తున్న ఉద్యాన శాఖ



బెల్లంకొండ మండలం మన్నెసుల్తాన్ పాలెంలో ఆయిల్ పామ్ తోట



కాపు దశలో ఆయిల్ పామ్ తోట

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): మంచి ఆదాయానికి ఆయిల్ పామ్ సాగు ఉత్తమమని రైతులను ఉద్యాన శాఖ చైతన్య పరుస్తోంది. మొక్కలను ఉచితంగా అందించడమే కాకుండా.. అంతర పంటల సాగుకు ఆర్థిక సాయం అందజేస్తోంది. నీటి వసతి ఉన్న భూములు పామాయిల్ సాగుకు అనుకూలమని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు అనుకూల వాతావరణ, భూసారం, నీటి లభ్యతపై నిర్వహించిన సర్వేలో 8 మండలాలను గుర్తించారు. ఆయా మండలాల్లో సాగు చేపడుతున్నారు. ఈ సాగుకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆర్థికంగా సహకారం అందిస్తోంది. వివిధ రాయితీలను కల్పిస్తోంది.

దిగుమతి తగ్గించి.. ఉత్పత్తి పెంచి

పామాయిల్ దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించడం, దేశీయంగా వంట నూనెల ఉత్పత్తిని పెంచడం లక్ష్యంగా ఆయిల్ పామ్ సాగుకు కేంద్ర ప్రభుత్వం వివిధ ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఇందుకు వంట నూనెల జాతీయ మిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ మిషన్ ముఖ్య ఉద్దేశం ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని విస్తరించడం. ముడి పామాయిల్ ఉత్పత్తిని పెంచడం. దేశంలో వంట నూనె లభ్యతను మెరుగుపరచడంపై దృష్టి పెట్టడం. ఈ మిషన్ రైతులకు ఆయిల్ పామ్ సాగును పోత్సహించడానికి, వారి ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలను నిర్ధారించడానికి, ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని అందిస్తుంది. ఆయిల్ పామ్ మొక్కలు పెంపకం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, అంతర పంటల సాగుకు రాయితీలను కల్పిస్తోంది.

వంద శాతం రాయితీ..

ఆయిల్ పామ్ సాగుకు ఉచితంగా మొక్కలు అందజేస్తారు. 9/9 మీటర్లకు ఒకటి చొప్పున ఎకరాకు 57 మొక్కలు నాటాలి. మొక్కలు నాలుగేళ్లకు కాపుకు వస్తాయి. హెక్టారికి 150 ఆయిల్ పామ్ మొక్కలను 100 శాతం రాయితీపై అందిస్తారు. ఈ మొక్కలు విదేశీవి అయితే ఒకటి రూ.193, దేశీ అయితే రూ.133. అంటే రూ.29 వేల రాయితీ లభిస్తుంది. మొక్కకు మొక్కకు మధ్య తొమ్మిది మీటర్ల యడం ఉండాలి. దీంతో మొక్కజొన్న, మిరప, కంది, అరటి, జామ, నువ్వులు, పొగాకు, మినుము అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చు. అంతర పంటల సాగుకు కూడా హెక్టారుకు 50 శాతం రాయితీపై ఏడాదికి రూ.5,250 ఆర్థిక సాయాన్ని నాలుగేళ్ల పాటు అందిస్తారు.

నీటి వసతి తప్పనిసరి..

ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా బిందు సేద్యానికి 80 నుంచి 100 శాతం రాయితీపై డ్రిప్‌ను అందిస్తారు. ఆయిల్ ఫామ్ సాగు చేయదలచుకున్న రైతులు కచ్చితంగా నీటి వసతి కలిగి ఉండాలి. బోరు సదుపాయం ఉండి వేసవిలో కూడా నీటి పారుదల చూసుకోవాలి. నాలుగేళ్ల నుంచి పామాయిల్ కాపు ప్రారంభమై ఏడేళ్లకు పూర్తిస్థాయిలో కాపు వస్తుంది. 30 ఏళ్ల పాటు నిరంతర దిగుబడితో నికరాదాయం పొందే అవకాశం ఉంది. మొదటి నాలుగేళ్ల అంతర పంటలు సాగు చేసుకుంటే.. ఏడో సవంత్సరం నుంచి కోకో సాగు చేయవచ్చు. చాక్లెట్ కంపెనీలు కోకో సాగును పోత్సహిస్తున్నాయి. హెక్టారుకు సగటున 25 నుంచి 30 టన్నుల పామాయిల్ గెలల దిగుబడి అవుతుంది. టన్ను ధర రూ.18 వేల వరకు ఉంది.



పిన్నెల్లిలో మొక్క నాటి నీరుపోతున్నఎమ్మెల్యే యరపతినేని(ఫైల్)

పొలంలోనే ప్రభుత్వ ధరకు కొనుగోలు



జిల్లాలోని ఎనిమిది మండలాలను ఆయిల్‌పామ్ సాగుకు తొలి దశలో ఎంపిక చేశాం. నాదెండ్ల, మాచవరం, పిడుగురాళ్ల, అమరావతి, బెల్లంకొండ, రాజుపాలెం, సత్తెనపల్లి, ఈపూరు మండలాల్లోని 1,601 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సాగు లక్ష్యం 3,300 ఎకరాలు కాగా, ఇప్పటికి 465 ఎకరాల్లో సాగైంది. ఇతర మండలాల్లో కూడా ఆయిల్ పామ్ సాగుకు సర్వే జరుగుతోంది. పామాయిల్ గెలలను నేరుగా పొలంలోనే కొనుగోలు చేస్తారు. వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ సంస్థకు ఆరు మండలాలు, గాద్రేజ్ ఆగ్రోవెట్ సంస్థకు రెండు మండలాలు కేటాయించడం జరిగింది. ఆయా సంస్థలు సాగులో మెళకువలు తెలియజేయడంతో పాటు పామాయిల్ గెలలను పొలంలోనే ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తాయి.

- ఇంటూరు వెంకట్రావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, పల్నాడు

విద్యాహక్కుకి.. కొర్రీలు

(5వ పేజీ తరువాయి)

విరుద్ధంగా నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం పాఠశాలల్లో పుస్తకాలు, దుస్తులు, స్టేషనరీ విక్రయించరాదు. రెగ్యులేటరీ కమిటీ నిర్దేశించిన ఫీజులను బోర్డుల్లో ప్రదర్శించి వసూలు చేయాలి. ప్రతి పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీలను ఏర్పాటు చేయాలి. అయితే ఈ నిబంధనలను గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని ఏ ప్రైవేటు పాఠశాలలో కూడా కనిపించడం లేదు. ఏ పాఠశాలకు కూడా ఆటస్థలం లేదు. అసలు కొన్ని పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులే ఉండరు. అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు, శానిటేషన్ నిబంధనలు పాటించడం లేదు. వందల మందికి ఒకటి రెండు మరుగుదొడ్లు, మూత్రశాలలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా బ్రాంచీలు ప్రారంభించడం, చివరిలో వేరే పేరుతో విద్యార్థుల్ని పరీక్ష పంపడం రివాజుగా మారింది. నిబంధన ప్రకారం అదనపు తరగతి ఏర్పాటు చేస్తే నిర్దేశించిన ఫీజు విద్యాశాఖకు చెల్లించాలి. అనేక పాఠశాలలు అపార్ట్మెంట్లలో నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం 40 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా ఒక్కో గదిలో 50 నుంచి 60 మందిని కుక్కుతున్నారు. ఇలాంటి ఎన్నో నిబంధనలను ఉల్లంఘించి విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారు. అయినా ప్రభుత్వం పేదలకు ప్రవేశాలు కల్పించాలని ఆదేశించినా పట్టించుకోకుండా వ్యతిరేకిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆయా పాఠశాలలపై విద్యాశాఖ దృష్టి సారించింది. ఆర్టీఈ సీట్లు నిరాకరిస్తున్న విద్యా సంస్థల్లో మౌలిక వసతులు, సౌకర్యాలు, ఫీజులు ఇతర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలనకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ఉచితానికి.. బస్సులేవి?

(5వ పేజీ తరువాయి)

పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో బస్సుల సంఖ్య పెంచడంతో పాటు అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించుకోవాల్సి ఉంది. ఇక గ్రామాల్లోకి బస్సు వెళ్లడానికి రోడ్లు సరిగ్గా లేవు. ఉచిత బస్సు పథకం అమలయ్యే నాటికి ఆయా రూట్లలో నూతనంగా బస్సు సర్వీసులను నడపడంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. ఇందుకు అవసరమైన అదనపు బస్సులు, మౌలిక వసతుల కల్పనపై కూడా కసరత్తు జరగాలి.

ఆర్టీసీకి ఎదురయ్యే సవాళ్లు..

- మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు కాగానే ఒక్కసారిగా బస్సుల్లో ఆక్యుపెన్సీ పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.
- ఉచితం అమల్లోకి రాగానే దాదాపు ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలనే డిమాండ్లు పెద్దఎత్తున ప్రభుత్వానికి చేరతాయి. రాజకీయంగా కూడా నేతలపై ఒత్తిడి పెరుగుతుంది.
- రహదారుల మరమ్మతు పనులు మరింత వేగవంతంగా చేపట్టి.. బస్సుల రాకపోకలకు అనుగుణంగా సిద్ధం చేయాలి.
- మొత్తం సర్వీసుల్లో దాదాపు ఎక్కువగా అద్దె బస్సులతోనే నెట్టుకు రావాల్సిన దయనీయ పరిస్థితిని ఆర్టీసీ ఎదుర్కొంటోంది.
- అధ్వానంగా ఉన్న రోడ్లపై బస్సుల రాకపోకలతో వాటి కండీషన్ ప్రశ్నార్థకంగా మారింది.

రైలు ప్రయాణానికి.. మరో మార్గం

(5వ పేజీ తరువాయి)

రాత్రి 12.05 నిమిషాలకు, పిడుగురాళ్లకు 12.30, నెమలిపురికి 1.00, రొంపిచర్లకు 1.25, వినుకొండకు 2.00 గంటలకు అక్కడి నుంచి మార్కాపురం, దొనకొండ, కంభం, నంద్యాల మీదగా శనివారం మధ్యాహ్నం 12.30 తిరుపతికి చేరుకోనున్నది. 07190 తిరుపతి నుంచి ప్రతి శనివారం మధ్యాహ్నం 2.20 నిమిషాలకు తిరుపతిలో బయలుదేరి రాత్రి 10.05కి వినుకొండ, 10.25కి రొంపిచర్ల, 10.35కి నెమలిపురి, 10.45కి పిడుగురాళ్ల, 11.00 గంటలకు నడికూడి నుంచి ఆదివారం ఉదయం 9.30 గంటలకు నాందేడ్‌కు చేరుకుంటుంది. నాందేడ్ - తిరుపతి వీక్లీ రైలు తెలంగాణతో పాటు పల్నాడు, ప్రకాశం జిల్లాల వారికి ప్రయాణ సౌకర్యం కలుగనున్నది.

ఆంధ్రజ్యోతి కథనంతో అందుబాటులోకి..

నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలుమార్గంలో నడపనున్న తిరుపతి నుంచి నాందేడ్‌కు ప్రత్యేక వీక్లీ రైలుకి నెమలిపరి, రొంపిచర్ల రైల్వేస్టేషన్లను ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్‌లోకి ఎట్టకేలకు రైల్వే అధికారులు శుక్రవారం తీసుకొచ్చారు. ఈ రైలుని ప్రకటించిన తర్వాత తొలుత రైల్వే శాఖ పీఆర్ఎస్‌లోకే తీసుకురాలేదు. ఈ క్రమంలో ఈ నెల 3న 'ఆంధ్రజ్యోతి'లో రెండు ప్రత్యేక రైళ్లకు... టిక్కెట్ల బుకింగ్ ప్రారంభం, నెమలిపురి, రొంపిచర్లలో స్టాపేజ్ లేని వైనం అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి రైల్వే శాఖ స్పందించి శుక్రవారం పీఆర్ఎస్‌లో ఈ రెండు స్టేషన్లను చేర్చింది. దీంతో గురువారం ఉదయం నుంచి ఈ స్టేషన్ల నుంచి కూడా టిక్కెట్ల బుకింగ్‌కి ఆన్‌లైన్, పీఆర్ఎస్ కౌంటర్లలో అనుమతి లభించింది. దాంతో ప్రయాణికులు తిరుపతి, నంద్యాల, కడప తదితర రైల్వేస్టేషన్లకు ఇక్కడి నుంచి టిక్కెట్‌లు బుకింగ్‌తో రిజర్వేషన్ క్లోజైంది. వచ్చే వారం సర్వీసుకు కూడా వెయిటింగ్ లిస్టు వచ్చేసింది. ఏసీ తరగతుల్లో మాత్రం కొన్ని ఖాళీలున్నాయి.

35 క్వింటాళ్ల..
రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరు టౌన్(చేబ్రోలు), జూలై, 3(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చేబ్రోలు పోలీసులు, విజిలెన్స్ అధికారుల కథనం మేరకు.. నారాకోడూరు గ్రామం వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఆటోను ఆపి సోదాలు నిర్వహించారు. 76 బస్తాల్లో ఉన్న రేషన్ బియ్యాన్ని గుర్తించి, ఆటో డ్రైవర్ బొల్లెద్దు శ్రీనివాసరావును ఆదుపులోకి తీసుకుని విచారించారు. బాపట్ల జిల్లా అమర్తలూరు మండలం ప్యాపర్రు గ్రామానికి చెందిన సునీల్ అనే వ్యక్తి కొల్లూరులో బియ్యం లోడు చేయించినట్లు తెలిపాడు. లోడ్‌ను నారాకోడూరు తరలిస్తున్నట్లు పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జడ్పీ ఆదాయంపై..ప్రైవేటు

- బల్లకట్టు వెనుక కనికట్టు ఛేదించేది ఎప్పుడో..
- రేవుల వేలానికి ఎవరూ రాకుండా స్కెచ్..
- ప్రైవేట్‌గా నిర్వహణతో.. జడ్పీ ఆదాయానికి గండి
- ఇదీ గోవిందాపురం, మాడిపాడు బల్లకట్టు పరిస్థితి



వేలం లేకుండానే.. రేవు వద్ద ప్రయాణికుల తరలింపు..



వేలం నిర్వహిస్తున్న డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలోని రేవుల వేలం పాటలు అధికారులకు తలనొప్పిగా మారాయి. రూ.లక్షలు వెచ్చించి పత్రికా ప్రకటనలు ఇస్తున్నా వేలంలో పాల్గొనేందుకు వచ్చే వారి సంఖ్య అతి తక్కువగా ఉంటోంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన చోటా మోటా నేతలు పడవ రేవుల్లో ప్రైవేటుగా.. పాగా వేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలో అసలు రేవుల వేలమే.. జరగలేదు. కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ చొరవతో వేలం పాటల్లో కొంత కదలిక వచ్చింది. మూడు నెలల క్రితం ఉమ్మడి జిల్లాలోని పడవ రేవుల నిర్వహణకు వేలం నిర్వహించగా రూ.1.45 కోట్ల ఆదాయం వచ్చింది. గతంలో రేవుల నిర్వహణకు వేలం ఆదాయం వచ్చిన దాఖలాలు లేవు. అయితే అప్పట్లో వేలంలో పాల్గొన్న వారిని రేవుల్లోకి వెళ్లకుండా అక్కడున్న చోటా మోటా నాయకులు అడ్డుకున్నారు. అచ్చంపేట మండలం గింజుపల్లి, అమరావతి మండలం దిడుగు రేవుల్లోకి వెళ్లిన పాటదారులను అక్కడున్న నేతలు కాళ్లు విరగ్గొడతామని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో భయపడిన పాటదారులు వెళ్లి పోవడంతో స్థానిక నేతలు అనధికారికంగా రేవులు నిర్వహిస్తున్నారు. వారిని పట్టుకునేందుకు అధికారులు పలుమార్లు దాడులు జరిపినా ప్రయోజనం లేకుండా పోయింది.

మూడు నెలల తర్వాత..

మూడు నెలల తర్వాత జిల్లా పరిషత్‌లో గురువారం మళ్లీ రేవుల వేలం పాటలు నిర్వహించారు. సీఈఓ జ్యోతిబసు, డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ ఆధ్వర్యంలో ఈ పాటలు జరిగాయి. అచ్చంపేట మండలంలోని గింజు పల్లి, చింతపల్లి, అమరావతి మండలంలోని దిడుగు పడవ రేవులకు మాత్రమే పాటదారులు హాజరయ్యారు. అతి తక్కువ ధరకు రేవుల హక్కులను దక్కించుకున్నారు. మాచవరం మండలంలోని గోవిందాపురం, అచ్చంపేట మండలంలోని మాదిపాడు, కొల్లిపర మండలంలోని వల్లభాపురం పడవ రేవు పాడు కునేందుకు బల్ల కట్టులకు ఎవరూ ముందుకు రాలేదు.

గోవిందాపురంలో ప్రైవేటు దందా

అచ్చంపేట మండలం మాదిపాడు, మాచవరం మండలం గోవిందాపురం బల్లకట్టులను అనధికారికంగా నిర్వహిస్తున్నారు. అక్కడ ఉన్న నేతల కనుసన్నల్లోనే ఈ బల్లకట్టు నడుపుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్‌కు రూపాయి చెల్లించకుండానే ఇక్కడ బల్లకట్టు పగలు, రాత్రి తిప్పుతూ ఉండటం గమనార్హం. గురువారం జరిగిన వేలం పాటలో కూడా ఎవరూ పాల్గొనక పోవడం పట్ల జడ్పీ సీరియస్‌గా దృష్టి సారించింది.

అసలు ధర తగ్గించే వ్యూహం

వేలం పాటలు పెట్టినా గైర్హాజరు కావడం వెనుక కూడా పెద్ద ప్రణాళిక ఉన్నట్లు తెలుస్తోంది. వరుసగా పాటకు రాకుండా ఎగ్గొట్టి తరవాత అదే రేవులను అతి తక్కువ ధరకు దక్కించుకునే ఆలోచన దాగిఉన్నట్లు చెబుతున్నారు. గోవిందా పురం, మాదిపాడు బల్లకట్టులో అదే జరుగుతుందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుంటూరు, గుంతకల్లు..
రైల్వే డివిజన్‌లకు కవచ్

- రూ. 204 కోట్లతో ఏర్పాటుకు రైల్వే శాఖ నిర్ణయం
- గుంతకల్లుతో కలిపి టెండర్ నోటిఫికేషన్ జారీ
- ఈ వ్యవస్థతో రైళ్లు పరస్పరం ఢీకొనే అవకాశం ఉండదు



గుంటూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు, గుంటూరు రైల్వే డివిజన్‌ల పరిధిలో కవచ్ వ్యవస్థని ఏర్పాటు చేసేందుకు రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ రెండు డివిజన్‌లలోని వివిధ సెక్షన్‌లలో కవచ్ భద్రతని ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రైల్వేబోర్డు నుంచి అనుమతులు రావడంతో దక్షిణ మధ్య రైల్వే టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకోసం రూ. 204 కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనా వేసింది. ప్రధానంగా రైల్వేస్టేషన్లు, లెవల్ క్రాసింగ్ గేట్లు, ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నల్, ఇంటర్మీడియట్ బ్లాక్ సిగ్నల్స్, రిమోట్ ఇంటర్‌ఫేర్ యూనిట్ల వద్ద ఈ కవచ్‌లను ఏర్పాటు చేస్తారు. ఈ వ్యవస్థ వల్ల డివిజన్‌లో ఎదురెదురుగా, ఒక దాని వెనక ఒకటి రైళ్లు ఢీకొనే అవకాశం ఉండదు. దాంతో ప్రమాదరహిత డివిజన్‌గా గుంటూరు మారుతుంది.

గుంటూరు, గుంతకల్లు కలిపి..

గుంటూరు, గుంతకల్లు డివిజన్లను కలిపి ఒక కవచ్ ప్రాజెక్టు కిందకు రైల్వే శాఖ చేర్చింది. గుంటూరు - కృష్ణా కెనాల్ జంక్షన్(27.12 కిలోమీటర్లు), నడికుడి - బీబీ నగర్(152.69), గుంటూరు - నడికుడి(95.25), నంద్యాల - గుంటూరు(256.98), డోన్ - నంద్యాల (75.76), గుంతకల్లు - కల్లూరు(40.26), గుత్తి - పెండేకల్లు(29.27), పాకాల - కాట్పాడి(62.54), ధర్మవరం - పాకాల(227.42), గుత్తి - ధర్మవరం(90.6), బళ్లారి - గుంతకల్లు(50.14) కిలోమీటర్ల సెక్షన్లలో కవచ్‌ని ఏర్పాటు చేస్తారు. మొత్తంగా 1,108 కిలోమీటర్ల పొడవునా రైలు ప్రమాదాల నివారణకు దుర్భేద్యంగా మారుతుంది. ఆగస్టు ఒకటో తేదీ వరకు టెండర్లను స్వీకరిస్తారు.

పూర్తి దేశీయ పరిజ్ఞానంతో..

కవచ్‌ని పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో ఇండియన్ రైల్వేస్ రూపొందించింది. దీనిని ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్‌గా భావిస్తారు. రైళ్ల భద్రతని పెంచడంతో పాటు ప్రమాదాలు జరగకుండా ఇదొక షీల్డ్‌లా వ్యవహరిస్తుంది. ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి ఆటోమేటిక్ బ్రేక్స్‌ని రైళ్లకు అప్లై చేస్తుంది. ముఖ్యంగా సిగ్నల్ పాస్డ్ ఎట్ డేంజర్(ఎస్‌పీఏడీ), ఓవర్ స్పీడు కేసుల్లో ప్రమాదాలు జరగకుండా నియంత్రిస్తుంది. ఈ సిస్టమ్‌కి సేఫ్టీ ఇంటిగ్రిటి లెవల్-4 సర్టిఫికేషన్ కూడా ఉంది. శీతాకాలంలో దట్టమైన పొగ మంచు కప్పుకొని సిగ్నల్స్ కనిపించవు. ఆ సమయంలో కూడా సిగ్నల్స్ రైలు కేబిన్‌లో కనిపించేలా చేస్తుంది. అనుమతించిన వేగంగా కంటే రైలుని మరింత వేగంగా నడుపుతున్నట్లు అయితే వెంటనే బ్రేక్స్ అప్లై చేస్తుంది. స్టేషన్ కవచ్‌ని ప్రతి స్టేషన్‌లోని బ్లాక్ సెక్షన్‌లో అమర్చుతారు. రైళ్ల లోకోలోనూ పెడతారు. ఆర్ఎఫ్‌డీ(రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెండిఫికేషన్) ట్యాగ్‌లను ట్రాక్‌ల పొడవునా ఏర్పాటు చేస్తారు. అలానే టెలికం టవర్స్‌ని రైలుమార్గాల పొడవునా ఏర్పాటు చేసి ట్రాక్‌సైడ్ ఎక్విప్‌మెంట్, లోకోమోటివ్స్‌కి కమ్యూనికేషన్‌ని ఏర్పరుస్తారు.

ఒక మేడం.. ముగ్గురు విద్యార్థులు



నాగిరెడ్డిపాలెం మెయిన్ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులతో ఉపాధ్యాయిని సుధాలక్ష్మి


బెల్లంకొండ, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఇది.. బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెం మెయిన్ ప్రాథమిక పాఠశాల. 20 ఏళ్ల నుంచి ఇక్కడ వందలాది మంది విద్యార్థులు ప్రాథమిక విద్యను అభ్యసించారు. సుమారుగా ఐదారుమంది ఉపాధ్యాయులు విద్యను బోధించేవారు. 2019 వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా సంస్కరణల పేరుతో.. 3, 4, 5 తరగతులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలీనం చేసింది. అప్పటి నుంచి నాగిరెడ్డిపాలెం పాఠశాల విద్యార్థుల హాజరు క్రమేపీ తగ్గిపోతూ వస్తోంది. ఈ విద్యా సంవత్సరం పాఠశాలలో 1, 2 తరగతులను పాఠశాలలో ఏర్పాటు చేశారు. 1వ తరగతికి ముగ్గురు విద్యార్థులు మాత్రమే వస్తున్నారని ఆ పాఠశాల ఉపాధ్యాయని సుధాలక్ష్మి చెబుతున్నారు. గత ఐదేళ్ల వరకు 50 మంది విద్యార్థులు.. ఇద్దరు ఉపాధ్యాయులు ఇక్కడ ఉండేవారు. తరగతుల విలీనంతో దూర ప్రాంతాలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామంలోని ప్రైవేట్ పాఠశాల వైపు మొగ్గు చూపుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.

ఉద్యోగ అవకాశాల కల్పనకు.. ఈఎల్ఐ

- రీజినల్ పీఎఫ్ కమిషనర్ ప్రభు దుత్తా పృష్టి

గుంటూరు సిటీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి ఆధారిత ప్రోత్సాహక(ఈఎల్ ఐ)పథకాన్ని ప్రవేశపెట్టిందని గుంటూరు రీజినల్ పీఎఫ్ కమిషనర్ -1 ప్రభు దుత్తా పృష్టి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ పథకం అమలు ద్వారా అన్ని రంగాల్లో సామాజిక భద్రతను పెంపొందిచవచ్చునని తెలిపారు. మొదటి సారి ఉద్యోగంలో చేరిన వారికి ఈ పథకం కింద ఒక నెల జీతం(గరిష్ఠంగా రూ. 15 వేలు) ప్రోత్సాహకంగా అందజేయడం జరుగుతుందని అన్నారు. మరిన్ని ఉద్యోగాలు కల్పించేందుకు అన్ని రంగాల్లోని యాజమానులకు రెండేళ్ల పాటు ఈ ప్రోత్సాహకం అందజేయడం జరుగుతుందని తెలిపారు. తయారీ రంగానికి సంబంధించిన యాజమాన్యంకు మరో రెండేళ్ల పాటు అదనంగా ప్రోత్సాహకం అందజేయడం జరుగుతుందని రీజనల్ పీఎఫ్ కమిషనర్ ప్రభు దుత్తా పృష్టి వెల్లడించారు. దేశ వ్యాప్తంగా 4.1 కోట్ల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో ఐదు పథకాల ప్యాకేజీ కోసం రూ. 2 లక్షల కోట్లు కేటాయించిందని తెలిపారు. అందులో ఈఎల్ఐ పథకం కోసం రూ.99,446 కోట్లతో దేశంలో 3.5 కోట్ల ఉద్యోగాలు కల్పించడం ప్రభుత్వం లక్ష్యం అని వివరించారు. మొదటి సారిగా ఈపీఎఫ్ లో నమోదు చేసుకున్న ఉద్యోగులకు వారి నెల వేతనం రూ. 15 వేలను రెండు విడతలుగా ఉద్యోగులకు అందించడం జరుగుతుందని తెలిపారు.

విశేషం



వారే గురువులు

10న గురుపౌర్ణమి

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథి దేవోభవ... 'లోకంలో ప్రత్యక్ష దేవతలు నలుగురు. వారు తల్లి, తండ్రి, గురువు, అతిథి' అంటోంది భారతీయ సంస్కృతి. "తొలి గురువైన వేదమాత, తల్లి మన జన్మభూమి, తండ్రి వేదప్రతిపాద్యుడైన భగవంతుడు, దైవానికి ప్రతీకలైన మిగిలినవారు... ఈ నలుగురే ప్రత్యక్ష దైవాలు" అనే వివరణ కూడా ఉంది. గురువులను భగవంతుడిగా భావించి, ఆరాధించడం భారతీయుల సంస్కృతి, సంప్రదాయం, సభ్యత. అందుకే ఆషాఢ శుద్ధ పౌర్ణమిని 'గురుపౌర్ణమి'గా నిర్వహించుకుంటున్నాం. ఈ సందర్భంగా శిష్యులు తమ గురువులను, గురు పరంపరను ఆరాధించడం అనాదిగా వస్తున్నదే.

గురువు ఎవరు? అతని మహిమ ఎలాంటిది? గురువు వద్ద ఎలా మసలుకోవాలి? ఎలా తరించాలి?... ఈ ప్రశ్నలన్నిటికీ సరైన సమాధానం చెప్పే గ్రంథం 'గురుగీత'. ఇది 'స్కాంద పురాణం'లో... మూడు అధ్యాయాలలో, 351 శ్లోకాలలో... పార్వతీ పరమేశ్వరుల మధ్య సంవాద రూపంలో ఉంటుంది. 'సనత్కుమార సంహిత'గా పేర్కొనే ఈ గ్రంథం... "గురువు అనుగ్రహానికి దూరమైన దేనికీ ఈ ప్రపంచంలో మనుగడ లేదు" అని స్పష్టంగా చెప్పింది.

మార్గాన్ని చూపేది, గమ్యానికి చేర్చేది...

కఠోపనిషత్తులో 'ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్ నిబోధత' అనే ఒక విశిష్టమైన సూక్తి ఉంది. అంటే "లేవండి, మేలుకొనండి, మీ కర్తవ్య నిష్ఠతో గమ్యం చేరుకోండి" అని భావం. తెల్లవారుతోంది. రామాయణ గాథలో... రోజంతా గురువు విశ్వామిత్రుడి వెంట నడిచి, అలసిపోయిన రామ లక్ష్మణులు ఒళ్ళు మరచి నిద్రపోయారు. అది గమనించి శ్రీరాముణ్ణి ఉద్దేశించి "కౌసల్యా సుప్రజా రామా! పూర్వాసంధ్యా ప్రవర్తతే" అంటూ విశ్వామిత్రుడు మేలుకొలిపాడు. ఈ రెండు... ముఖ్యంగా కఠోపనిషత్ లోని సూక్తి స్వామి వివేకానందుడికి ఎంతో ఇష్టం. సమాజాన్ని జాగృతపరచాలి. చైతన్యవంతం చేయాలి. ముందుకు నడిపించాలి. వివేకానందుడి అభీష్టం అదే. మరి అందుకు దోహదకారులైన బోధలు చేసేది, మార్గాన్ని చూపించేది, గమ్యానికి చేర్చేది ఎవరు? "గురువు కన్నా వేరెవ్వరూ లేరు" అన్నాయి వేదాలు. అందుకే వారిని ఆచార్యులుగా ఆరాధిస్తున్నాం. ఆర్ష సంస్కృతిని ఆపోశన పట్టినవారు, దాన్ని ఆచరించి, తరించి, ఇతరులను తరింపజేసేవారు, తాను పరమాత్మను లక్ష్యంగా చేసుకొని, సాధన చేసి, దర్శించి, ఇతరులకు బోధించేవారు.. వారే గురువులు.

విష్ణుస్వరూపుడు వేద వ్యాసుడు

పూర్వం ఎన్నో యుగాల నుంచి ఎందరో ఋషులు తమ తపఃఫలంగా సంపాదించిన జ్ఞానాన్ని క్రోడీకరించి, ఆ అనంతమైన రాశిని నాలుగు వేదాలుగా విభజించి, దాన్ని మనకు అందించినవాడు వ్యాసుడు. అందుకే 'వ్యాసాయ విష్ణురూపాయ' అని ఆయనకు నమస్కరిస్తున్నాం. వ్యాసుడు చెప్పినదాన్నే శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు తమ శిష్యపరంపరకు అందించారు. వ్యాసుని పుట్టినరోజు ఆషాఢ శుద్ధ పౌర్ణమి. అదే 'వ్యాస పౌర్ణమి'గా, 'గురు పౌర్ణమి'గా ప్రసిద్ధికెక్కింది. వేద, పురాణ, ఉపపురాణ, బ్రహ్మసూత్రాల ద్వారా... మానవాళికి జ్ఞాన, భక్తి, కర్మ మార్గాలను వ్యాసుడు ఉపదేశించాడు. ఆయనను, ఆ పరంపరలోని సద్గురువులను స్మరించుకోవడం మన విధి. గురు పరంపరకు ఎంతో విశిష్టత ఉంది. సద్గురువు ఒక పరంపరకు చెందినవాడై ఉండాలి. ఆయన అధ్యయనం చేసి, అనుష్ఠించి, తన అనుభవంలోకి తెచ్చుకొని, దాన్ని శిష్యులకు బోధించాలి. "గురువే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు. అవ్యక్త పరబ్రహ్మం. నారాయణుడైనా, సదాశివుడైనా అతడే. 'నీ గురువు ఎవరు?' అని ప్రశ్నించుకుంటూ పోతే 'పరబ్రహ్మ' అనే సమాధానం వస్తుంది" అని శౌనకాది మహర్షులకు సూతుడు చెప్పిన సమాధానం 'గురుగీత' తొలి అధ్యాయంలో ఉంది. "నేను చెప్పేది విను అని శిష్యుడితో సద్గురువు అనడు. "నేను నేర్చుకున్నది నీకు చెబుతున్నాను" అంటాడు. ఎందుకంటే గురువు కూడా నిత్య విద్యార్థే. మనలోని అజ్ఞానాన్ని (గు) తొలగించి, జ్ఞాన విజ్ఞానాలను (రు) అందించేవాడే గురువు. ఈ మాటను అవగాహన చేసుకొని, గురువు అనే మాటకు అర్థాన్ని గ్రహించడమే జ్ఞానాన్ని పొందడానికి ఏకైక మార్గం. అదే పార్వతీపరమేశ్వర సంవాదమైన 'గురుగీత' సారాంశం కూడా.

● ఆయపిళ్ళ రాజపాప

ఆయన దీక్షకు నూరేళ్లు!

"ప్రతి ఒక్కరిలో భగవంతుడు ఉన్నాడు. కాబట్టి మీ ఎదుటి వ్యక్తిలోని ఆ దేవుణ్ణి దర్శించండి" అని ప్రబోధించిన మానవతావాది... "మానవ జీవిత లక్ష్యం భగవదైక్యం, మోక్షసాధన. నిరంతరం భగవంతుని ధ్యాసలో గడపడం, ప్రేమతో నిస్వార్థంగా సేవ చేయడం ద్వారా ఆ జీవిత లక్ష్యం నెరవేర్చుకోగలం" అని ప్రవచించిన ఆధ్యాత్మికవాది... అవతార్ మెహెర్ బాబా. ఆయన మౌనం చేపట్టి ఈనెల 10వ తేదీకి వందేళ్ళు పూర్తవుతున్నాయి. ఈ సందర్భంగా 'మెహెర్‌బాబా శతవర్ష మౌన వార్షికోత్సవాల' కోసం భక్తులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

"నేను బోధించడానికి రాలేదు. మేలుకొలపడానికి వచ్చాను" అని ప్రకటించిన మెహెర్‌బాబా 1894 ఫిబ్రవరి 25న పుణేలో జన్మించారు. తల్లిదండ్రులు పెట్టినపేరు మేర్వాన్. పుణేలోని దక్కన్ కళాశాలలో మేర్వాన్ చదువుకొనేవాడు. ఒకరోజు అతను కాలేజీ నుంచి వస్తున్నాడు. అప్పటికే నూరేళ్ళ వయసు పైబడిన హజ్రత్ బాబాజాన్ అనే మహిళా గురువు ఆయన నుదుటిమీద ముద్దాడింది. వెంటనే మేర్వాన్ బాహ్య ప్రపంచ చైతన్యాన్ని కోల్పోయాడు. ఆ తరువాత... మేర్వాన్‌ను భగవంతుని స్వరూపంగా నాటి గురువులైన షిరిడీ సాయిబాబా, ఉపాసినీ మహరాజ్, నారాయణ్ మహరాజ్, తాజుద్దీన్ బాబా తదితరులు కీర్తించారు. తదనంతరం మేర్వాన్‌ను 'మెహెర్ బాబా... అంటే దయగల తండ్రి' అని ఆయన శిష్యులు పిలవడం ప్రారంభించారు.

ప్రేమే నా మతం...

మెహెర్‌బాబా 1925 జూలై 10న మౌన దీక్ష చేపట్టారు. దాన్ని 1969 జనవరి 31న శరీరత్యాగం చేసేవరకూ... అంటే 44 ఏళ్ళు విడనాడలేదు. మౌనంగానే వేలాది కిలోమీటర్లు పర్యటించారు. మౌనం చేపట్టిన మొదటి ఏడాదిన్నరకాలం పలక మీద బలపంతో తన మాటలు చెప్పేవారు. ఆ తరువాత నుంచి 1954 అక్టోబర్ ఏడోతేదీ వరకు... అక్షరమాల ఉన్న ఒక పలక ద్వారా అనేక విషయాలు సంభాషించేవారు. తరువాత దాన్ని కూడా త్యజించి... కేవలం సంజ్ఞల ద్వారా తన సందేశాలను, ఆదేశాలను తన అనుయాయులకు అందించారు. 1950వ దశకంలో ఆయన ఘోరమైన రెండు కారు ప్రమాదాలకు గురయ్యారు. వాటిలో ఆయన దేహంలోని కుడి, ఎడమ భాగాలు దాదాపు నుజ్జు నుజ్జయ్యాయి. సాధారణ మానవులెవరూ ఈ ప్రమాదాలను తట్టుకొని తిరిగి నడవలేరని ప్రముఖ వైద్యులు ప్రకటించారు. భౌతికంగా ఎన్ని బాధలు ఎదురైనా తన మౌన దీక్షను ఆయన విడిచి పెట్టలేదు. మౌనం ఆయన ఆధ్యాత్మిక కార్యకలాపాలకు ఏమాత్రం ఆటంకం కాలేదు. తన మౌనం గురించి వివిధ సందర్భాల్లో ఆయన ప్రస్తావిస్తూ "నేను ఎప్పుడూ మౌనంగా లేను. నా ప్రేమికుల హృదయాలతో నిరంతరం మాట్లాడుతూనే ఉన్నాను" అని చెప్పారు. పూర్వం శ్రీరామునిగా, శ్రీకృష్ణుడిగా, బుద్ధునిగా, ఏసు ప్రభువుగా... ప్రస్తుత కాలంలో మెహెర్‌బాబాగా మానవరూపంలో అవతరించానని స్పష్టం చేశారు. తాను ఎలాంటి మతం స్థాపించడానికి రాలేదని, అన్ని మతాలు ఒక్కటేనని, "నా మతం ప్రేమ" అని స్పష్టం చేశారు.



"మీరు చూస్తున్న ఈ ప్రపంచం ఒక మిథ్య. ఇది ఒక కలలాంటిది. ఈ నిజాన్ని మీకు తెలియజేయడానికే ఈ అవతార కాలంలో మెహెర్‌బాబాగా మీ ముందుకు వచ్చాను" అని చెప్పారు.

నిత్యజీవన ఆధ్యాత్మిక మర్మాల గురించి ఆయన వివరిస్తూ భగవంతుడి సేవలో నిజాయితీగా ఉండండి. నిస్వార్థసేవ, ప్రేమ... ఈ రెండూ దైవీలక్షణాలు. ఇతరుల నుంచి ఏదో బహుమతి అందుకోవాలని ఆశించకండి. వారికి ఏదో రూపంలో సాయం చేయడానికి ప్రయత్నించండి. తద్వారా మీకు నిజమైన ఆనందం లభిస్తుంది. అవమానాలు, అభినందనలు మీపై ఎలాంటి ప్రభావం చూపించకపోతే... మీరు నిరంతరం ఆనందంగా ఉంటారు. విమర్శించడం అనే దురలవాటు ప్రతి ఒక్కరి రక్తంలోనూ ఉంది. ఆ అవలక్షణాన్ని అదుపులో ఉంచుకోవాలి. ఎంత మంచి వ్యక్తి అయినా... కామాన్ని జయించలేకపోతే ఆధ్యాత్మిక జీవితంలో ముందుకి సాగలేరు" అని స్పష్టం చేశారు. మెహెర్‌బాబా సందేశాలు సరళంగా ఉంటాయి. వాటిని ఆచరించి, ఆచరింపజేస్తే విశ్వం యావత్తూ ప్రేమమయం అవుతుంది.

● డాక్టర్ మల్లాది కృష్ణానంద్
99595 53218

సందేశం

ముహర్రం పేరు వినగానే గుర్తుకు వచ్చే మొదటి చారిత్రక సంఘటన... కర్బలా మైదానంలో జరిగిన అపూర్వమైన సంగ్రామం. ఖిలాఫత్ వ్యవస్థను సుస్థిరంగా ఉంచడానికి హజ్రత్ హుసేన్ చేసిన మహత్తరమైన త్యాగానికి అది చిహ్నం. అంతేకాదు... ముహర్రం మాసంలోని పదవ రోజు... ఎన్నో చారిత్రక సంఘటనలకు సాక్షి.



ఆ త్యాగం అనుపమానం

రాజకీయపరంగా ఇస్లాం ధర్మంలో ఖలీఫా వ్యవస్థ ఉండేది తప్ప రాచరిక వ్యవస్థ లేదు. కానీ హజ్రత్ మావియా తన కుమారుడైన యజీద్‌కు యువరాజ పట్టాభిషేకం చేశాడు. అక్కడి నుంచే రాచరిక వ్యవస్థ ఆరంభమయింది. ఇస్లాం ధర్మానికి వ్యతిరేకమైన ఈ చర్యపై దైవప్రవక్త మహమ్మద్ మనుమడైన ఇమామ్ హుసేన్, ఆయన అనుచరులు బాహాటంగా వ్యతిరేకత వ్యక్తం చేశారు. యజీద్‌ను రాజుగా ఒప్పుకొనేది లేదంటూ తిరుగుబాటు చేశారు. అదే సమయంలో... ఇమామ్ హుసేన్ తమ వద్దకు వస్తే ఆయనను ఖలీఫాగా గుర్తిస్తామంటూ కూఫా నగర ప్రజలు ఉత్తరాలు రాశారు. మరోవైపు ప్రజలందరూ ఉవ్వెత్తున ఉద్యమించారు. ఈ నేపథ్యంలో యజీద్‌తో ముఖాముఖి చర్చలు జరపడానికి మక్కా నగరం నుంచి కుఫా నగరానికి తన 72 మంది ప్రత్యక్ష సహచరులతో, కుటుంబ సభ్యులతో ఇమామ్ హుసేన్ బయలుదేరారు. వారు కుఫా నగరానికి చేరకమునుపే... తన ప్రభుత్వాన్ని ఇమామ్ హుసేన్ గుర్తించేలా చేయడానికి యజీద్ కుట్రలు పన్నాడు. కానీ యజీద్‌ను రాజుగా గుర్తించడానికి ఆయన అంగీకరించలేదు. తనలో ప్రాణం ఉన్నంతవరకు అధర్మంతో పోరాడుతూనే ఉంటానని ప్రకటించారు. దాని ఫలితమే కర్బలా యుద్ధం.

ధర్మరక్షణ కోసం...

ఇమామ్ హుసేన్ ప్రదర్శించిన ధిక్కారానికి, తిరుగుబాటు ధోరణికి యజీద్ ఆగ్రహోదగ్రుడయ్యాడు. అతని సైన్యం హజ్రత్ హుసేన్‌ను, ఆయన పరివారాన్ని కర్బలా అనే ప్రదేశం దగ్గర అటకాయించింది. ఇరు పక్షాల మధ్యా భీకరమైన యుద్ధం జరిగింది. శత్రువులు నాలుగువేలమంది కన్నా ఎక్కువగా ఉండడంతో ఇమామ్ హుసేన్ సైన్యంలో చాలామంది అమరులయ్యారు. చివరకు ఇమామ్ హుసేన్ ఒంటరిగా యుద్ధరంగంలో మిగిలిపోయారు. దప్పికకు తట్టుకోలేక... శత్రుమూకను చెండాడుతూ ఫరాత్ నదివైపు నీళ్ళకోసం వెళ్ళారు. ఈలోగా మహిళలు, పిల్లలు ఉన్న తమ గుడారాలకు నిప్పు పెట్టారనే వదంతి విని... దప్పిక తీర్చుకోకుండానే వెనుతిరిగారు. గుడారాలకు నిప్పు పెట్టలేదు కానీ తన కుమారుడు అలీ అస్గర్ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని తెలిసింది. ఆ పసిబాలుణ్ణి చేతుల్లోకి తీసుకొని... అతని కోసం గుక్కెడు నీళ్ళయినా ఇవ్వాలని శత్రుసైన్యాన్ని ఇమామ్ హుసేన్ ప్రాధేయపడ్డారు. కానీ పాషాణ హృదయులైన ఆ సైనికులు... ఆయన కుమారుడి మీద బాణాల వర్షం కురిపించారు. ఒక బాణం ఆ పసికందు గొంతులో దిగి... రక్తం చిమ్మింది. ఈ ఘోరాన్ని చూసిన ఇమామ్ హుసేన్ శత్రుసైన్యంపై విరుచుకుపడ్డారు. శత్రువులు ఆయనను హతమార్చడానికి నలువైపులా కమ్ముకొని ఉన్నారు. ఆరోజు నమాజ్ సమయం కావడంతో ఆయన యుద్ధాన్ని ఆపి... సజ్దా చెయ్యడానికి శిరస్సును భూమి మీద పెట్టారు. వెంటనే శత్రువులు ఆయన మీద దాడి చేసి హతమార్చారు. ఆయన శిరస్సును, చేతులను ఖండించారు. వాటిని బల్లేలకు, బరిసెలకు తగిలించి గంతులేశారు. ఇలా ఒక మహా మనిషి తను నమ్ముకున్న ధర్మాన్ని రక్షించడం కోసం అసువులుబాశారు. ఆయన ప్రదర్శించిన పోరాట పటిమ, అనుపమాన త్యాగం చరిత్రలో నిలిచిపోయాయి.

● మహమ్మద్ వహీదుద్దీన్

భారీ ఉగ్ర కుట్ర భగ్నం

- వారిద్దరూ 'అల్ ఉమ్మా' ఉగ్రవాదులు
- వారి ఇళ్లలో పెద్దఎత్తున పేలుడు పదార్థాలు, మారణాయుధాలు, ఉగ్ర సాహిత్యం స్వాధీనం
- ఉగ్రవాదుల భార్యలకు 14 రోజుల రిమాండ్
- పోలీసుల అదుపులో పలువురు అనుమానితులు
- మీడియాతో కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్



రాయచోటిలోని ఉగ్రవాదుల ఇళ్లలో పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తులు, ల్యాప్‌టాప్‌లు, మొబైళ్లు, బాంబు తయారీ పదార్థాలు



అబూబక్కర్ సిద్దిక్



మొహమ్మద్ అలీ

రాయచోటి, జూలై 3(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా పలు ప్రధాన నగరాల్లో బాంబు పేలుళ్లకు అల్ ఉమ్మా ఉగ్రవాదులు పన్నిన కుట్రను భగ్నం చేశామని కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఇటీవల ఇద్దరు ఉగ్రవాదులను తమిళనాడు ఏటీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. దీంతో స్థానిక పోలీసులు ఉగ్రవాదుల కదలికలపై విచారణ చేపట్టారు. ఆ వివరాలను డీఐజీ గురువారం మీడియాకు వివరించారు. "తమిళనాడుకు చెందిన అబూబక్కర్ సిద్దిక్ అలియాస్ అమానుల్లా, మొహమ్మద్ అలీ అలియాస్ మన్సూర్‌లు అల్ ఉమ్మా ఉగ్రవాదులు. ఆ సంస్థలో 30 ఏళ్లుగా పనిచేస్తున్నారు. 1995 నుంచి 2011 వరకు చెన్నై, కర్ణాటక, కేరళల్లో జరిగిన అనేక బాంబు పేలుళ్ల కేసుల్లో వీరు ప్రధాన నిందితులు. బీజేపీ అగ్రనేత ఎల్‌కే అడ్వాణీ రథయాత్ర సందర్భంగా మదురైలో జరిగిన బాంబు పేలుడు, ఎగ్మూర్‌లో పేలుడు వంటి అనేక ముఖ్యమైన కేసుల్లో వీరు నిందితులు. 2011లో మంగళూరు బాంబు పేలుళ్ల కేసులో అబూబక్కర్ సిద్దిక్ ప్రధాన నిందితుడు కాగా, మొహమ్మద్ అలీ కూడా నిందితుడు. పోలీసుల కళ్లు కప్పి 30ఏళ్లుగా రాయచోటిలో మారుపేర్లతో జీవిస్తున్నారు. అబూబక్కర్ సిద్దిక్ కొత్తపల్లెలో చిల్లర దుకాణం, మహబూబ్‌బాషా వీధిలో మొహమ్మద్ అలీ చిల్లర దుకాణం, చీరల వ్యాపారం చేస్తున్నారు. రాయచోటి ప్రాంతంలోనే పెళ్లిళ్లు చేసుకున్నారు. వీరిద్దరి ఇళ్లలో జరిపిన సోదాల్లో భారీ ఎత్తున పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నాం. ఇద్దరూ అల్ ఉమ్మా ఉగ్రవాద సంస్థకు చెందినవారని ఆధారాలు లభించాయి. అబూబక్కర్ బాంబుల తయారీలో నిపుణుడు. అతడి ఇంట్లో లభించిన పదార్థాలతో పేలుడు పరికరాలు (ఐఈడీఎస్) తయారు చేయవచ్చు. ఈ సోదాలలో ఫ్యూయల్ ఆయిల్‌తో కలిపిన అమ్మోనియం నైట్రేట్- ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్, స్లర్రీ ఎక్స్‌ప్లోజివ్- (నైట్రోగ్లిజరిన్/ టీఎన్‌టీ), పీఈటీఎన్‌తో నిండి ఉండే బాంబు-20 కేజీల సూట్‌కేసులో, మరొక సూట్‌కేసు-ఐఈడీ, ఒక బాక్స్-ఐఈడీ, గన్ పౌడర్లు, డాగర్, కొడవళ్లు, టైమర్ల కోసం గడియార యంత్రాలు, పుల్ స్విచ్‌లు, ప్రెషర్ స్విచ్‌లు, స్పీడ్ కంట్రోలర్లు, గ్యాస్ ట్యూబ్ అరెస్టర్లు, పేలుళ్ల సమయంలో గాయాలయ్యేందుకు ఉపయోగించే బాల్ బేరింగ్స్, నట్స్- బోల్టులు, బైనాక్యులర్లు, వాకీటాకీలు, రేడియో పరికరాలు, మొబైల్ ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, 'సీ' కోడింగ్ పుస్తకాలు, చెక్కు పుస్తకాలు, అబూబకర్ సిద్దిక్ తమిళంలో రాసిన రెండు డైరీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతోపాటు వీరిద్దరి ఆర్థిక లావాదేవీల సమాచారం, డిజిటల్ స్టోరేజ్ పరికరాలు, భారతదేశంలోని పలు ప్రధాన నగరాల మ్యాప్‌లు, టైమింగ్ సర్క్యూట్ల మాన్యువల్స్, ఆస్తి, ప్రయాణ పత్రాలు, హ్యాకింగ్ సాఫ్ట్‌వేర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు' అని డీఐజీ వివరించారు. కాగా, ఇళ్ల సోదాల సందర్భంగా అబూబక్కర్ సిద్దికి భార్య సైరాబాను, మొహమ్మద్ అలీ భార్య షేక్ షమీమ్ పోలీసులపై తిరగబడ్డారు. మహిళా పోలీసులపైకి దాడికి యత్నించారు. సోదాలను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో పోలీసులు వీరిపై కేసులు నమోదు చేశారు. కోర్టు రిమాండ్ విధించడంతో వారిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

రేపటి నుంచి 'అన్నదాత-సుఖీభవ' ఫిర్యాదుల స్వీకరణ

- అనర్హత సమస్యలు పరిష్కారానికి చర్యలు: వ్యవసాయశాఖ డైరెక్టర్

అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): అన్నదాత-సుఖీభవ పథకం అర్హతకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి శనివారం నుంచి రైతుసేవా కేంద్రాల్లో ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. గ్రీవెన్స్ మాడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేస్తామని చెప్పారు. వెబ్‌ల్యాండ్‌లో డేటా సరిచేయించుకోకపోతే.. అన్నదాత-సుఖీభవ-పీఎం కిసాన్ వంటి పథకాలకు అనర్హులు అవుతారని చెప్పారు. భూ ఖాతాదారు చనిపోయిన సందర్భంలో వెబ్‌ల్యాండ్, అడంగల్, 1బీల్లో వారసత్వ వివరాలు చేర్చకపోయినా సమస్య ఏర్పడుతుందన్నారు. ఆటోమ్యూటేషన్ గ్రామాల్లో 5 వేలపైన సిరీస్ ఖాతాలను క్షేత్రస్థాయి సిబ్బంది నోషనల్‌గా భావించే అవకాశం ఉండటం, సాంకేతిక లోపంతో వాస్తవంగా భూమి ఉన్నా.. ఎలాంటి భూమి లేని ఖాతాలుగా నమోదవడం, డేటా లోపాలతో విస్తీర్ణం కనిపించకపోవడం వంటి సమస్యలపై గ్రీవెన్స్ మాడ్యూల్ ద్వారా అధికారులు చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారం విషయంలో క్షేత్రస్థాయిలో రెవెన్యూ అంశాలపై వ్యవసాయ అధికారులు పూర్తిఅవగాహన కలిగి ఉండాలని సూచించారు. కాగా ఉమ్మడి నెల్లూరు, గోదావరి జిల్లాల్లో ఈ తరహా సమస్యలు ఎక్కువగా ఉండగా, గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేతో మరిన్ని సమస్యలు అధికంగా ఉత్పన్నమైనట్లు అధికారులు గుర్తించారు. ఈ ప్రతిబంధకాలను తొలగించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

క్రైస్తవులకు ఎస్సీ హోదాపై సుప్రీం విచారణ ఆగస్టు 12కు వాయిదా

న్యూఢిల్లీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): క్రైస్తవంలోకి మారితే ఎస్సీ హోదా వర్తించదనే హైకోర్టు తీర్పును బాధితుడు సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. గురువారం జస్టిస్ సుందరేశ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట ఆ పిటిషన్ విచారణకు వచ్చింది. పిటిషనర్ అభ్యర్థన మేరకు ధర్మాసనం ఈ కేసును ఆగస్టు 12కు వాయిదా వేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన పాస్టర్ చింతాడ ఆనంద్... తనను కులం పేరుతో దూషించి, దాడి చేసి గాయపరిచారంటూ 2021లో చందోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అదే గ్రామానికి చెందిన అక్కల రామిరెడ్డితోపాటు మరో ఐదుగురుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. హిందూ మతాన్ని కాకుండా ఇతర మతాలను స్వీకరించినవారు ఎస్సీ హోదాను కోల్పోతారన్న వాదనలతో ఏకీభవించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును కొట్టివేయాలని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు తీర్పును చింతాడ ఆనంద్ మే 14న సుప్రీం కోర్టులో సవాల్ చేశారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

'కూలీ'లో ఆమిర్‌ఖాన్



రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'కూలీ'లో బాలీవుడ్ నటుడు ఆమిర్‌ఖాన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ మేరకు చిత్రబృందం 'ఎక్స్' వేదికగా పోస్టర్‌ని విడుదల చేసింది. 'కూలీ నుంచి చివరి పాత్ర 'దాహా' వచ్చేసింది' అంటూ క్యాప్షన్ పెట్టింది. పోస్టర్‌లో ఆమిర్ ఖాన్ గోల్డెన్ వాచ్, గోల్డ్ ఫ్రేమ్ ఉన్న గ్లాసెస్ ధరించి సిగార్ తాగుతూ మాస్ లుక్‌లో కనిపిస్తున్నారు. సినిమాలో ఆయన డాన్ పాత్రలో నటిస్తున్నట్లు అర్థమవుతోంది. కాగా, నాగార్జున ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. ఆగస్టు 14న ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతోంది. డి.సురేశ్ బాబు, సునీల్ నారంగ్, దిల్ రాజు యాజమాన్యంలోని ఏషియన్ మల్టీప్లెక్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 'కూలీ' తెలుగు థియేట్రికల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది.

రామాయణ ఫస్ట్ గ్లింప్స్



బాలీవుడ్‌లో భారీ అంచనాలతో రూపొందుతున్న చిత్రం 'రామాయణ'. రణ్‌బీర్‌కపూర్, సాయిపల్లవి సీతారాములుగా, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. నితీష్ తివారి దర్శకుడు. రెండు భాగాలుగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. గురువారం చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్, ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. రామాయణం గొప్పతనాన్ని వివరిస్తూ మొదలైన వీడియోలో నటీనటుల పాత్రలను పరిచయం చేశారు.

ఇండస్ట్రీ రికార్డులు మారతాయి

- జ్యోతికృష్ణ



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'హరిహర వీరమల్లు'. ఏఎం రత్నం సమర్పణలో ఏ. దయాకర్‌రావు నిర్మించారు. ఏ.ఎం. జ్యోతికృష్ణ, క్రిష్ దర్శకత్వం వహించారు. ఈ నెల 24న 'హరిహర వీరమల్లు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా యూనిట్ గురువారం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఢిల్లీ సుల్తానుల బారి నుంచి సనాతన ధర్మ రక్షణకు నడుం బిగించిన చారిత్రక యోధుడి పాత్రలో పవన్ కల్యాణ్ ఆకట్టుకున్నారు. మొఘల్ సైన్యంతో వీరమల్లు పోరాట ఘట్టాలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. 'ఆంధీ వచ్చేసింది', 'అందరూ నేను రావాలని దేవుణ్ణి ప్రార్థిస్తారు... కానీ మీరు మాత్రం నేను రాకూడదని కోరుకుంటున్నారు' లాంటి డైలాగ్‌లు ప్రస్తుతం పవన్ కల్యాణ్ రాజకీయ నేపథ్యాన్ని గుర్తు చేసేలా ఉన్నాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమంలో జ్యోతికృష్ణ మాట్లాడుతూ 'కొందరు 'హరిహర వీరమల్లు' సినిమా గురించి తప్పుగా ప్రచారం చేశారు. మేం అవన్నీ పట్టించుకోకుండా అవాంతరాలను అధిగమించి సినిమాను పూర్తి చేశాం. 'ఖుషీ', 'గబ్బర్‌సింగ్' చిత్రాల తర్వాత పవన్ స్వామినా ఏంటో చూపించే చిత్రమిది. ఈ సినిమాకు పునాది వేసిన క్రిష్ గారికి ధన్యవాదాలు. ఈ సారి రిలీజ్ డేట్ మారదు. ఇండస్ట్రీ రికార్డులు మారతాయి' అని అన్నారు. ఏ.ఎం. రత్నం మాట్లాడుతూ 'పవన్ కల్యాణ్ చేసిన పూర్తిస్థాయి పాన్ ఇండియా చిత్రమిది. సినిమా ట్రైలర్‌ను మించి ఉంటుంది. ఇప్పటి దాకా మీరు పవర్‌స్టార్‌ను చూశారు. ఈ సినిమాలో రియల్ స్టార్‌ను చూస్తారు' అన్నారు.

మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నాను

- వర్ష బొల్లమ్మ



'తమ్ముడు' సినిమా కోసం అడవిలో షూటింగ్ చేయాల్సి ఉంటుంది. మీకు ఇబ్బంది ఉంటే ముందే చెప్పండి' అని దర్శకుడు వేణు శ్రీరామ్ నన్ను అడిగారు. 'దీన్నొక సవాల్‌గా తీసుకొని నటిస్తాను' అని ఆయనకు చెప్పాను. ఈ చిత్రం కోసం మార్షల్ ఆర్ట్స్ సైతం నేర్చుకున్నాను' అని హీరోయిన్ వర్ష బొల్లమ్మ అన్నారు. నితిన్ కథానాయకుడిగా వేణు శ్రీరామ్ దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మించిన చిత్రమిది. నేడు విడుదలవుతున్న సందర్భంగా వర్ష బొల్లమ్మ మీడియాతో ముచ్చటించారు.

● కథ విన్నప్పుడు నా పాత్ర కొత్తగా, సవాల్‌గా అనిపించింది. ఈ చిత్రంలో నితిన్‌కు సహాయపడే యువతిగా చిత్ర అనే పాత్రలో కనిపిస్తాను. కథలో నా పాత్రకు మంచి ప్రాధాన్యం ఉంది. యాక్షన్ సన్నివేశాల్లో నటించేందుకు బాగా శ్రమించాల్సి వచ్చింది.

● నితిన్ సెట్‌లో సరదాగా ఉంటారు. లయ కష్టపడే విధానం మాకు స్ఫూర్తినిచ్చింది. సన్నివేశం తను అనుకున్న విధంగా వచ్చేవరకూ వేణు శ్రీరామ్ ఓపిగ్గా పనిచేసేవారు. ప్రస్తుతం రెండు వెబ్‌సిరీస్‌లు చేస్తున్నాను.

ఆకట్టుకునే అంశాలతో షో టైమ్



'ఒక చిన్న కుటుంబంలో జరిగే కథతో 'షో టైమ్' చిత్రం తెరకెక్కింది. తక్కువ పాత్రలతో సాగే కథలో ఎన్నో ఆసక్తికరమైన మలుపులు ఉన్నాయి. ప్రతి అంశం ప్రేక్షకుడిని రంజింపచేస్తుంది. ప్రేక్షకులకు మంచి వినోదం అందిస్తుంది' అని హీరో నవీన్‌చంద్ర అన్నారు. ఆయన కథానాయకుడిగా మదన్ దర్శకత్వం వహించిన చిత్రమిది. కిశోర్ గరికపాటి నిర్మించారు. నేడు విడుదలవుతోంది. మదన్ మాట్లాడుతూ 'ఈ తరహా చిత్రాలు మలయాళంలో ఎక్కువగా వస్తాయి. తెలుగు ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని అందించే చిత్రమిది' అని చెప్పారు.

యువతకు స్ఫూర్తినిచ్చే 'సోలో బాయ్'



'ఇండస్ట్రీలో ఎత్తుపల్లాలు ఉంటాయని తెలిసే వచ్చాను. మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతోనే నిర్మాతగా సినిమాలు చేస్తున్నాను. తమ కాళ్ల మీద నిలబడాలని తపించే యువతకు స్ఫూర్తినిచ్చేలా మా 'సోలో బాయ్' చిత్రం ఉంటుంది' అని నిర్మాత సెవెన్‌హిల్స్ సతీశ్ అన్నారు. గౌతమ్ కృష్ణ, రమ్య పసుపులేటి జంటగా నవీన్ కుమార్ దర్శకత్వం వహించిన చిత్రమిది. నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సెవెన్ హిల్స్ సతీశ్ 'సోలో బాయ్' విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

● నిర్మాతగా నా గత చిత్రాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పరిమిత బడ్జెట్‌తో మంచి ఔట్‌పుట్ వచ్చేలా 'సోలో బాయ్' చిత్రాన్ని నిర్మించాం. మధ్యతరగతి కుటుంబాల్లోని యువత జీవితంలో స్థిరపడేందుకు చేసే ప్రయత్నాలు, ఆ క్రమంలో అనుభవించే సంఘర్షణ నేపథ్యంలో హృదయాలకు హత్తుకునేలా దర్శకుడు ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాడు.

● అనుకున్న బడ్జెట్ కన్నా తక్కువలోనే 'సోలో బాయ్' సినిమా పూర్తి చేశాం. మా హీరో గౌతమ్ కృష్ణ నాకు మంచి స్నేహితుడు. అతనికి 'బిగ్ బాస్'తో వచ్చిన గుర్తింపు మా సినిమా ప్రచారానికి తోడ్పడుతోంది. నార్నే నితిన్‌తో థ్రిల్లర్ జానర్‌లో ఓ చిత్రం చేయబోతున్నాను.

స్పోర్ట్స్

భారత్ X ఇంగ్లండ్

మహిళల మూడో టీ20 నేడు

రాత్రి 11.05 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

జొకో జోరు



19వ సారి మూడోరౌండ్‌కు

వింబుల్డన్ నుంచి జాస్మిన్ అవుట్

లండన్: సెర్బియా వీరుడు నొవాక్ జొకోవిచ్ మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రతిష్ఠాత్మక వింబుల్డన్‌లో 19వసారి మూడో రౌండ్‌కు చేరిన ఘనత అందుకున్నాడు. ఇక..మరో సీడెడ్ ఆల్ ఇంగ్లండ్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈసారి నాలుగో సీడ్ జాస్మిన్ పోలిని వంతైంది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఆరో సీడ్ జొకో 6-3, 6-2, 6-0తో ఇవాన్స్‌ను చిత్తు చేశాడు. వింబుల్డన్‌లో నొవాక్‌కిది మొత్తంగా 99వ మ్యాచ్‌కాగా..ఫెడరర్ (18)ను అధిగమించి 19వసారి జొకో ఇక్కడ మూడో రౌండ్‌లో అడుగుపెట్టాడు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో అన్‌సీడెడ్ రఖిమోవా 4-6, 6-4, 6-4తో నిరుటి రన్నరప్ జాస్మిన్‌కు షాకిచ్చింది. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో 8వ సీడ్ స్వియాటెక్ 5-7, 6-2, 6-1తో మెక్‌నాలీపై, డిఫెండింగ్ చాంప్ క్రెజికోవా 6-4, 3-6, 6-2తో జొలిడేపై, లోకల్ స్టార్ రదుకాను 6-3, 6-3తో 2023 వింబుల్డన్ విజేత ఒండ్రుసోవాపై, 7వ సీడ్ ఆండ్రీవా 6-1, 7-6 (4)తో బ్రోంజెటీపై, 10వ సీడ్ నవారో 6-1, 6-2తో కుడెర్మెటోవాపై, 11వ సీడ్ రిబకినా 6-3, 6-1తో సకారిపై గెలిచారు. పురుషుల సింగిల్స్‌లో 11వ సీడ్ డిమినార్, 19వ సీడ్ డిమిత్రోవ్ మూడో రౌండ్‌కు చేరారు.

రెండో రౌండ్‌లో బాలాజీ జోడీ: భారత ఆటగాడు శ్రీరామ్ బాలాజీ/మిగ్వెల్ రేయస్ (మెక్సికో) ద్వయం 6-4, 6-4తో అమెరికా జంట టీన్/అలెగ్జాండర్‌పై నెగ్గి డబుల్స్ రెండో రౌండ్‌కు చేరింది.

క్వార్టర్స్‌లో శ్రీకాంత్

న్యూఢిల్లీ: భారత షట్లర్ కిడాంబి శ్రీకాంత్ కాల్గెరీలో జరుగుతున్న కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో శ్రీకాంత్ 21-19, 21-12తో వాంగ్ పొ వీ (చైనీస్ తైపీ)ని ఓడించాడు.

హై హై.. నాయకా!

ఏకంగా నాలుగు సెషన్లపైగానే బ్యాటింగ్.. ఎక్కడా చెదరని ఏకాగ్రత.. షార్ట్‌పిచ్ బంతులనే అస్త్రంగా ప్రయోగిస్తున్నా తొణకలేదు, బెణకలేదు. ఆఫ్ స్టంప్‌కు ఆవలగా బంతులేసి ఊరిస్తున్నా.. షాట్లను నియంత్రించుకోవడంలో క్రమశిక్షణను ప్రదర్శించాడు. తొలి రోజు జట్టు ఎంతో ఒత్తిడిలో కూరుకుపోయిన సమయంలో ఓర్పు, నేర్పుతో క్రీజులో గోడకట్టిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. రెండో రోజు తన క్లాస్ ఆటకు కొంత మాస్ జోడించి తన శతకాన్ని.. అద్భుత రీతిలో ద్విశతకంగా మార్చాడు. ట్రిపుల్ సెంచరీని కొద్దిలో చేజార్చుకొన్నా.. ఇంగ్లండ్ గడ్డపై అత్యధిక స్కోరు చేసిన భారత కెప్టెన్‌గా నయా రికార్డు సృష్టించాడు. నాయకుడన్న వాడు జట్టు కోసం ముందుండాలి.. ఈ సూత్రాన్ని చిన్నవయసులోనే ఆకళింపు చేసుకొన్న గిల్ జట్టు కోసం ఎదురు నిలిచాడు. వరుసగా రెండు వికెట్లు కోల్పోవడంతో.. ఒక్కసారిగా గందరగోళం తలెత్తినా.. ప్రశాంతంగా పరిస్థితిని చక్కదిద్దాడు. కెప్టెన్‌గా మ్యాచ్‌లో తాను దూకుడుగా ఆడకపోయినా.. మరో ఎండ్‌లోని భాగస్వాములకు సహకరిస్తూ జట్టును గిల్ ఆదుకొన్న తీరు అద్భుతం.

మైండ్‌సెట్ మారిందా..: సారథ్యాన్ని చేపట్టకముందు మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచడంలో గిల్ ఇబ్బందులు పడేవాడు. కానీ, ఈ మ్యాచ్‌లో మాత్రం అతడి మైండ్‌సెట్‌లో ఎంతో మార్పు కనిపించింది. రాహుల్, కరుణ్ నాయర్ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన గిల్.. పరిణతి చెందిన ఆటతో బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. సాంకేతికంగా ఎంతో బలమైన గిల్.. చివరి వరకు బంతిని గమనిస్తూ ప్రత్యర్థి బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. పటిష్ఠస్థితికి చేరామనిపించగానే.. గేర్ మార్చాడు. బషీర్ బౌలింగ్‌లో శుభ్‌మన్ రివర్స్ స్వీప్ షాట్ ఆడడం విశేషం. స్పిన్నర్‌కు పెద్దగా సహకారం లేకపోవడంతో బషీర్ టార్గెట్‌గా గిల్ ఎక్కువ పరుగులు రాబట్టాడు. అయితే, నియంత్రణ మాత్రం ఎక్కడా కోల్పోకపోవడం గిల్ ఆటలో ప్రత్యేకత. టంగ్ బౌలింగ్‌లో సింగిల్‌తో డబుల్ సెంచరీ పూర్తి చేసుకొన్న శుభ్‌మన్.. ట్రిపుల్ దిశగా వడివడిగా కదిలాడు. కానీ, దురదృష్టవశాత్తూ ఆ మార్క్‌ను త్రుటిలో చేజార్చుకొన్నా.. కెప్టెన్‌గా తన ఎంపికను ప్రశ్నించిన వారికి మాత్రం తన బ్యాట్‌తోనూ సమాధానం చెప్పాడు. రోహిత్, కోహ్లీ లాంటి దిగ్గజాల రిటైర్మెంట్ తర్వాత సంధిదశలో ఉన్న టీమిండియాను నడిపించడానికి సమర్థుడైన నాయకుడిననిపించుకొన్నాడు. లీడ్స్ టెస్టు సమయంలో రో-కో ప్రభ గిల్‌లో లేదంటూ వ్యంగ్యంగా మాట్లాడిన ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ నాసిర్ హుస్సేన్‌కు.. ఈ ఇన్నింగ్స్‌తో 'డబుల్' స్ట్రోక్ ఇచ్చాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

గిల్ డబుల్

ద్విశతకంతో రికార్డు

రాణించిన జడేజా, సుందర్



గిల్ (269)

వహ్వా.. శుభ్‌మన్. టెస్టు పగ్గాలు చేపట్టాక ఈ యువ నాయకుడి బ్యాటింగ్ ప్రదర్శన శుభప్రదంగా సాగుతోంది. తొలి టెస్టులో సెంచరీతో అదరగొట్టిన గిల్ ఎడ్జ్‌బాస్టన్‌లో మరింత జోరు చూపాడు. ఇంగ్లండ్ బౌలర్లు ఎంతగా కవ్వించినా.. సిసలైన కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో కెరీర్‌లో తొలి డబుల్ సెంచరీ రాబట్టి అదుర్స్ అనిపించాడు. ఈక్రమంలో అనేక రికార్డులను ఖాతాలో వేసుకున్నాడు. తన మారథాన్ ఇన్నింగ్స్‌లో జడేజా, సుందర్‌లతో కలిసి శతక భాగస్వామ్యాలను నెలకొల్పి.. జట్టు స్కోరును 211/5 నుంచి 600 దరిదాపులోకి చేర్చడం విశేషం. ఆ తర్వాత పేసర్లు ఆకాశ్, సిరాజ్ ఆరంభంలో వికెట్లు తీయగా.. బ్రూక్, రూట్ తమ జట్టును కాపాడే ప్రయత్నం చేస్తున్నారు.

ఇంగ్లండ్‌లో డబుల్ సెంచరీ చేసిన తొలి భారత కెప్టెన్‌గా గిల్. 'సేన' (దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లో ఈ ఫీట్ సాధించిన తొలి ఆసియా కెప్టెన్ కూడా అతడే. ఇంగ్లండ్ గడ్డపై అత్యధిక వ్యక్తిగత స్కోరు (269) కూడా గిల్‌దే.

1 భారత్ తరఫున టెస్టుల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన కెప్టెన్‌గా కోహ్లీ (254 నాటౌట్)ని దాటేసిన గిల్ (269).

2 భారత్ నుంచి డబుల్ సెంచరీ సాధించిన రెండో పిన్న వయసు (25 ఏళ్లు) కెప్టెన్‌గా గిల్. మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ (23 ఏళ్లు) ముందున్నాడు.

విదేశాల్లో టెస్టు డబుల్ సాధించిన రెండో భారత కెప్టెన్‌గా గిల్. 2016లో విండీస్‌పై విరాట్ బాదాడు.

ఐదు వికెట్లు కోల్పోయాక ఎక్కువ పరుగులు (376) సాధించడం భారత్‌కిదే తొలిసారి.

3 గవాస్కర్, ద్రవిడ్ తర్వాత ఇంగ్లండ్‌లో డబుల్ సెంచరీ చేసిన మూడో భారత ప్లేయర్ గిల్. విదేశాల్లో 250+ స్కోరు సాధించిన మూడో భారత బ్యాటర్‌గా గిల్. సెహ్వాగ్ (309, 254), ద్రవిడ్ (270) ముందున్నారు.

6 టెస్టుల్లో డబుల్ సెంచరీ చేసిన ఆరో భారత కెప్టెన్‌గా గిల్. గతంలో పటౌడీ, గవాస్కర్, సచిన్, ధోనీ, కోహ్లీ ఈ ఘనత సాధించారు.

భారత్ 587 ఆలౌట్ ● ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 77/3



జడేజా (89)

బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా రెండో రోజే అత్యంత పటిష్ఠ స్థితిలో నిలిచింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (387 బంతుల్లో 30 ఫోర్లు, 3 సిక్సర్లతో 269) మొక్కవోని పట్టుదలతో డబుల్ సెంచరీ సాధించాడు. జడేజా (89), వాషింగ్టన్ సుందర్ (42) సహకారం అందించడంతో గురువారం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 151 ఓవర్లలో 587 పరుగుల భారీ స్కోరు సాధించింది. స్పిన్నర్ బషీర్‌కు మూడు.. వోక్స్, టంగ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 77 పరుగులు చేసింది. క్రీజులో బ్రూక్ (30), రూట్ (18) ఉన్నారు. ఆకాశ్‌కు 2, సిరాజ్‌కు ఓ వికెట్ దక్కింది. ప్రస్తుతం ఇంగ్లండ్ 510 పరుగులు వెనుకబడిన దశలో మూడో రోజు ఆట కీలకంగా మారనుంది.

నిలకడగా..: రెండో రోజు 310/5 ఓవర్‌నైట్ స్కోరుతో భారత్ తొలి ఇన్నింగ్స్ ఆరంభించగా, కెప్టెన్ గిల్, జడేజా నిలకడైన ఆటతీరుతో ప్రత్యర్థి బౌలర్లను విసిగించారు. పిచ్ నుంచి వారికెలాంటి సహకారం లభించకపోవడంతో భారత జోడీ ఆధిపత్యం చూపింది. అటు షార్ట్ పిచ్ బంతులతో ఇబ్బంది పెట్టాలని ప్రయత్నించినా ఇంగ్లండ్ బౌలర్లు సఫలం కాలేకపోయారు. స్పిన్నర్ బషీర్ ఓవర్లలో గిల్, జడేజా సిక్సర్లతో ఆకట్టుకున్నారు. అయితే లంచ్ బ్రేక్‌కు కాస్త ముందు శతకానికి చేరువగా ఉన్న జడేజాను టంగ్ షార్ట్ బాల్‌తో దెబ్బతీశాడు. దీంతో ఆరో వికెట్‌కు 203 పరుగుల భారీ భాగస్వామ్యానికి చెక్ పడింది. ఆ తర్వాత బరిలోకి దిగిన సుందర్‌ను ఇబ్బందిపెట్టేందుకు కెప్టెన్ స్టోక్స్ స్లిప్‌తో పాటు లెగ్ సైడ్‌లో మరో ఇద్దరిని మోహరించాడు. అలాగే పేసర్ టంగ్ సైతం అతడిని ఎక్స్‌ట్రా బౌన్స్‌తో దెబ్బతీయాలని చూశాడు. కానీ సుందర్ ఓపికను ప్రదర్శించాడు. ఈ సెషన్‌లో జట్టు 25 ఓవర్లలో 109 పరుగులు సాధించింది.

గిల్ ద్విశతకం: రెండో సెషన్‌లోనూ భారత్‌దే హవా సాగింది. గిల్ మరింత సాధికారతను చూపుతూ కెరీర్‌లోనే భారీ స్కోరుతో నిలిచాడు. అతడిని కట్టడి చేసేందుకు ఎంతమంది బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. అటు తొలి 40 బంతుల్లో ఐదు పరుగులే సాధించిన సుందర్ ఆ తర్వాత ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ సాగించాడు. పిచ్ మరింత ఫ్లాట్‌గా మారడంతో బషీర్ ఓవర్‌లో ఫోర్‌తో టచ్‌లోకి వచ్చిన అతడు తర్వాతి ఓవర్‌లోనే 4,6తో లయ అందుకున్నాడు. అయితే గిల్ 199 రన్స్ దగ్గర ఉన్నప్పుడు వరుసగా మూడు ఓవర్లను సుందరే ఎదుర్కొన్నాడు. చివరికి టంగ్ ఓవర్‌లో సింగిల్‌తో గిల్ డబుల్ సెంచరీ పూర్తయ్యింది. ఆ తర్వాత జోరు పెంచి బషీర్ ఓవర్‌లో రెండు, బ్రూక్ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో గిల్ చెలరేగాడు. ఈ ఊపులో 37 బంతుల్లోనే మరో 50 రన్స్ జత చేసి తన స్కోరును 250కి చేర్చాడు. అటు క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని విడదీసేందుకు రూట్ చేతికి బంతినివ్వడంతో ఫలితాన్నిచ్చింది. సుందర్‌ను బౌల్డ్ చేయడంతో ఏడో వికెట్‌కు 144 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక చివరి సెషన్ ఆరంభమయ్యాక మరో తొమ్మిది ఓవర్లలోనే భారత్ మిగిలిన మూడు వికెట్లను కోల్పోయింది. గిల్ సూపర్ ఇన్నింగ్స్‌కు టంగ్ తెరదించగా ప్రేక్షకుల కరతాళధ్వనుల మధ్య తను పెవిలియన్‌కు చేరాడు.

ఆదిలోనే వికెట్లు: ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ ఆరంభానికి ముందు పిచ్ ఇంకా బ్యాటింగ్‌కు అనుకూలంగానే కనిపించింది. దీనికి తోడు బుమ్రా లేని భారత బౌలింగ్ దళం ఆతిథ్య జట్టు బ్యాటర్లను ఎలా అడ్డుకుంటుందోననే సందేహాలు నెలకొన్నాయి. కానీ ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లోనే పేసర్ ఆకాశ్ వరుస బంతుల్లో ఫామ్‌లో ఉన్న ఓపెనర్ డకెట్, పోప్‌లను డకౌట్లుగా పెవిలియన్‌కు చేర్చాడు. కాసేపటికే క్రాలే (19)ను సిరాజ్ అవుట్ చేయడంతో 25/3 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ దశలో భారత బౌలర్ల జోరును బ్రూక్, రూట్ నిలువరించారు. రిస్కీ షాట్ల జోలికి పోకుండా జాగ్రత్తను కనబర్చి రెండో రోజును ముగించారు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 87; రాహుల్ (బి) వోక్స్ 2; కరుణ్ నాయర్ (సి) బ్రూక్ (బి) కార్స్ 31; గిల్ (సి) పోప్ (బి) టంగ్ 269, పంత్ (సి) క్రాలే (బి) బషీర్ 25; నితీశ్ (బి) వోక్స్ 1; జడేజా (సి) స్మిత్ (బి) టంగ్ 89; సుందర్ (బి) రూట్ 42; ఆకాశ్ (సి) డకెట్ (బి) బషీర్ 6; సిరాజ్ (స్టంప్డ్) స్మిత్ (బి) బషీర్ 8; ప్రసిద్ధ్ (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు: 22; మొత్తం: 151 ఓవర్లలో 587 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-15, 2-95, 3-161, 4-208, 5-211, 6-414, 7-558, 8-574, 9-574, 10-587.**బౌలింగ్:** వోక్స్ 25-6-81-2; కార్స్ 24-3-83-1; టంగ్ 28-2-119-2; స్టోక్స్ 19-0-74-1; బషీర్ 45-2-167-3; రూట్ 5-0-20-1; బ్రూక్ 5-0-31-0.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) కరుణ్ (బి) సిరాజ్ 19; డకెట్ (సి) గిల్ (బి) ఆకాశ్ 0; పోప్ (సి) రాహుల్ (బి) ఆకాశ్ 0; రూట్ (బ్యాటింగ్) 18; బ్రూక్ (బ్యాటింగ్) 30; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 77/3. వికెట్ల పతనం:** 1-13, 2-13, 3-25. **బౌలింగ్:** ఆకాశ్ 7-1-36-2; సిరాజ్ 7-2-21-1; ప్రసిద్ధ్ 3-0-11-0; నితీశ్ 1-0-1-0; జడేజా 2-1-4-0.

కార్ల్‌సన్‌కు గుకేశ్ షాక్

జాగ్రెబ్ (క్రొయేషియా): వరల్డ్ చాంపియన్ గుకేశ్..ప్రపంచ నెంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు గట్టి షాకిచ్చాడు. గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జగ్రెబ్ అంచె సూపర్ యునైటెడ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీలో గురువారం జరిగిన ఆరో రౌండ్‌లో కార్ల్‌సన్‌ను గుకేశ్ చిత్తు చేశాడు. దాంతో టోర్నీలో ఆరు రౌండ్లు ముగిసేసరికి గుకేశ్ మొత్తం పది పాయింట్లతో అగ్రస్థానానికి దూసుకొచ్చాడు.

పాక్ హాకీ జట్లకు గ్రీన్‌సిగ్నల్!

న్యూఢిల్లీ: భారత్ ఆతిథ్యం ఇచ్చే ఆసియా కప్, జూనియర్ వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్ హాకీ జట్లు పాల్గొనేందుకు ఎటువంటి ఆటంకాలు ఉండబోవని ప్రభుత్వం స్పష్టం చేసింది. మల్టీనేషన్ టోర్నీలు కావడంతో ఒలింపిక్ చార్టర్‌ను ఉల్లంఘించదల్చుకోలేదని క్రీడా మంత్రిత్వ శాఖ తెలిపింది. ఆసియా కప్ ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 7 వరకు బిహార్‌లోని రాజ్‌గిరిలో.. చెన్నై, మధురైలో నవంబరు 28 నుంచి డిసెంబరు 10 వరకు వరల్డ్‌కప్ జరుగుతాయి.

బిజినెస్

మూడంచెల జీఎస్‌టీ రేట్లు వాంఛనీయం



- ఈ ఏడాది వృద్ధి 6.4-6.7%
- సీఐఐ కొత్త అధ్యక్షుడు రాజీవ్ మెమానీ

న్యూఢిల్లీ: దేశంలో సరళమైన మూడంచెల జీఎస్‌టీ విధానం అమలు చేయాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నూతన అధ్యక్షుడు రాజీవ్ మెమానీ సూచించారు. నిత్యావసర వస్తువులకు 5%, విలాసవంతమైన వస్తువులకు 28% కనిష్ఠ, గరిష్ఠ రేటు, మిగతా వస్తువులన్నింటికీ మధ్యేమార్గంగా 12-18% రేటు ఉండాలన్న అభిప్రాయం ఆయన ప్రకటించారు. ప్రస్తుతం దేశంలో నాలుగంచెల జీఎస్‌టీ విధానం (5, 12, 18, 28 శాతం) అమలులో ఉంది. సీఐఐ అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వస్తు సేవల పన్నును (జీఎస్‌టీ) హేతుబద్ధం చేయాల్సిన అవసం ఉన్నదని నొక్కి చెప్పారు. ప్రధానంగా అల్పాదాయ వర్గాల ప్రజలు అధికంగా ఉపయోగించే వస్తువులపై పన్ను రేటు తగ్గించాలని ఆయన సూచించారు. అలాగే సిమెంట్ సహా అధిక శాతం ఉత్పత్తులపై ప్రస్తుతం 28% జీఎస్‌టీ అమలులో ఉన్నదని, ఆ రేటును కూడా హేతుబద్ధీకరించడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు జోరందుకుంటాయని అన్నారు. పెట్రోలియం, విద్యుత్, రియల్ ఎస్టేట్, ఆల్కహాల్ ఉత్పత్తులను కూడా జీఎస్‌టీ పరిధిలోకి తెచ్చే విషయంలో జాతీయ స్థాయి ఏకాభిప్రాయ సాధన అవసరమని రాజీవ్ సూచించారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.4 శాతం నుంచి 6.7 శాతం మధ్యలో ఉండవచ్చని భారత రాజీవ్ అంచనా వేశారు. మన దేశ వృద్ధి రేటుకు రిస్కులు, బలాలు కూడా సమతూకంగా ఉన్నాయన్నారు. భౌగోళిక, రాజకీయ అస్థిరతలు వృద్ధిని క్షీణింప చేసే ప్రమాదం ఉన్నప్పటికీ వస్తు, సేవలకు దేశీయ డిమాండు బలంగా ఉండడం వృద్ధిని ఉద్దీపింప చేసే అంశమని ఆయన వివరించారు.

- అమెరికాకు చెందిన క్లయింట్ నుంచి 93.6 లక్షల డాలర్ల విలువైన కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నట్లు బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ వెల్లడించింది. కాంట్రాక్ట్‌లో భాగంగా దక్షిణ అమెరికా తీర ప్రాంతంలో రక్షణపరమైన చర్యలు పెంపొందించేందుకు కస్టమైజ్డ్ కోస్టల్ సర్వియలెన్స్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయటంతో పాటు దాన్ని అమలు పరచాల్సి ఉంటుంది.
- ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో భాగంగా వైజాగ్ ఫ్రాంఛైజీని కొనుగోలు చేసినట్లు స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ ప్రకటించింది. క్రీడలను ప్రోత్సహించాలనే సంకల్పంతో పాటు ప్రాంతీయ క్రీడాకారులకు మరింత తోడ్పాటునందించే ఉద్దేశంతో ఈ ఫ్రాంఛైజీని తీసుకున్నట్లు వెల్లడించింది.

13 వరకు జోయాలుక్కాస్ అతిపెద్ద జువెలరీ సేల్



హైదరాబాద్: జువెలరీ రిటైలర్ జోయాలుక్కాస్.. ది బిగ్గెస్ట్ జువెలరీ సేల్ ఆఫ్ ది ఇయర్ పేరుతో వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నెల 13 వరకు ఈ ఆపర్లు అందుబాటులో ఉండనున్నాయి. ఇందులో భాగంగా ఎంపిక చేసిన ఆభరణాల మజూరీ చార్జీల (వీఏ)పై 50 శాతం తగ్గింపును ఆఫర్ చేస్తున్నట్లు జోయాలుక్కాస్ ప్రకటించింది. ఈ మెగా సేల్‌లో బంగారం, వజ్రాలు (కట్, అన్ కట్), ప్లాటినం, వెండి, ప్రీషియస్ స్టోన్స్‌లోని విస్తృత శ్రేణి డిజైన్లు కస్టమర్ల కోసం అందుబాటులో ఉండనున్నాయి. అలాగే పరిమిత సమయం డిస్కౌంట్‌తో పాటు కస్టమర్లు చేసే ప్రతి కొనుగోలుపై ఉచిత జీవితకాలం నిర్వహణ, ఏడాది బీమా, 100 శాతం బైబ్యాక్ హామీ ప్రయోజనాలను కల్పిస్తున్నట్లు పేర్కొంది.

ఇళ్ల అమ్మకాలు కిందికి..

- ధరలు మాత్రం పైపైకి..
- హైదరాబాద్ రియల్టీ అదుర్స్
- నైట్ ఫ్రాంక్ ఇండియా



న్యూఢిల్లీ: దేశంలో ఇళ్ల అమ్మకాలు నేల చూపులు చూస్తున్నాయి. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో 1,70,201 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే అమ్మకాలు 2 శాతం తగ్గాయని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో తెలిపింది. అమ్మకాలు తగ్గినా ఇళ్ల ధరలు మాత్రం సగటున 2 నుంచి 14 శాతం వరకు పెరిగాయి. ఇదే సమయంలో ఈ ఎనిమిది నగరాల్లో కంపెనీలు లీజుకు తీసుకున్న ఆఫీస్ స్పేస్ విస్తీర్ణం 41% పెరిగి 489 లక్షల ఎస్ఎఫ్‌టీ చేరింది.

హైదరాబాద్ రియల్టీలో జోరు: గత ఆరు నెలల్లో హైదరాబాద్ రియల్టీలో మాత్రం మంచి వృద్ధి రేటు కనిపించింది. గత ఆరు నెలల్లో నగరం, దాని చుట్టుపక్కల 19,048 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడు పోయాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 3 శాతం ఎక్కువ. ఇదే సమయంలో ధరలు 11 శాతం వరకు పెరిగాయి. కార్యాలయ భవనాల లీజుల విషయంలోనూ ఇదే పరిస్థితి. గత ఆరు నెలల్లో హైదరాబాద్‌లో 59 లక్షల చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) ఆఫీస్ స్పేస్ లీజుకు సంబంధించి ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 16 శాతం ఎక్కువ. ఇదే సమయంలో నెలవారీ ఎస్ఎఫ్‌టీ లీజు రెంటల్స్ సగటున 10 శాతం పెరిగి రూ.75కు చేరాయి.

- జూన్ ముగిసే నాటికి హైదరాబాద్‌లో అమ్ముడుపోని ఇళ్లు, ఫ్లాట్ల సంఖ్య 54,458గా ఉన్నాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ.
- రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల మధ్య ధర ఉన్న ఇళ్లకు యమ గిరాకీ
- రూ.కోటి నుంచి రూ.5 కోట్ల మధ్య ధర ఉన్న లగ్జరీ ఇళ్లకూ గిరాకీ

హెల్త్‌కేర్ రంగం కోసం నియంత్రణ మండలి!



ఏర్పాటుకు ప్రభుత్వ ప్రయత్నాలు.. హాస్పిటల్స్ దందాలకు చెక్ పెట్టేందుకే..

న్యూఢిల్లీ: ప్రైవేట్ ఆస్పత్రుల దందాలకు చెక్ పెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం మార్కెట్ నియంత్రణ మండలి సెబీ, బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి ఐఆర్‌డీఏఐ, టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ తరహాలోనే హెల్త్‌కేర్ రంగం కోసం స్వతంత్రంగా పనిచేసే ఒక రెగ్యులేటరీ సంస్థను ఏర్పాటు చేసేందుకు జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ (జీఐసీ), ఐఆర్‌డీఏఐ.. ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయని జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎండీ రామస్వామి నారాయణన్ వెల్లడించారు. ఈ రెగ్యులేటరీ సంస్థ అమల్లోకి వస్తే ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య బీమా ఉన్న పేషెంట్ల నుంచి వసూలు చేసే విచక్షణాపూరిత భారీ బిల్లులకు చెక్ పడుతుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎందుకంటే?

ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరైనా ఏదైనా అనారోగ్య సమస్యతో హాస్పిటల్‌కు వెళితే, ఆస్పత్రి ఉద్యోగులు అడిగే మొదటి ప్రశ్న 'మీకు ఆరోగ్య బీమా పాలసీ ఉందా? అని.. ఉంది అంటే ఇక వారి పంట పండినట్టే. సమస్య చిన్నదైనా వారి నుంచి నగదు చెల్లింపు రోగి కంటే రెండు మూడు రెట్లు ఎక్కువ బిల్లు చేసి పంపిస్తున్నారని రామస్వామి అన్నారు. అన్ని ఆస్పత్రులు కాకపోయినా, ఎక్కువ ఆస్పత్రుల్లో జరుగుతున్న దందా ఇదే. ఈ క్లెయిమ్‌లు చెల్లించలేక బీమా కంపెనీలు కిందా మీద పడుతున్నాయి. దీంతో ఆ భారాన్ని తట్టుకునేందుకు ప్రీమియం రేట్లు పెంచేసి, ఆ మొత్తాన్ని పాలసీదారుడి నుంచే బీమా కంపెనీలు వసూలు చేస్తున్నాయి. ఇది అటు బీమా కంపెనీలకు, ఇటు పాలసీదారులకు ఇద్దరికీ భారంగానే మారుతోంది. స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే హెల్త్‌కేర్ రెగ్యులేటరీ సంస్థను ఏర్పాటు చేయడం ద్వారా ఈ దందాను అడ్డుకోవాలని బీమా సంస్థలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.


ఎంఎస్ఈలకు ఆర్‌బీఐ ఊరట

ప్రీపేమెంట్ పెనాల్టీల రద్దు

ముంబై: దేశంలోని సూక్ష్మ, చిన్న వ్యాపార సంస్థల (ఎంఎస్ఈ)కు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) పెద్ద ఊరట ఇచ్చింది. ఈ సంస్థలు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల నుంచి చలన (ఫ్లోటింగ్) వడ్డీకి తీసుకునే రుణాల ముందస్తు చెల్లింపులపై పెనాల్టీలను రద్దు చేసింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయి. జనవరి 1 నుంచి ఎంఎస్ఈలు తీసుకునే కొత్త రుణాలు, పాత రుణాల రెన్యూవల్‌కు కూడా ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి ఉన్న రుణాలను ముందుగా చెల్లించాలన్నా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు తమ ముక్కు పిండి మరీ ఈ పెనాల్టీలు వసూలు చేస్తున్నాయని ఎంఎస్ఈల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆర్‌బీఐ ఈ చర్య తీసుకుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ



హైదరాబాద్	575	విజయవాడ	590
వరంగల్	577	గోదావరి	570
చిత్తూరు	633	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	93	విజయవాడ	95
వరంగల్	93	గుంటూరు	100
కరీంనగర్	93	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	95
కర్నూలు	93	నెల్లూరు	100
విశాఖపట్నం	81	అనంతపురం	100
గోదావరి	95		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,330 ▲	91,050 ▲	1,21,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,11,000 ▲
విశాఖపట్నం	99,970 ▼	91,050 ▲	1,21,000 ▲
రాజమండ్రి	99,330 ▲	91,050 ▲	1,09,400 ▲
ప్రొద్దుటూరు	97,750 ▲	89,930 ▲	1,08,000 ▲
ముంబై	97,337	89,151	1,07,620

రిలయన్స్ రిటైల్ గూటికి యూకే కంపెనీ

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) రిటైల్ అనుబంధ విభాగమైన రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) మరో కొనుగోలు జరిపింది. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)కు చెందిన ఫేషియల్ ఫిట్‌నెస్, స్కిన్‌కేర్ బ్రాండ్ ఫేస్‌జిమ్‌లో మైనారిటీ వాటాను చేజిక్కించుకుంది. అయితే, ఈ ఒప్పందం విలువ మాత్రం వెల్లడించలేదు. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఫేస్‌జిమ్ ఉత్పత్తులను భారత మార్కెట్లో ఆర్ఆర్‌వీఎల్ ప్రవేశపెట్టనుంది.

ఎఫ్ఎంసీజీ వ్యాపారం కోసం కొత్త కంపెనీ ఏర్పాటు: ఆర్ఆర్‌వీఎల్ వ్యాపారాన్ని పునర్‌వ్యవస్థీకరిస్తోంది. ఎఫ్ఎంసీజీ బ్రాండ్ల వ్యాపారాన్ని విభజించి 'న్యూ రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (న్యూ ఆర్‌సీపీఎల్) పేరిట కొత్త కంపెనీని ఏర్పాటు చేయనుంది. ఇందుకు ఎన్‌సీఎల్‌టీ అనుమతి కోరింది.

2027 ఫిబ్రవరిలో భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో

న్యూఢిల్లీ: భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో (బీఎంజీఈ).. తదుపరి ఎడిషన్‌ను 2027, ఫిబ్రవరి 4 నుంచి 9 వరకు ఢిల్లీలో నిర్వహించనున్నట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. ఇప్పటికే 2024, 2025 (జనవరి)లో జరిగిన రెండు ఎడిషన్స్‌కు విశేష స్పందన లభించగా.. ఈ మూడో ఎడిషన్‌లో ఎక్స్‌పో పరిధిని మరింత విస్తరించేందుకు కొత్త విభాగాలను చేర్చనున్నట్లు వెల్లడించింది. వీటిలో మల్టీ మోడల్ మొబిలిటీ, లాజిస్టిక్స్‌తో పాటు వ్యవసాయ ఆధారిత మొబిలిటీ పరిష్కారాలపై ప్రత్యేక ప్రదర్శనలు ఉంటాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

ఆఖరి గంటలో అమ్మకాలు

- సెన్సెక్స్ 170 పాయింట్లు పతనం
- ఇంట్రాడే గరిష్ఠ స్థాయితో పోలిస్తే 610 పాయింట్లు కోల్పోయిన సూచీ

ముంబై: స్టాక్ మార్కెట్ మదుపరులు ఆఖరి గంట ట్రేడింగ్‌లో ఆర్థిక సేవలు, లోహ రంగ షేర్లలో అమ్మకాలకు పాల్పడటంతో ప్రామాణిక సూచీలు గురువారం నష్టాల్లో ముగిశాయి. ఆరంభంలో లాభాల్లో ప్రారంభమైన సెన్సెక్స్.. ఒకదశలో 440 పాయింట్ల వరకు ఎగబాకి 83,850 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. కానీ, మదుపరులు చివర్లో లాభాల స్వీకరణకు మొగ్గు చూపటంతో సూచీ తిరోగమన బాటలో పయనించింది. 170.22 పాయింట్ల నష్టంతో 83,239.47 వద్ద ముగిసింది. ఇంట్రాడే గరిష్ఠ స్థాయితో పోలిస్తే, సెన్సెక్స్ 610 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ విషయానికొస్తే, 48.10 పాయింట్ల నష్టంతో 25,405.30 వద్ద స్థిరపడింది.

వాతావరణ డెరివేటివ్‌లు..

ప్రారంభించేందుకు ఐఎండీతో ఎన్‌సీడీఈఎక్స్ ఒప్పందం

దేశంలో తొలిసారిగా వాతావరణ (వెదర్) డెరివేటివ్ కాంట్రాక్టులను ప్రవేశపెట్టేందుకు భారత వాతావరణ శాఖ(ఐఎండీ)తో నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్ (ఎన్‌సీడీఈఎక్స్) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రైతులు, వ్యవసాయ రంగ సంబంధిత వర్గాలు లోటు వర్షపాతం, వడగాల్పులు, అకాల వాతావరణ పరిస్థితులతో ఎదురయ్యే నష్టాల నుంచి రక్షణ పొందేందుకు ఈ డెరివేటివ్ కాంట్రాక్టులు తోడ్పడగలవని ఎన్‌సీడీఈఎక్స్ పేర్కొంది. ఐఎండీతో భాగస్వామ్యంలో వర్షపాత ఆధారిత డెరివేటివ్‌లతోపాటు ఇతర కాంట్రాక్టులను అభివృద్ధి చేయనున్నట్లు, ఇందుకోసం ఐఎండీ గత, రియల్‌టైం డేటాను వినియోగించుకోనున్నట్లు తెలిపింది.


shanthi TALKIES
MYTHRI MOVIE DISTRIBUTORS LLP
RELEASING TODAY
SIDDHARTH
SARATH KUMAR
3BHK
'Every Ordinary Family has an Extraordinary Story'
WRITER - DIRECTOR SRI GANESH
PRODUCED BY ARUN VISWA
PRODUCED BY ARUN VISWA


ప్రపంచవ్యాప్తంగా
నేడే
విడుదల
జురాసిక్ వరల్డ్
IN CINEMAS JULY 4
RELEASING IN ENGLISH, HINDI, TAMIL AND TELUGU
IN 3D
UNIVERSAL


ANIL SUNKARA PROUDLY PRESENTS
SKYLINE MOVIES
SHOW TIME
నేడే
విడుదల
WRITTEN & DIRECTED BY
MADHAN DAKSHINAMOORTHY
PRODUCER
KISHORE GARIKIPATI (G K)


ప్రపంచవ్యాప్తంగా
జూలై
11
విడుదల
IT BEGINS
A JAMES GUNN FILM
DC STUDIOS
సూపర్‌మ్యాన్
SUPERMAN
ONLY IN CINEMAS JULY 11
IN ENGLISH, HINDI & TELUGU
IN 3D & IMAX 3D
REAL D 3D Dolby Cinema FILMED FOR IMAX
WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111


SMT.ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
DIL RAJU PRODUCTION
T-SERIES MUSIC
నేడే
విడుదల
NITHIIN
తమ్ముడు
SRIRAM VENU
RAJU SHIRISH
K V GUHAN B.AJANEESH LOKNATH SH.PRAWIN PUDI G M SEKHAR



తుంగభద్ర డ్యాం 20 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

పొంగుతున్న తుంగభద్ర

- డ్యాంలో 78.01 టీఎంసీలు.. 20 గేట్లెత్తి దిగువకు నీరు విడుదల
- శ్రీశైలానికి కొనసాగుతున్న వరద.. 875 అడుగులకు నీటిమట్టం
- పోలవరం వద్ద గోదావరి పరవళ్లు

కర్నూలు/పోలవరం, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం, తుంగభద్ర జలాశయాలకు వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. తుంగభద్ర డ్యాంలో గురువారం సాయంత్రం 3 గంటలకు 78.01 టీఎంసీలు నీరు చేరింది. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 1,633 అడుగులు, పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు. అయితే గతేడాది 19వ నంబరు గేటు కొట్టుకుపోవడం, మిగిలిన గేట్లు కూడా పటుత్వం దెబ్బతిన్నదని నిపుణులు సూచన మేరకు 80 టీఎంసీలే నిల్వ చేస్తున్నారు. ప్రస్తుతం 28,932 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టులో 78.01 టీఎంసీలు నిల్వ చేసి, 20 గేట్లు రెండున్నర అడుగుల చొప్పున ఎత్తి దిగువకు 58,260 క్యూసెక్కులు విడుదల చేశారు. దీంతో బళ్లారి, కర్నూలు జిల్లాల్లోని నదీతీర గ్రామాలు, మంత్రాలయంలో భక్తులను అప్రమత్తం చేసేందుకు ప్రమాద హెచ్చరిక జారీచేశారు. రెండు రోజుల్లో సుంకేసుల డ్యాంకు తుంగభద్ర వరద చేరే అవకాశం ఉందని, కేసీ కాలువకు నీటి విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇంజనీర్లు తెలిపారు. ఇక శ్రీశైలం జలాశయంలో క్రమంగా నీటిమట్టం పెరుగుతోంది. గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు, సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా, గురువారం 875.80 అడుగులకు నీటిమట్టం చేరింది. 167.48 టీఎంసీలకు నిల్వ పెరిగింది. ఎగువన జూరాల నుంచి విడుదల చేస్తున్న 64,611 క్యూసెక్కుల వరద శ్రీశైలం చేరుతోంది. శ్రీశైలం డ్యాంకు భారీగా వరద వచ్చి చేరుతున్నందున తక్షణమే ప్రభుత్వం రాయలసీమ కాలువలకు సాగునీరు విడుదల చేయాలని సాగునీటి నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

వాగుల నుంచి గోదావరికి..

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉపనదులు, ఏజెన్సీలోని కొండ వాగులు పొంగుతున్నాయి. వరద నీరు గోదావరిలో కలుస్తోంది. దీంతో గోదావరి నీటిమట్టం గడిచిన మూడు రోజుల్లో అనూహ్యంగా పెరిగింది. ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు స్పిల్వేలోకి అదనంగా వస్తున్న 1,35,341 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్లు గురువారం జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. నీటిమట్టం పెరగడంతో దిగువ కాఫర్ డ్యాంకి మట్టి, రాతి తరలింపు వాహనాలు కోసం వేసిన రోడ్డు పూర్తిగా నీటమునిగింది.

నదీ జలాల కేటాయింపులపై తెలంగాణ నేతల మాటలన్నీ అబద్ధాలే

- ప్రాజెక్టుల వారీ గణాంకాలపై తెలంగాణ గడ్డపైనైనా మాట్లాడతా
- పోలవరం - బనకచర్లను గోదావరి - సోమశిలగా మార్చాలి
- జల వనరుల విశ్లేషకుడు టి.లక్ష్మీనారాయణ సూచన

అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): నదీ జలాల కేటాయింపులపై తెలంగాణ నేతల మాటలన్నీ అబద్ధాలేనని జల వనరుల విశ్లేషకుడు టి.లక్ష్మీనారాయణ విమర్శించారు. నీటి కేటాయింపులపై తెలంగాణ మాజీ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న వ్యాఖ్యలన్నీ తప్పేనని ఆయన స్పష్టం చేశారు. ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డితో సహా.. అక్కడి ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్న ప్రాజెక్టుల వారీ గణాంకాలపై తెలంగాణ గడ్డపైనైనా మాట్లాడతానని తేల్చి చెప్పారు. గోదావరి వరద జలాలను ఏపీ స్వేచ్ఛగా వాడుకోవచ్చని ట్రిబ్యునల్ ఆదేశించిందని వెల్లడించారు. పోలవరం - బనకచర్ల అనుసంధానాన్ని జాతీయ నదుల అనుసంధాన పథకంలో చేర్చి, గోదావరి - సోమశిలగా మార్చాలని లక్ష్మీనారాయణ సూచించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నాడు ఆలోచనాపరుల వేదిక తరపున వ్యవసాయరంగ నిపుణుడు అక్కినేని భవానీ ప్రసాద్‌తో కలసి లక్ష్మీనారాయణ మీడియాతో మాట్లాడారు. ఏపీకి అన్యాయం చేసేలా తెలంగాణ నేతల మాట్లాడుతుంటే.. కూటమి ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటోందని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో పొరుగు రాష్ట్రాలైన ఒడిసా, చత్తీస్‌గడ్‌లు సుప్రీం కోర్టులో కేసులు వేసినందున.. పోలవరం- బనకచర్లపై కేంద్ర పర్యావరణ శాఖ తీసుకున్న నిర్ణయం సహేతుకమైనదేనని అన్నారు.

కేంద్రంలో ఏ కూటమిలోనూ లేము: వైసీపీ సుబ్బారెడ్డి

న్యూఢిల్లీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): 'ఎన్డీఏ, ఇండియా... ఏ కూటమిలోనూ వైసీపీ లేదు. బిహార్ తరహాలో ఏపీలోనూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు కేంద్ర ఎన్నికల కమిషన్ హామీ ఇచ్చింది' అని ఆ పార్టీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం వైసీపీ సహా పలు పార్టీలతో సమావేశమైంది. సమావేశం అనంతరం వైవీ మీడియాతో మాట్లాడారు. 'గత ఎన్నికల్లో ఈవీఎంలపై అనుమానాలు ఉన్నాయి. విజయనగరం పార్లమెంట్ ఎన్నికలోని ఈవీఎంలను, వీవీ పాట్లు మరోసారి సరిచూడాలని కోరాం. అది సాధ్యం కాదనీ ఈసీ చెప్పింది. సీసీ టీవీ ఫుటేజీ విడుదల చేయాలని కోరినా నిరాకరించింది. బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని ఈసీని కోరాం' అని ఎంపీ వైవీ తెలిపారు.

బాబు, లోకేశ్... అబద్ధాల్లో దిట్టలు: బొత్స

శ్రీకాకుళం, జూలై 3(ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు వంద అబద్ధాలు చెబితే... ఆయన కుమారుడు లోకేశ్ 200ల అబద్ధాలు చెబుతారు. అబద్ధాల్లో వీరిద్దరూ దిట్ట' అని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. గురువారం శ్రీకాకుళంలో నిర్వహించిన జిల్లా వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల తరపున ప్రశ్నిస్తున్నామని చెప్పారు. కాగా ఇదే సభలో వైసీపీ నేత పేడాడ తిలక్ మాట్లాడుతూ.. ఒరేయ్ అచ్చెన్నాయుడు.. నీకు దమ్ము ధైర్యం ఉంటే.. ఒక అమ్మకు అబ్బకు పుట్టి ఉంటే రారా అంటూ రెచ్చిపోయారు. ఈ కార్యక్రమానికి ధర్మాన ప్రసాదరావు గైర్హాజరయ్యారు.

జంఝావతి కథ..

అంతులేని వ్యథ!

ఐదు దశాబ్దాలుగా ప్రభుత్వాల నిర్లక్ష్యం

- ఒడిసాను ఒప్పించి 1,075 ఎకరాలు సేకరిస్తే 75 గ్రామాల్లో 24,460 ఎకరాలకు సాగునీరు
- గత సీఎంలు నవీన్-జగన్ భేటీతో ఫలితం శూన్యం
- చంద్రబాబే చొరవ చూపాలని మన్యం రైతుల వినతి
- వచ్చేవారంలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై సీఎం సమీక్ష

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



చుట్టూ దట్టమైన కొండలు.. మదపుటేనుగుల ఘీంకారాలు.. తియ్యని.. పుల్లని రుచుల అనాస పళ్లు.. అమాయకంగా కనిపించే మట్టి మనుషులు.. వీటన్నిటితో కూడిన పార్వతీపురం మన్యం జిల్లా ప్రజల గోడు ప్రభుత్వాలకు పట్టడం లేదు. తాగు, సాగునీటి కష్టాలు తీర్చే జంఝావతి ప్రాజెక్టు సమస్య ఐదు దశాబ్దాలుగా తీరడం లేదు. సరిహద్దు రాష్ట్రం ఒడిసాలోని పది గ్రామాల్లో కేవలం 1,075 ఎకరాలు సేకరిస్తే.. మన రాష్ట్రంలో 75 గ్రామాలకు చెందిన 24,640 ఎకరాలకు సాగునీందుతుంది. ఆ రాష్ట్రానికీ తగుస్థాయిలో నీరందుతుంది. 1975 సెప్టెంబరు 24వ తేదీన ఆంధ్రప్రదేశ్, ఒడిసా రాష్ట్రాల ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, నందిని శత్పథి.. నాగావతి ఉపనది జంఝావతిలోని చెరి సగం జలాలు పంచుకునేలా జంఝావతి ప్రాజెక్టును పూర్తిచేయాలని తీర్మానించారు. 1976లో పనులను ఆంధ్రప్రదేశ్ భావించినా కుదరలేదు. 1978 డిసెంబరు 12న జరిగిన అంతర్రాష్ట్ర సమావేశంలో.. ప్రాజెక్టు నిర్మాణ వ్యయాన్ని పూర్తిగా ఏపీయే భరించాలని నిర్ణయించారు. 1980 జూలై 27న రెండు రాష్ట్రాల మధ్య జరిగిన సమావేశంలో రివర్‌గ్యాప్ మినహా జలాశయం పనులు చేపట్టేందుకు అంగీకారం కుదిరింది. అలాగే జంఝావతి ప్రాజెక్టుతో నిరాశ్రయులయ్యే వారికి సహాయ పునరావాసం కల్పించే బాధ్యత ఏపీదేనని ఉభయరాష్ట్రాలూ అంగీకరించాయి. ఆ తర్వాత ఇరవై ఏళ్ల వరకు పునరావాసం గురించి రెండు రాష్ట్రాలూ పట్టించుకోలేదు. 2002 డిసెంబరు 23న జరిగిన అంతర్రాష్ట్ర భేటీలో.. ముంపు ప్రాంతాల్లో గ్రామ సభలు నిర్వహించి పునరావాస ప్యాకేజీని ఖరారు చేస్తే నిధులు మంజూరు చేస్తామని ఒడిసాకు ఆంధ్రప్రదేశ్ స్పష్టం చేసింది. ఆ నిధులు ఇచ్చాక రివర్ గ్యాప్ పనులు కూడా పూర్తి చేయాలని నిర్ణయించింది. ఆలోగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని భావించింది. జంఝావతి వల్ల రాష్ట్రంలో నాలుగు, ఒడిసాలోని పది గ్రామాల్లో మొత్తం 2,245.1 ఎకరాలు మునుగుతాయని అధికారులు గుర్తించారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినా రివర్ గ్యాప్ పనులు అలాగే ఉండిపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లోని జంఝావతి పరివాహక ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా ఉండేందుకు ఆస్ట్రియా సహకారంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రబ్బర్ డ్యాం నిర్మించారు. దీనికి ఆయన ప్రభుత్వం విపరీతమైన ప్రచారం చేసుకుంది. అయితే కొద్దిపాటి వరదకే ఈ రబ్బరు డ్యాం కొట్టుకుపోయింది. వైఎస్ సర్కారు అభాసుపాలైంది.

చర్చలు... లేఖలే!

జంఝావతి నిర్మాణం పూర్తయినా నీటి నిల్వకు ఆస్కారం లేకుండా పోవడంతో.. 2015లో నాటి కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు, ఒడిసా సీఎం నవీన్ పట్నాయక్ మధ్య చర్చలు జరిగాయి. ఒడిసాకు చెందిన పది ముంపు గ్రామాల్లోని 1,175.1 ఎకరాలకు సహాయ పునరావాస ప్యాకేజీని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఏపీ వెల్లడించింది. కానీ నవీన్ ముందుకు రాలేదు. భూసేకరణకయ్యే ఖర్చు భరించేందుకు సిద్ధంగా ఉన్నామంటూ 2018 మే 13వ తేదీన నాటి సీఎం చంద్రబాబు ఆయనకు లేఖ కూడా రాశారు. 2020 ఆగస్టులో ఒడిసా ప్రభుత్వం దీనిపై స్పందించి చర్చలకు ఆహ్వానించింది. దీంతో నాటి ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, నవీన్ పట్నాయక్ మధ్య చర్చలు జరిగాయి. ఇక జంఝావతి ప్రాజెక్టు పూర్తయినట్లేనని.. రైతుల కష్టాలు తొలగిపోయాయంటూ వైసీపీ ప్రభుత్వం విస్తృత ప్రచారం చేసుకుంది. చర్చలు ఫలప్రదమయ్యాయని జగన్ ప్రకటించుకున్నారు. అయితే.. ఆయనేం చెప్పారో.. నవీన్ ఏం అర్థం చేసుకున్నారో గానీ.. భూసేకరణ వ్యయం లెక్కలను ఒడిసా చెప్పలేదు. జగన్ గద్దెదిగేదాకా సమస్య పరిష్కారమే కాలేదు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రస్తుతం అధికారంలో ఉన్నందున.. ఒడిసాలోని బీజేపీ ప్రభుత్వంతో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలు జరిపితే.. ఐదు దశాబ్దాల జంఝావతి జంఝాటానికి పరిష్కారం లభిస్తుందని మన్యం ప్రజలు ఆశిస్తున్నారు. ఈ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు ఎన్డీఏ భాగస్వాములైనందున సమస్య కచ్చితంగా కొలిక్కివస్తుందని భావిస్తున్నారు.

ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రాధాన్యం

- వారం రోజుల్లో చంద్రబాబు సమీక్ష: నిమ్మల

అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేస్తామని జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. వచ్చేవారం వాటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షిస్తారని వెల్లడించారు. గురువారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై అధికారులతో ఆయన సమావేశమయ్యారు. 2014-19 నడుమ నాటి టీడీపీ ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను చాలావరకూ పూర్తి చేసిందని వెల్లడించారు. 2019లో దురదృష్టవశాత్తూ వచ్చిన వైసీపీ ప్రభుత్వం మిగిలిన కొద్ది పనులను చేయకుండా గాలికొదిలేసిందని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఈ ఏడాది కాలంలో మళ్లీ ఆ ప్రాజెక్టులను పట్టాలెక్కిస్తున్నావన్నారు. వంశధార స్టేజ్-2 ఫేజ్-2 పనులు 90 శాతం మేర పూర్తయ్యాయని చెప్పారు తోటపల్లి ప్రాజెక్టు పనులను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని.. గడచిన ఐదేళ్ల కాలంలో ఉత్తరాంధ్రకు జగన్ చేసిన ద్రోహం అంతా ఇంతా కాదన్నారు. ఈ సందర్భంగా హిరమండలం ఎత్తిపోతల, మడ్డువలస స్టేజ్-2, జంఝావతిపై మంత్రి ఆరా తీశారు. జైకా నిధులతో నత్తనడకన సాగుతున్న ఆంధ్ర రిజర్వాయరు, రైవాడ, పెద్దంకలం, పెద్దగడ్డ, వట్టిగెడ్డ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి సమీక్ష నాటికి ఏయే ప్రాజెక్టులకు ప్రాధాన్యమివ్వాలి.. ఎప్పటికల్లా పూర్తిచేస్తారో లక్ష్యాలను సిద్ధం చేయాలని స్పష్టంచేశారు. సమావేశంలో జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లు, ఎస్ఈలు పాల్గొన్నారు.

జగన్‌కు భద్రత పెంపుపై ఇప్పటికే రెండు వ్యాజ్యాలు

- ఇప్పుడు మరో పిటిషన్ వేసిన వైసీపీ నేతలు
- వారిద్వారా ఉత్తర్వులు పొందేందుకు యత్నం: ఏజీ
- ఈనెల 9కి విచారణ వాయిదా

అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి తనకు భద్రత పెంచాలని కోరుతూ హైకోర్టులో రెండు వ్యాజ్యాలు దాఖలు చేశారు. అక్కడ పొందలేని ఉత్తర్వులను ఆ పార్టీ నేతలు వేసిన పిటిషన్‌లో పొందేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు' అని అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ గురువారం హైకోర్టుకు నివేదించారు. నెల్లూరు పర్యటన సందర్భంగా పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో తాత్కాలిక హెలీప్యాడ్ ఏర్పాటు చేసుకొనేందుకు అనుమతించేలా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించాలంటూ ఆ పార్టీ నేతలు పిటిషన్ వేశారని గుర్తు చేశారు. జగన్ తన పర్యటనను వాయిదా వేసుకున్నందున ప్రస్తుత పిటిషన్ నిరర్థకం అయ్యిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం జగన్‌కు జెడ్ ప్లస్ భద్రత కల్పిస్తుందని వివరించారు. జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న వ్యక్తులకు రక్షణ కల్పించే విషయంలో కేంద్ర హోం శాఖ జారీ చేసిన మార్గదర్శకాలపై పిటిషనర్లు అనుబంధ పిటిషన్ వేశారు. దానిపై సవివరంగా కౌంటర్ దాఖలు చేస్తాం. విచారణను వాయిదా వేయాలి' అని కోరారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ వ్యాజ్యంపై తదుపరి విచారణను 9కి వాయిదా వేశారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన సందర్భంగా పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో తాత్కాలిక హెలీప్యాడ్ ఏర్పాటు చేసుకొనేందుకు అనుమతించేలా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించాలని కోరుతూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, ఆ పార్టీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పర్యటన సందర్భంగా రోప్ పార్టీని ఏర్పాటు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యంపై బుధవారం విచారణ జరిపిన హైకోర్టు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న వ్యక్తులకు రక్షణ కల్పించే విషయంలో కేంద్ర హోం శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను తమ ముందు ఉంచాలని పిటిషనర్లను ఆదేశించారు. గురువారం వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ... హెలిప్యాడ్ విషయంలో అధికారులు ఆలస్యంగా అనుమతులు ఇవ్వడంతో పర్యటన రద్దు అయ్యిందన్నారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న వ్యక్తికి రోప్ పార్టీ ఏర్పాటు చేయాలన్నారు. రోప్ పార్టీ ఏర్పాటు చేయకుంటే జగన్ భద్రత ప్రమాదంలో పడుతుందన్నారు.

నేడు వర్షాలు

విశాఖపట్నం, జూలై 3(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో రుతుపవనాలు చురుగ్గా మారడంతో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ గురువారం వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో ఉత్తరకోస్తాలో అనేకచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తా తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

జవాబు చెప్పండి

(మొదటి పేజీ తరువాయి)

కొర్రీలు వేసి ప్రతిపాదనను వెనక్కి పంపడం గమనార్హం. గోదావరికి వరద సమయంలో రోజుకు 2 టీఎంసీల చొప్పున వంద రోజుల్లో 200 టీఎంసీలను పోలవరం నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు తరలించాలన్నది ఈ ప్రాజెక్టు ఉద్దేశమన్న సంగతి తెలిసిందే. అసలింత వరద ఉందా.. ఈ ప్రాజెక్టు గోదావరి జలవివాదాల ట్రిబ్యునల్ అవార్డు ప్రకారమే ఉందా అని జలసంఘం ప్రశ్నించడం గమనార్హం, అటు ఈఏసీ, ఇటు జలసంఘం లేవనెత్తిన సందేహాలు, అడిగిన వివరణలకు సమాధానాలు ఇచ్చేందుకు.. అన్ని రాష్ట్రాల డేటా కలిగి ఉన్న కేంద్రప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్‌తో కలిసి రాష్ట్ర జలవనరుల శాఖ లోతుగా కసరత్తు చేస్తోంది.

రాష్ట్రాన్ని జలసంఘం అడిగిన డేటా ఇదీ

- ఇంద్రావతి, శబరి, దిగువ గోదావరి సబ్ బేసిన్లలో మిగులుజలాలు అందుబాటులో లేవని సాధ్యాసాధ్యాల నివేదికలో అధికారులు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని జలవనరుల ప్రాజెక్టులు.. అనుమతులు ఉన్నవి, లేనివీ.. పూర్తయినవి, నిర్మాణంలో ఉన్న వాటి వివరాలు, ప్రతిపాదిత నీటి వినియోగం గణాంకాలు సమర్పించాలి. ఎంత నీటి అందుబాటుతో ఈ ప్రాజెక్టులు తలపెట్టారో కూడా తెలియజేయాలి.
- రాష్ట్రంలో ప్రస్తుత, నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదిత ప్రాజెక్టులు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియజేసే ఇండెక్స్ మ్యాప్‌లు సమర్పించాలి.
- సాగునీరు, బహుళార్థ సాధక ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ల రూపకల్పన మార్గదర్శకాల (2010) ప్రకారం.. ఏదైనా ప్రాజెక్టును పరిశీలించాలంటే.. నీతి ఆయోగ్ సిఫారసు చేసిన విధంగా 75 శాతం నీటి డిపెండబిలిటీ ఉండాల్సిందే. ఈ నేపథ్యంలో ఆంధ్ర సహా బేసిన్ రాష్ట్రాలకు గోదావరి ట్రిబ్యునల్ కేటాయింపులు, ప్రాజెక్టులవారీ వినియోగాన్ని లెక్కించాక.. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి 200 టీఎంసీల వరద జలాల మళ్లింపునకు ఎంత డిపెండబిలిటీ ఉందో లెక్కించి చెప్పాలి.
- అధికారులు సమర్పించిన ఎక్సెల్ షీట్‌లో ఎలాంటి ఫార్ములాలు గానీ, గణాంక విధానాలు గానీ లేవు. వాటన్నిటినీ సమర్పించాలి.
- ప్రాజెక్టులవారీగా నీటి వినియోగం డేటా, సాగు ప్రాంతం, రిజర్వాయర్ల నుంచి నీటి విడుదల రికార్డుల గణాంకాలను మాకు పంపాలి.
- గోదావరి ట్రిబ్యునల్ అవార్డు కేటాయింపులను మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, ఒడిసా, తెలంగాణ, ఏపీ పూర్తిగా వాడుకున్నట్లు నివేదికలో తెలిపారు. ఆ కేటాయింపుల వినియోగం వివరాలు కూడా మాకు సమర్పించండి.
- పోలవరం డ్యాం నుంచి వరద జలాలను.. పోలవరం కుడి ప్రధాన కాలువతో పాటు సమాంతరంగా తవ్వే కాలువ ద్వారా రోజుకు 18 వేల క్యూసెక్కుల (510 క్యూమెక్కులు) చొప్పున కృష్ణా నది(ప్రకాశం బ్యారేజీ)లోకి తరలిస్తామని నివేదికలో పేర్కొన్నారు. అయితే వరద జలాలను ఎలా లెక్కిస్తారు.. ఏ ప్రాతిపదికన లెక్కిస్తారు.. ట్రిబ్యునల్ అవార్డుకు అనుగుణంగానే అవి ఉన్నాయా అనే వివరాలను మాకు పంపండి.
- రోజుకు 18 వేల క్యూసెక్కుల చొప్పున 200 టీఎంసీల గోదావరి జలాలను తరలించాలంటే.. 129 రోజుల సమయం పడుతుంది. మరి ఇన్ని రోజులు వరద అందుబాటులో ఉంటుందో లేదో.. పోలవరం వద్ద వరద నీటి విడుదల లెక్కల ఆధారంగా తాజా సర్వే చేపట్టాలి. ట్రిబ్యునల్ అవార్డును పరిగణనలోకి తీసుకున్నారో లేదో కూడా చెప్పాలి.

సమర్థ జవాబుల కోసం కసరత్తు

పోలవరం-బనకచర్లపై జలసంఘం, ఈఏసీ గంటల వ్యవధిలోనే కొర్రీలు వేయడంతో.. వాటి సందేహాలకు సమర్థంగా సమాధానాలు సమర్పించాలని రాష్ట్ర జలవనరుల శాఖ నిర్ణయించింది. వాప్కోస్‌తో కలసి ఈ దిశగా కసరత్తు చేస్తోంది. ఈ నెల ఏడో తేదీ నాటికి ఈ ప్రక్రియను కొలిక్కి తీసుకురావాలని యోచిస్తోంది. వివరాలన్నీ సిద్ధమయ్యాక.. సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు నేతృత్వంలో అధికారుల బృందాన్ని ఢిల్లీ పంపి.. సమగ్ర సమాచారాన్ని వ్యక్తిగతంగా జలసంఘానికి సమర్పించాలని నిర్ణయించింది.

7 నుంచి ఈఏపీసెట్ కౌన్సెలింగ్

- 22న సీట్ల కేటాయింపు.. ఆగస్టు 4 నుంచి తరగతులు

అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌ను ఈనెల 7వ తేదీ నుంచి చేపట్టనున్నట్లు అడ్మిషన్ల కన్వీనర్ జి.గణేష్‌కుమార్ గురువారం వెల్లడించారు. శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేస్తామని, విద్యార్థులు ఈనెల 7 నుంచి 16 వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని, ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. 7 నుంచి 17 వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు. 10 నుంచి 18 వరకు విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని, 19న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 22న సీట్ల కేటాయింపు జరుగుతుందని, 23 నుంచి 26 వరకు విద్యార్థులు అడ్మిషన్ పొందిన కాలేజీలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని వవరించారు. ఆగస్టు 4 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. వెబ్ కౌన్సెలింగ్ సమయంలో విద్యార్థులు ఫీజు చెల్లించిన రశీదు, ఈఏపీసెట్ ర్యాంకు కార్డు, హాల్ టిక్కెట్, పదో తరగతి, ఇంటర్మీడియట్ మార్కుల మెమోలు, 6 నుంచి 12వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు. సందేహాలుంటే 7995681678, 7995865456, 9177927677 హెల్ప్ డెస్క్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నాలుగు యూనివర్సిటీలకు మళ్లీ సెర్చ్ కమిటీలు

- రెండు నెలల్లో వీసీల నియామకానికి చర్యలు

అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నాలుగు యూనివర్సిటీల్లో వైస్ చాన్సలర్ల నియామకానికి ఉన్నత విద్యాశాఖ మళ్లీ సెర్చ్ కమిటీలను నియమించింది. ఆచార్య నాగార్జున, జేఎన్‌టీయూ-విజయనగరం, ద్రవిడియన్, శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీలకు సెర్చ్ కమిటీలు నియమిస్తూ ఆ శాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులిచ్చారు. రెండు నెలల్లో కొత్త వీసీలను నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇంకా తొమ్మిది యూనివర్సిటీల్లో వీసీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్నిటికీ రెండు నెలల్లో కొత్త వీసీలను నియమించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

డీఎస్సీ పరీక్షల ప్రాథమిక 'కీ' విడుదల

అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షలు ముగిసిన నేపథ్యంలో వివిధ సబ్జెక్టుల ప్రాథమిక 'కీ'లను అధికారులు విడుదల చేశారు. పీజీటీ విభాగంలో కామర్స్, ఇంగ్లీష్, హిందీ, ఫిజిక్స్, సంస్కృతం, సోషల్, తెలుగు, స్కూల్ అసిస్టెంట్- ఇంగ్లీష్, ఫిజిక్స్, ఎస్జీటీ- జనరల్, స్పెషల్ హెచ్ హెచ్, వీహెచ్, టీజీటీ- ఇంగ్లీష్, హిందీ, ఫిజిక్స్, సైన్స్(విజ్ఞాన శాస్త్రం), సోషల్, తెలుగు, ఇంగ్లీష్ ప్రొఫిషియన్సీ టెస్ట్, పీఈటీ పరీక్షల ప్రాథమిక 'కీ' విడుదల చేసినట్లు డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లు కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఈనెల 11 వరకు అభ్యర్థులు అభ్యంతరాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. మిగిలిన పరీక్షల ప్రాథమిక 'కీ'ని కూడా త్వరలో విడుదల చేస్తామని తెలిపారు.

ఐచ్ఛిక సెలవు పాఠశాల మొత్తానికీ ఇవ్వాలి: ఫ్యాప్టో

ఐచ్ఛిక సెలవులు పాఠశాల మొత్తానికీ ఇచ్చుకునేలా అవకాశం కల్పించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ప్రభుత్వాన్ని కోరింది. ఐచ్ఛిక సెలవులు పాఠశాలల వారీగా ప్రకటించుకోవడం ఎప్పటి నుంచో ఉందని, కానీ ఇటీవల జగన్నాథ రథయాత్ర సమయంలో ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా పెట్టుకోవాలని సూచించారని తెలిపింది. పండగ అనేది టీచర్లతో పాటు విద్యార్థులకు కూడా సంబంధించిదని, అందువల్ల పాఠశాల మొత్తానికీ ఇవ్వాలని ఫ్యాప్టో చైర్మన్ సాయి శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ చిరంజీవి కోరారు.

పీ-4 అమలుకు చర్యలు తీసుకోవాలి: సీఎస్

అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పీ-4 కార్యక్రమంపై ఈ నెల 6 లోగా జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కార్యచరణ ప్రణాళిక సమావేశాలు పూర్తిచేయాలని సీఎస్ విజయానంద్ ఆదేశించారు. సీఎం చంద్రబాబు శుక్రవారం పీ-4పై సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. సచివాలయం నుంచి ఆయన గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ 'పీ-4, స్వర్ణాంధ్ర ప్రదేశ్-2047పై శిక్షణ, అవగాహన కార్యక్రమాలు పూర్తి చేశాం. ఇకపై కార్యాచరణ ప్రణాళికల అమలుకు చర్యలు తీసుకోవాలి. అన్న క్యాంటీన్ల నిర్వహణపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఆహారం నాణ్యతగా ఉండేలా చూడాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షించాలి. మున్సిపల్ కార్పొరేషన్లలో రోజూ చెత్త సేకరణ, డ్రెయిన్లలో పూడికతీతపై అధికారులు శ్రద్ధ పెట్టాలి. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు కలెక్టర్లు, ఎస్పీలు చర్యలు తీసుకోవాలి' అని సూచించారు.

అన్నం తింటే షుగర్ అపోహే

- చద్దన్నంతో ఆయుర్దాయం పదిలం
- చక్కెర శాతం తక్కువ ఉండే బియ్యం రూపకల్పనకు కృషి
- రంగా వర్సిటీ పరిశోధనా సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ వెల్లడి

గుంటూరు సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అన్నం తింటే షుగర్ స్థాయి పెరుగుతుందనేది కేవలం అపోహ మాత్రమేనని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ తెలిపారు. అన్నంతోపాటు పప్పు, కూరగాయలు, నెయ్యి, మాంసాహారం కలిపి తింటాం కాబట్టి షుగర్ గురించి ఆందోళన అవసరం లేదన్నారు. గురువారం ఆయన యూనివర్సిటీలో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. "బియ్యం రకం, మిల్లు ఆడించే పద్ధతిని బట్టి అన్నంలో గ్లైసెమిక్ ఇండెక్స్ (రక్తంలో చక్కెరస్థాయిని కొలిచే సూచిక) విలువలు మారిపోతాయి. ఉదాహరణకు ముడి బియ్యంలో కంటే ఎక్కువగా చక్కెర స్థాయిలు తెల్ల బియ్యంలో ఉంటాయి. బియ్యం పాలిష్ పట్టే సమయంలో బయటి ఊక పొర తొలగించడం వల్ల చక్కెర శాతం పెరుగుతుంది. దేశవాళీ బియ్యం, ఎర్ర బియ్యంలో అధిక పీచు, పోషకాలు ఉంటాయి. ఈ కారణంగా తక్కువ చక్కెర స్థాయిలు ఉంటాయి. ఏపీలో ఎక్కువగా వినియోగించే సాంబ మసూరిలో కూడా ఇవి తక్కువగానే ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది." అని ఆయన వివరించారు. చద్దన్నం తినడం ద్వారా ఆయుష్షును మరింత పెంచుకోవచ్చునని ఆయన తెలిపారు.

బీపీటీ బియ్యంలో...

చక్కెర శాతం తక్కువగా ఉంటే బియ్యం రకాల రూపకల్పనకు మరిన్ని ప్రయత్నాలు జరగాల్సిన ఆవశ్యకత ఉందని డాక్టర్ పీవీ సత్యనారాయణ తెలిపారు. ఎన్‌జీ రంగా యూనివర్సిటీ నుంచి విడుదలైన బీపీటీ 5204, బీపీటీ 2270, ఎంటీయూ 1224, బీపీటీ 2841 రకాలు తక్కువ చక్కెర స్థాయులను కలిగినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. దేశావళి బియ్యం రకాలైన ఇంద్రాణి, రక్తశాలి కూడా మధ్యస్థంగా చక్కెర స్థాయిలు కలిగిఉన్నట్లు తేలిందని పేర్కొన్నారు.

'ప్రొటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులను అన్నంతో కలిపి తీసుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ విడుదల నెమ్మదిగా జరుగుతుంది. ఫైబర్ ఎక్కువగా ఉండే సజ్జ, జొన్న వంటి చిరుధాన్యాలు, కూరగాయలు, గింజలు తినడం ఉత్తమం. ఆహారంలో ఫైబర్ తీసుకోవడం వల్ల జీర్ణక్రియ నెమ్మదించి చక్కెర స్థాయిలు పూర్తిగా నియంత్రణలో ఉంటాయి. నిమ్మరసం కలిపిన ఆహారం తీసుకోవడం మంచిది."

- డాక్టర్ పీవీ సత్యనారాయణ

5 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 'విద్యాశక్తి'

- ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్లతో 'జూమ్' తరగతులు
- విద్యార్థులకు గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల బోధన

అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు 'విద్యాశక్తి' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్లతో ప్రత్యేక బోధన తరగతులు నిర్వహించేందుకు గతేడాది ఒప్పందం చేసుకుంది. 2024-25లో గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా కొన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం అమలు చేసింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 5వేల పాఠశాలల్లో అమలుకు చర్యలు చేపట్టింది. ఇందులో 4,424 నాన్ రెసిడెన్షియల్, 576 రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. రోజూ బడి ముగిసిన తర్వాత సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు జూమ్ ద్వారా ఆన్‌లైన్‌లో గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధిస్తారు. విద్యార్థుల సందేహాల నివృత్తికి వీలుగా భాషావర ఇబ్బంది లేకుండా తెలుగు ప్రొఫెసర్లను మాత్రమే కేటాయించాలని ప్రభుత్వం కోరింది. కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసం, యోగాపై కూడా తరగతులు నిర్వహిస్తారు. అలాగే 74 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా ఇటీవల విద్యాశక్తి ప్రారంభమైంది. ఎంపీసీ విద్యార్థులకు గణితం, సైన్స్, ఇతర గ్రూపుల విద్యార్థులకు ఇంగ్లిష్ బోధిస్తారు. ఈ కార్యక్రమం కో-ఆర్డినేటర్లుగా నియమితులైన వారికి పాఠశాల విద్యాశాఖ ఇటీవల విజయవాడలో శిక్షణ ఇచ్చింది. విద్యాశక్తితో పదో తరగతి ఫలితాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరంలో కార్యక్రమ ఫలితం ఆధారంగా వచ్చే ఏడాది నుంచి పాఠశాలల సంఖ్యను పెంచనున్నారు.

రాష్ట్రంలో అస్ఫాల్ట్ ఫైబర్ రహదారులు

▸▸ నేడు బనగానపల్లెలో పైలెట్ ప్రాజెక్టు: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రహదారుల మరమ్మతులు, పునర్ నిర్మాణం కోసం అస్ఫాల్ట్ ఫైబర్ టెక్నాలజీని ఉపయోగించబోతున్నట్లు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. డెన్మార్క్, ఆస్ట్రేలియా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాల్లో విజయవంతమైన ఈ టెక్నాలజీని ఆంధ్రప్రదేశ్‌లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. 'నంద్యాల జిల్లా బనగానపల్లి నియోజకవర్గం పరిధిలో ముదిగేడు-సంజామల రహదారి నిర్మాణాన్ని శుక్రవారం డానిష్ అస్ఫాల్ట్ ఫైబర్ టెక్నాలజీతో ప్రారంభిస్తున్నాం. దాని ఫలితాలను బట్టి దశల వారీగా రాష్ట్రంలో ఈ సాంకేతిక పరిజ్ఞానంతో రహదారుల నిర్మాణం, నిర్వహణ చేపడతాం' అని తెలిపారు.

కుట్ర రాజకీయాలకు కేంద్రంగా తాడేపల్లి ప్యాలెస్

▸▸ రాష్ట్ర భవిష్యత్ పాలిట దుష్టశక్తిగా మారిన వైసీపీ: మంత్రి అనగాని

రేపల్లె, జూలై 3(ఆంధ్రజ్యోతి): కుట్ర రాజకీయాలకు కేంద్రంగా తాడేపల్లి ప్యాలెస్ మారిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. గురువారం బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం కూచినపూడి గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు, ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో తీవ్రవాదాన్ని ప్రేరేపించేలా జగన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. యువకులను తీవ్రవాదులుగా మార్చేలా రెచ్చగొడుతున్నారు. రాష్ట్ర భవిష్యత్తు పాలిటి దుష్టశక్తులుగా మారిన వారిని ఖచ్చితంగా అడ్డుకుంటాం. కుట్రలు, కుతంత్రాలు చేసే జగన్ బుద్ధి ఇంకా మారలేదు' అని మంత్రి అనగాని విమర్శించారు.

జగన్ యాత్ర... వర్క్ ఫ్రమ్ ఓదార్పులా ఉంది: అనిత



విజయనగరం, జూలై 3(ఆంధ్రజ్యోతి): 'ఒక వ్యక్తి చనిపోతే వాళ్ల ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చాలి. కాని జగన్ చేస్తున్న ఓదార్పు ఏంటో అర్థం కావడం లేదు. వర్క్ ఫ్రమ్ ఓదార్పు యాత్రలా ఆయన పరిస్థితి ఉంది' అని హోం మంత్రి వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు. స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రణాళిక, పీ 4 కార్యక్రమాలపై సమీక్షించేందుకు గురువారం విజయనగరం జిల్లాకు వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. 'జగన్‌కు జడ్ ప్లస్ సెక్యూరిటీ ఇస్తున్నాం. బుల్లెట్ ప్రూఫ్ కారు ఇచ్చాం. అయినా జడ్‌ప్లస్ సెక్యూరిటీ ఇవ్వలేదని చెప్పడం సరికాదు. వైసీపీ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు' అని అనిత అన్నారు.

పార్టీలకు అతీతంగా మహిళలకు అండ

▸▸ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ


ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వన్‌స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న శైలజ

ఏలూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా మహిళలకు అండగా ఉంటామని, బాలికలకు, మహిళలకు అన్యాయం జరగకుండా చూడటమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. మహిళలకు అన్యాయం చేసిన దోషులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. సోషల్ మీడియాలో మహిళలను అసభ్యంగా చిత్రీకరించే వారిని ఉపేక్షించేది లేదని చెప్పారు. ఏలూరు జిల్లాలో గురువారం ఆమె విస్తృతంగా పర్యటించారు. హనుమాన్ జంక్షన్‌లో శక్తిసదన్‌ను, ముసునూరులో గురుకుల పాఠశాలను పరిశీలించారు. వాటి అభివృద్ధికి సూచనలు చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని వన్ స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేశారు.

గుంటూరు జిల్లాలో 100 పడకల ఆయుష్ ఆసుపత్రి

▸▸ నిర్మాణానికి 94 కోట్లు మంజూరు: కేంద్ర మంత్రి పెమ్మసాని

న్యూఢిల్లీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో యోగా, సహజ చికిత్స పరిశోధనా సంస్థతోపాటు వంద పడకల ఆస్పత్రి, సిబ్బంది నివాస సముదాయానికి కేంద్రం 94కోట్లు మంజూరు చేసిందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో 15 ఎకరాల్లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే ఈ కేంద్రానికి పూర్తి వ్యయం కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని పెమ్మసాని పేర్కొన్నారు.

జగన్ ఏ ముఖం పెట్టుకొని పాదయాత్ర చేస్తారో!: అచ్చెన్న

టెక్కలి, జూలై 3(ఆంధ్రజ్యోతి): 'ఇచ్చిన హామీలు అమలు చేయలేని వైసీపీ అధినేత జగన్... పాదయాత్ర పేరిట ఏ మొఖం పెట్టుకొని ప్రజల వద్దకు వెళ్తాడో చెప్పాలి' అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం రాత్రి శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం చాకిపల్లిలో 'సుపరిపాలనలో తొలి అడుగు'లో మంత్రి మీడియాతో మాట్లాడారు. 'జగన్‌ది కర్కోటక మనస్తత్వం. అతని వాహనం కింద ఓ కార్యకర్త పడి మృతి చెందినా పట్టించుకోని వ్యక్తి రాష్ట్రానికి అవసరమా?' అని అచ్చెన్న ప్రశ్నించారు.



జగన్‌ను కలిసిన వంశీ

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సతీసమేతంగా వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ను కలిశారు. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో నూజివీడు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయన బుధవారం విజయవాడ జిల్లా జైలు నుంచి విడుదయ్యారు. జైలు నుంచి గన్నవరంలోని ఇంటికి చేరుకున్న వంశీ గురువారం భార్య పంకజశ్రీతో కలిసి తాడేపల్లిలోని జగన్ ఇంటికి వెళ్లారు. వంశీ ఆరోగ్య పరిస్థితి గురించి జగన్ ఆరా తీశారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

దిద్దుబాటుకు తొలి అడుగు!

(మొదటి పేజీ తరువాయి)

'తొలి అడుగు'కు రూపకల్పన చేశారు. 2019 ఎన్నికల నాటి పరిస్థితి 2029లో పునరావృతం కాకూడదన్న లక్ష్యంతో ఇప్పటి నుంచే అడుగులు వేస్తున్నారు. 2019 ఎన్నికల్లో నాటి టీడీపీ ఎమ్మెల్యేల పని తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. 'చంద్రబాబు ముద్దు.. ఎమ్మెల్యేలు వద్దు' అని ప్రజలు భావించడంతో.. చంద్రబాబు పట్ల సానుకూలత ఉన్నా, ఎమ్మెల్యేలపై వ్యతిరేకత కారణంగా టీడీపీ ఘోరపరాజయాన్ని చవిచూసింది. ఈ పరిస్థితి మళ్లీ రాకుండా అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నుంచే ఆయన దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నారు. టీడీపీకి చెందిన కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలపై తీవ్ర స్థాయిలో అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. కొందరు ఎమ్మెల్యేలు నియోజకవర్గ కేంద్రాల్లోనే ఉండని పరిస్థితి. మరికొందరు సెటిల్‌మెంట్లు, నెల వారీ వసూళ్ల దందాల్లో మునిగితేలుతున్నారు. మద్యం షాపులు, రేషన్ షాపుల నుంచి కూడా వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీరికి సంబంధించిన నివేదికలన్నీ తెప్పించుకుంటున్న చంద్రబాబు ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేలను హెచ్చరిస్తూ వస్తున్నారు. 'ప్రతి ఆరు నెలలకోసారి ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు చేసి నివేదికలు తెప్పించుకుంటున్నా. మంచి చేస్తే అభినందిస్తా. ప్రోత్సహిస్తా. తప్పు చేస్తే మాత్రం దూరం పెడతా. అవసరమైతే వదులుకుంటా' అని పార్టీ సమావేశాల్లో సీఎం స్పష్టంగా చెబుతున్నారు. అయినా చాలా మంది ఎమ్మెల్యేల తీరు మారడం లేదు. ప్రభుత్వం ఎంత కష్టపడుతున్నా.. ఎన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నా.. ఎమ్మెల్యేల తీరుతో అవన్నీ బూడిదలో పోసిన పన్నీరుగా మారుతున్నాయని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాలంటే ప్రజాప్రతినిధులను జనంలోకి పంపడం సత్ఫలితాలను ఇస్తుందని భావించిన టీడీపీ పెద్దలు, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా చేపట్టిన తొలి అడుగు కార్యక్రమాన్ని దానికి మార్గంగా ఎంచుకున్నారు. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం కూటమి ప్రభుత్వం సాధించిన ఏడాది విజయాలను ప్రజలకు వివరించడమే అయినా.. దారి తప్పుతున్న పార్టీ ప్రజాప్రతినిధులను సరిదిద్దడాన్ని మరో లక్ష్యంగా చంద్రబాబు నిర్దేశించుకున్నారు. దీనికి ప్రజాప్రతినిధులను జనం బాట పట్టించడం ఒక్కటే మార్గంగా ఎంచుకున్నారు. ప్రజాప్రతినిధులు జనంలోకి వెళ్లడం ద్వారా ప్రజాసమస్యలపై దృష్టి సారిస్తారని, తద్వారా వారిపై వ్యతిరేకత కాస్తయినా తగ్గుముఖం పడుతుందన్నది చంద్రబాబు ఆలోచనగా ఉంది. తొలి అడుగు కార్యక్రమం ప్రారంభించిన తొలిరోజు బుధవారం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో పాటు టీడీపీకి చెందిన 20మంది మంత్రులూ పాల్గొన్నారు. వీరితో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేల్లో 80 శాతం మంది తొలి అడుగులో భాగస్వాములయ్యారు.

పక్కాగా పర్యవేక్షణ!

తొలి అడుగు కార్యక్రమం విషయంలో చంద్రబాబు చాలా నిక్కచ్చిగా ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎలా చేపట్టాలనే విషయాన్ని పార్టీ శ్రేణులకు వివరించేందుకు జూన్ 29న పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించి దిశానిర్దేశం చేశారు. తనతో మొదలు గ్రామస్థాయిలోని కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ నెలరోజుల పాటు ప్రజలతోనే ఉండాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజలకు అందుబాటులో ఉంటే ఆదరిస్తారని లేకుంటే టాటా చెప్పేస్తారని, అందుకే నెలరోజుల పాటు ప్రతి ఒక్కరూ జనంతో మమేకమవ్వాలని ఆదేశించారు. కార్యక్రమం ప్రారంభమైన బుధవారం (జూలై 2) నుంచి ఏ రోజుకా రోజు ఎవరు, ఎక్కడ తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారో నివేదికలు తెప్పించుకుంటున్నారు. కొందరు ఎంపీలు, ఎమ్మెల్యేలు తానా సభలకు వెళ్లడంతో వారు మినహా మిగిలిన వారంతా తొలిఅడుగులో పాల్గొనాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. తానా సభలు 5వ తేదీతో ముగియనుండటంతో వెనువెంటనే వారు కూడా రాష్ట్రానికి వచ్చి తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనాలని ఇప్పటికే సమాచారం పంపారు. మంత్రులు, ఎమ్మెల్యేలను అత్యవసరమైతే తప్ప పార్టీ కార్యాలయానికి కూడా రావద్దని తెలిపారు. మంత్రులకు శాఖాపరమైన సమీక్షల నుంచి మినహాయింపు ఇచ్చారు. వీటన్నిటి ద్వారా తొలి అడుగు విషయంలో తాను చాలా నిక్కచ్చిగా ఉన్నానన్న సంకేతాలను చంద్రబాబు పార్టీ శ్రేణులకు పంపుతున్నారు.


కుప్పంలో టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రి సత్యకుమార్, ఐఏఎస్ కృష్ణబాబు



రాజకీయాల్లో చీడపురుగులు!

వైసీపీ బ్యాచ్ రాష్ట్రానికే పెనుసవాల్‌గా మారారు: సీఎం చంద్రబాబు

శాంతిపురం, జూలై 3(ఆంధ్రజ్యోతి): 'తప్పుడు ప్రచారం తాత్కాలికం.. చేసిన పనే శాశ్వతం. గతంలో నేనెప్పుడూ ఫేక్ ఫెలోస్‌తో రాజకీయం చేయలేదు. వీళ్లు ఫేక్. అవాస్తవాన్ని వాస్తవం చేయడానికి ప్రయత్నం చేస్తారు. సింగయ్య మరణం, వివేకానందరెడ్డి హత్య విషయంలో వీళ్ల శవరాజకీయాలు అందరికీ తెలిసింది' అని వైసీపీ బ్యాచ్ తీరుపై సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. వీళ్ల రాజకీయాలకు చీడపురుగులుగా.. రాష్ట్రానికే ఓ పెనుసవాల్‌గా తయారయ్యారని మండిపడ్డారు. వీళ్లంతా కరుడుగట్టిన నేరస్థులని.. ఆర్థిక ఉగ్రవాదులని.. వీళ్లు చేసిన నేరాలు మామూలు రౌడీలు చేసి ఉంటే రెండు నిమిషాల్లో కుక్కను కొట్టినట్లు కొట్టి లోప లేసేవాళ్లమని స్పష్టంచేశారు. సొంత నియోజకవర్గం కుప్పంలో వరుసగా రెండోరోజు గురువారం ఆయన పర్యటించారు. ఉదయం శాంతిపురం మండలం కడపల్లెలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదని పునరుద్ఘాటించారు. వందేళ్ల నుంచి గోదావరిలో ఏటా సగటున 3 వేల టీఎంసీల నీళ్లు సముద్రంలోకి వెళ్లిపోతున్నాయని.. ఆ నీటిలో 200 టీఎంసీలు వాడుకుంటే తెలుగు ప్రజలు బాగుపడతారన్నారు. తెలంగాణలో గోదావరిపై నిర్మించిన ప్రాజెక్టులను తానెప్పుడూ వ్యతిరేకించలేదని.. వ్యతిరేకించనని తేల్చిచెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు, పల్ప్ పరిశ్రమల యజమానులతో సమావేశమై వారి డిమాండ్లువిన్నారు. అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. డిమాండ్‌కు తగ్గ పంటలను సాగు చేయాలని, అంతర్జాతీయ ప్రమాణాలతో మామిడిని పండించాలని సూచించారు. పరిశ్రమల సామర్థ్యానికి తగినట్లు మామిడి కాయలు కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని యజమానులను కోరారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

ఫ్రీహోల్డ్‌పై తొందరపడం..

గత ప్రభుత్వ పాలనలో రెవెన్యూ రికార్డులు తారుమారు చేశారు. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో తొందరపడి నిర్ణయాలు తీసుకుంటే సమస్య మరింత జటిలమైపోతుంది. నాకు 10 అర్జీలు వస్తే 7-8 అర్జీలు భూ సమస్యలవే. అంతలా నాశనం చేశారు. ఈ భూముల విషయంలో ఎలాంటి సమస్య రాకుండా క్లియర్‌గా సెటిల్ చేస్తాం. పీ-4లో భాగంగా బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా సాయం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొస్తుంటే.. దోచుకోవడం తప్ప ఖర్చు పెట్టడం తెలియని వాళ్లు విమర్శిస్తున్నారు. ఇలాంటి వారితో మనం రాజకీయం చేయాల్సి వస్తోంది. నిన్న తిమ్మరాజుపల్లెలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని చేపడితే తమ గ్రామంలోని కుటుంబాలను ఆదుకుంటామని ఓ కుటుంబం ముందుకొచ్చింది.

మామిడి రైతులకు 250 కోట్ల సబ్సిడీ..

ధరలు పతనమై ఇబ్బంది పడుతున్న మామిడి రైతులను ఆదుకునేందుకు ఎన్నడూ ఇవ్వని విధంగా సబ్సిడీ రూపంలో రూ.200 నుంచి రూ.250 కోట్ల వరకు అందిస్తున్నాం. 2018లో ఓసారి ఇచ్చాం. ఇప్పుడు రెండోసారీ ఇస్తున్నాం. అప్పట్లో రాయలసీమకు అనుకూలమైన పంట కావడంతో మామిడిని ప్రమోట్ చేశాం. ఈసారి దిగుబడులు ఎక్కువ కావడంతో ధరలు పతనమై రైతులు ఇబ్బంది పడుతున్నారు. మామిడి సాగు తగ్గించాలని చెప్పేటప్పుడు దానిస్థానంలో ఏ పంట వేయాలో కూడా చెప్పగలగాలి. ఇక్కడ ఫ్యాక్టరీల సిండికేట్ అనేది ప్రధాన సమస్య కాదు. ప్రభుత్వం తరపున సబ్సిడీ ఇస్తున్నా.. వాళ్లు కొనలేకపోతున్నారంటే పరిస్థితి అర్థంచేసుకోవచ్చు. మామిడికి ధర కల్పించలేదని విమర్శిస్తున్న వాళ్లు ఎప్పుడైనా రూపాయి సబ్సిడీ ఇచ్చారా? డ్రిప్‌ఇరిగేషన్ ఇచ్చారా? హంద్రీ-నీవాకు నిధులిచ్చారా? మామిడి రైతులకు సాయం చేయకుండా ఫ్యాక్టరీలతో కుమ్మక్కై కమీషన్లు తీసుకుంటున్నారు. ఇప్పటికే 60 శాతం కోత పూర్తయింది. త్వరలోనే రైతుల ఖాతాల్లో సబ్సిడీ డబ్బులు వేస్తాం.

'తొలి అడుగు'ను ప్రజల్లోకి తీసుకెళ్లండి..

టీడీపీ కార్యకర్తలతోనూ సీఎం సమావేశమయ్యారు. సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి బాగా తీసుకెళ్లాలని సూచించారు. గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడినవారికి ప్రాధాన్యమిస్తామన్నారు. త్వరలో లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం సాయంత్రం 5.10 గంటలకు హెలికాప్టర్‌లో సీఎం అమరావతికి తిరుగుపయనమయ్యారు.

కుప్పం ఆస్పత్రిలో డిజిటల్ నెర్వ్ సెంటర్

▸▸ ప్రారంభించిన సీఎం, మంత్రి సత్యకుమార్

కుప్పం, జూలై 3(ఆంధ్రజ్యోతి): రోగుల వైద్య రికార్డులను ఆస్పత్రులకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానం చేసే తొలి డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌తో కలిసి గురువారం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఈ సెంటర్ ద్వారా రోగుల వైద్య రికార్డులను ఆసుపత్రులు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో అనుసంధానించారు. తద్వారా కుప్పంలోని 13 వైద్య ఆరోగ్య కేంద్రాలు అనుసంధానమయ్యాయి. రెండో దశలో చిత్తూరు జిల్లాలోని అన్ని పీహెచ్‌సీ కేంద్రాలనూ అనుసంధానించనున్నట్లు సీఎం చెప్పారు.

పార్కు స్థలం పాయె

▸▸ విశాఖలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేశారు

▸▸ రోడ్డు కనెక్టివిటీ లేని స్థలాన్ని జీవీఎంసీకి ఇచ్చి పార్కు స్థలం కొట్టేసిన వైనం

▸▸ కోట్లు చేతులు మారినట్టు ఆరోపణలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూర్చేందుకు, వారి భూమి విలువ పెరిగేందుకు విశాఖపట్నంలో ఏకంగా జీవీఎంసీ పార్కు స్థలాన్ని కట్టబెట్టేశారు. ఇందుకు కూటమి నేతలు, అధికారులు సహకరించారు. జీవీఎంసీజోన్-2 ఆరో వార్డు పరిధి సర్వే నం.193/1పీలోని 11.36 ఎకరాల్లో వుడా అప్రూవుడ్ లే అవుట్ వేశారు. ఓపెన్ స్పేస్ కింద 1.02 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. లే అవుట్‌లోని అన్ని ప్లాట్లలో ప్రస్తుతం భవన నిర్మాణాలు జరిగిపోయాయి. ఓపెన్ స్పేస్ కింద కేటాయించిన 1.02 ఎకరాల్లో జీవీఎంసీ బటర్‌ఫ్లై థీమ్ పార్కు నిర్మించేందుకు 2021లో రూ.1.92 కోట్లు వెచ్చించింది. పార్కుకు తూర్పువైపున 30 అడుగుల రోడ్డు ఉంది. పార్కుకు వాయవ్య దిశలో ప్రైవేటు వ్యక్తులకు చెందిన సుమారు 2ఎకరాలు ఉంది. ఆ భూమికి, రోడ్డుకు మధ్యలో పార్కు ఉంది. దీంతో జిరాయితీ భూమికి రోడ్డు సదుపాయం లేక నిరుపయోగంగా ఉండిపోయింది. పార్కు ఈశాన్యం వైపు భాగాన్ని తమకు ఇచ్చేస్తే.. అందుకు ప్రతిగా తమ భూమిలో స్థలం ఇస్తామని యజమానులు ముందుకొచ్చారు. తమ భూమికి రోడ్డు కనెక్టివిటీ ఏర్పడి విలువ పెరుగుతుందని భావించారు. అనుకున్నదే తడవుగా గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన నేతను ప్రసన్నం చేసుకుని జీవీఎంసీ పార్కు స్థలం బదలాయింపు కోరుతూ ప్రభుత్వానికి పిల్లా లక్ష్మణపాత్రుడు, పోతిన అప్పారావు అనే వ్యక్తుల పేరుతో దరఖాస్తు చేయించారు. మంత్రి హోదాలో ఉన్న నేత ఒత్తిడి చేయడంతో జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో పెట్టి పార్కు స్థలంలో ఈశాన్యం వైపు ఉన్న 489.39 చదరపు గజాల స్థలాన్ని దరఖాస్తుదారులకు బదలాయించేందుకు, ప్రతిగా వారి భూమిలోని అంతే స్థలాన్ని తీసుకునేందుకు ఆమోదం తెలుపుతూ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించింది. దీనిపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టులో పిల్ వేయడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. జీవీఎంసీ చేసిన తీర్మానాన్ని, పంపిన ప్రతిపాదనలను కూటమి ప్రభుత్వం తిరస్కరిస్తూ గత సెప్టెంబరులో మెమో జారీ చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్కు స్థలం బదలాయింపు ప్రతిపాదనను తిరస్కరించడంతో దరఖాస్తుదారులు నగరానికి చెందిన ఒక ప్రజాప్రతినిధి ద్వారా మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించారు. ఇరువర్గాల మధ్య అవగాహన కుదరడంతో భూ బదలాయింపు పూర్తిచేయాలంటూ మంత్రిని ఆశ్రయించారు. సదరు మంత్రి పార్కు స్థలం బదలాయింపు చేయాలని సిఫారసు చేశారు. దీంతో మే 13న పార్కు స్థలం బదలాయింపునకు ఆమోదం తెలపడంతో పాటు అందుకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తూ మెమో జారీ చేశారు. ఇదిలా వుండగా భూ బదలాయింపునకు జీవీఎంసీకి కౌన్సిల్ తీర్మానం తప్పనిసరి. గతంలో కూడా అదే ప్రక్రియను అనుసరించారు. కానీ తాజాగా కౌన్సిల్ ఆమోదం లేకుండానే భూ బదలాయింపునకు ఆమోదించడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంలో రూ.కోట్లు చేతులు మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


విశాఖలోని మధురవాడలో బటర్‌ఫ్లై పార్కు వెనుక ఉన్న ప్రైవేటు స్థలం

కూటమి నాయకులతో కలసి పనిచేస్తా

▸▸ ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్రాభివృద్ధికి కృషి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్


మాధవ్‌కు గజమాలతో సత్కారం

విశాఖపట్నం, జూలై 3(ఆంధ్రజ్యోతి): 'అధిష్ఠానం నన్ను గుర్తించి కీలక బాధ్యతలు అప్పగించింది. ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్రాభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేస్తా' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. అధ్యక్షునిగా నియమితులయ్యాక గురువారం సాయంత్రం నగరానికి చేరుకున్న ఆయనకు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, సెయిల్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు, విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షుడు పరశురామరాజు, బీజేపీ కార్యకర్తలు విమానాశ్రయం వద్ద ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ... 'కూటమి పార్టీల నాయకులతో కలసి పనిచేస్తా. బీజేపీకార్యకర్తలకు సముచిత స్థానం లభించేలా ప్రయత్నిస్తా' అని అన్నారు.

వైసీపీ పాలనలో 'లిఫ్టు'లపై నిర్లక్ష్యం: నిమ్మల

పోలవరం/రాజమహేంద్రవరం, జూలై 3(ఆంధ్రజ్యోతి): గతంలో టీడీపీ పాలనలో 1,040 లిఫ్టుల ద్వారా సాగు నీరందిస్తే, వైసీపీ పాలనలో నిర్వహణ లేకపోవడం వల్ల 450 లిఫ్టులు మూలన పడ్డాయని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. వైసీపీ నిర్లక్ష్యంతో 4 లక్షల ఎకరాల ఆయకట్టును సాగు చేయకుండా వదిలేయాల్సి వచ్చిందన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి ఆయన గురువారం పూజలు నిర్వహించి మోటార్ స్విచ్ ఆన్ చేశారు. అనంతరం తాడిపూడి ఎత్తిపోతల జలాలను విడుదల చేశారు. ఇటుకలకోట సమీపంలో పట్టిసీమ పథకం వద్ద విడుదలవుతున్న జలాలకు పూజలు నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లాలో ఐదేళ్లకుపైగా మూలనపడి ఉన్న పురుషోత్తపట్నం పథకం నుంచి పుష్కర కాలువకు నీటిని విడుదల చేశారు.

'రెవెన్యూ' రచ్చ

(మొదటి పేజీ తరువాయి)

కూడిన పాసుపుస్తకాలను రైతులకు అంటగట్టారు. ఈ సమస్యలు సరిపోవని వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చారు. అందులోని అంశాలతో రైతులు బెంబేలెత్తిపోయారు. ఇలా జగన్ జమానాలో రైతులు, భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ అసైన్డ్ భూముల చట్టం-1977(పీవోటీ యాక్ట్)ను సవరించిన జగన్ సర్కారు, 20 ఏళ్ల అసైన్‌మెంట్ కాలపరిమితి దాటిన భూములను నిషేధ జాబితా 22(ఏ) నుంచి తొలగించి స్వేచ్ఛ కల్పిస్తామని (ఫ్రీ హోల్డ్), వాటిపై శాశ్వత హక్కులు కల్పిస్తామని ఆదేశాలు (జీవో 596) ఇచ్చింది. దీన్ని అడ్డంపెట్టుకొని 13.80 లక్షల ఎకరాలను నిషేధ జాబితా నుంచి తొలగించారు. ఇక, 5.75 లక్షల ఎకరాలను చట్టవిరుద్ధంగా, జీవో 596ని ఉల్లంఘించి మరీ ఫ్రీహోల్డ్ చేశారు. ఇందులో 2.65 లక్షల ఎకరాల భూమికి అసైన్‌మెంట్ రికార్డు లేకున్నా నిషేధ జాబితా నుంచి తొలగించారు. అడ్డగోలుగా 22(ఏ) నుంచి తొలగించిన భూముల్లో ఇనాం, గ్రామ కంఠం, చుక్కల భూములు, షరతుగల పట్టా భూములు ఉన్నాయి. ఇందులో వైసీపీ నేతల కబంధ హస్తాల్లో ఉన్న భూములే సింహభాగం ఉన్నాయని అధికారవర్గాల అంచనా. ఈ సమస్యలే జగన్ అధికారానికి పాతరేశాయి. తాము అధికారంలోకి వస్తే ప్రజల భూ సమస్యలను పరిష్కరిస్తామని నాడు కూటమి నేతలు హామీ ఇచ్చారు.

వడివడిగా మొదలై...

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వంలో జరిగిన భూదందాలు, ఘోరాలపై శ్వేతపత్రం విడుదల చేశారు. ఇచ్చిన మాట మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేశారు. దీంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. రీసర్వేతో వచ్చిన సమస్యలను కూడా పరిష్కరిస్తారని ఎదురుచూశారు. ఇంతలో ఫ్రీ హోల్డ్ అయిన అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లను సర్కారు గత ఆగస్టులో నిలిపివేసింది. అసైన్డ్ అక్రమాలపై విచారణకు ఆదేశించింది. 3 నెలల్లో విచారణ పూర్తిచేయాలని రెవెన్యూ శాఖను ఆదేశించింది. అక్రమాలు ఏ మేరకు జరిగాయో విచారణలో తేలింది. 13.80 లక్షల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేస్తే, అందులో 5.75 లక్షల ఎకరాలను అక్రమంగా, చట్టవిరుద్ధంగా నిషేధజాబితా నుంచి బయటపడేశారని గుర్తించారు. ఏఏ స్థాయిలో నిబంధనల ఉల్లంఘన, చట్టవిరుద్ధమైన పనులు జరిగాయో రెవెన్యూశాఖ గత ఏడాది డిసెంబరు నెలాఖరు కే నిర్ధారించింది. కానీ ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ భూములపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

నాన్చుడే..

అసైన్డ్ అక్రమాలు నిర్ధారణయిన తర్వాత బాధ్యులైన నేతలు, అధికారులు, కబ్జాకోరులపై సర్కారు చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఈ దిశగా చర్యలు లేవు. అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి గత ఏడాది డిసెంబరులో జరిగిన కలెక్టర్ల సమావేశంలో రెవెన్యూశాఖను ఆదేశించారు. 8 నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకు టాస్క్‌లేదు...ఫోర్స్ కూడా లేదు. దీంతో అసైన్డ్ అక్రమాలకు పాల్పడిన కబ్జాదారులు, తప్పులు చేసిన అధికారులు సేఫ్‌గా ఉన్నారు. ఇక మాకేం కాదన్న ధీమాలోకి వెళ్లిపోయారు. కనీసం ఈ ఏడాది మార్చి నెలనాటికయినా ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్‌లపై సర్కారు నిర్ణయం తీసుకుంటుందన్న సానుకూల ప్రచారం జరిగింది. అందుకు భిన్నంగా ప్రభుత్వం ఈ విషయంపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఉపసంఘం ఇప్పటి వరకు మూడుసార్లు భేటీ అయింది. జిల్లా కలెక్టర్ల సమావేశాలు, ఇతర సమీక్షా సమావేశాల్లో ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాలపై చర్చ తప్ప నిర్దిష్టమైన నిర్ణయాలు తీసుకోలేదు. ఫ్రీ హోల్డ్ భూములపై సత్వరమే నిర్ణయం తీసుకోవాలని అప్పటి రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా తొలి భేటీలోనే కీలక నివేదిక ఇచ్చారు. ఒక వేళ ఫ్రీహోల్డ్ విధానం కొనసాగించవద్దని భావిస్తే ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కానీ ఉపసంఘం ఎలాంటి క్రియాశీల నిర్ణయం తీసుకోలేదు. ఫ్రీ హోల్డ్‌నే కొనసాగించాలనుకుంటే ఎలాంటి భూములను నిషేధ జాబితా నుంచి తొలగించాలి? ఆ భూముల రికార్డులను ఎలా పరిశీలన చేసి నిర్ధారించాలి? ఇప్పటిదాకా అక్రమాలు జరిగాయని నిర్ధారించిన భూముల విషయంలో ఏ నిర్ణయం తీసుకోవాలనే అనేక ప్రతిపాదనలు ఉపసంఘం ముందుకొచ్చినా ఏ నిర్ణయమూ తీసుకోలేదు. దీంతో ఉపసంఘం భేటీలు ప్రజలను ఉసూరుమనిపించేలా మారాయన్న విమర్శలు వస్తున్నాయి. వచ్చే ఆగస్టు 5 నాటికి ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేసి ఏడాదవుతుంది. ఇప్పుడు ఇంకా నాన్చుతూనే ఉన్నారు. ఇది ఇలాగే కొనసాగితే ప్రజల్లో అసహనం పెరిగి, తీవ్ర వ్యతిరేకతకు దారితీయొచ్చని కూటమి వర్గాలే చెబుతున్నాయి.

పేదల్లో ఆందోళన

ఫ్రీ హోల్డ్ భూముల్లో అక్రమాలు జరిగినవి ఏమిటో లెక్క తేలింది. ఇందులో కబ్జాదారులు, నేతల పాత్ర ఉన్న భూములపై కూడా స్పష్టత వచ్చింది. అక్రమంగా నిషేధ జాబితా నుంచి తొలగించిన భూములను పక్కనపెట్టి, అసలైన హక్కుదారుల వద్ద ఉన్న భూములకు స్వేచ్ఛ కల్పించాలని పార్టీలు, ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. నిషేధ విముక్తి కోరుతూ శాశ్వత హక్కులు అడుగుతున్న రైతుల విన్నపాలు నిజమైనవో కావో తేల్చడానికి రెవెన్యూ శాఖకు పెద్ద సమయం పట్టదు. ఇందుకు అసైన్‌మెంట్ రికార్డులను పరిశీలిస్తే సరిపోతుంది. ఆ మేరకు నిజమైన అసైనీల భూములకు చట్టప్రకారం ఫ్రీహోల్డ్ అయ్యే అవకాశాన్ని కల్పించాలని రైతులు కోరుతున్నారు. అక్రమాలతో ముడిపడిన భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని, అర్హులైనవారి భూములకు స్వేచ్ఛ కల్పించాలని అభ్యర్థిస్తున్నారు. ఉపసంఘం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ప్రచారం ఉన్నా అది కార్యరూపం దాల్చడం లేదు.

ఆదేశాలు ఎందుకు అమలు కాలేదు?

▸▸ ఆరా తీయనున్న సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి రెవెన్యూశాఖపై శుక్రవారం నిర్వహించే సమావేశంలో ఫ్రీహోల్డ్ అంశం చర్చకు రానుంది. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు తానిచ్చిన ఆదేశాల అమలు ఇప్పటి వరకు కార్యరూపం దాల్చకపోవడం, నేటికీ రైతులకు కొత్త పాస్‌పుస్తకాలు అందించకపోవడం వంటి అంశాలపై ఆయన ఆరా తీయనున్నారు. నిజానికి రైతులకు మే నాటికే జగన్ బొమ్మలు లేని, రాజముద్ర కలిగిన పాస్‌పుస్తకాలు అందిస్తామని రెవెన్యూశాఖ హామీ ఇచ్చింది. కానీ వాయిదాపడుతూ వస్తోంది. జగన్ బొమ్మ ఉన్న పాస్ పుస్తకాలను మార్పిడి చేయకపోవడంతో రైతులకు బ్యాంకుల్లో పంట రుణాలు దొరకడం గగనంగా మారింది. సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారనే ప్రశ్నకు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పొంతనలేని సమాధానం ఇస్తున్నారు.

భూదస్త్రాలను పెద్దిరెడ్డికి అందజేయండి

- బుగ్గమఠం ఈవోకు హైకోర్టు ఆదేశం
- ఈవోతో కాకుండా మరో అధికారితో విచారణ జరపండి.. అధికారులకు ధర్మాసనం నిర్దేశం
- నాలుగు వారాల్లో నిర్ణయం వెల్లడించాలని స్పష్టీకరణ



అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి, ఎంఆర్ పల్లి పరిధిలోని సర్వే నెంబర్లు 261/1లోని 1.50 ఎకరాలు, 261/2లోని 2.38 ఎకరాలకు సంబంధించిన భూదస్త్రాలను వారం రోజుల్లో వైసీపీ నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అందజేయాలని తిరుపతి బుగ్గ మఠం అసిస్టెంట్ కమిషనర్/ఈవోను హైకోర్టు ఆదేశించింది. అధికారులు దస్త్రాలు అందజేసిన తర్వాత వివరణ ఇచ్చుకొనేందుకు పెద్దిరెడ్డికి వెసులుబాటు ఇచ్చింది. ఆ తరువాత పెద్దిరెడ్డి ఆధీనంలో ఉన్న భూముల విషయంలో విచారణ జరిపి నాలుగు వారాల్లో నిర్ణయం వెల్లడించాలని అధికారులకు స్పష్టం చేసింది. బుగ్గమఠం ఈవోతో కాకుండా మరో అధికారితో విచారణ ప్రక్రియ చేపట్టాలని నిర్దేశించింది. ట్రైబ్యునల్‌కు వెళ్లాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. ఆ భూములను పెద్దిరెడ్డి ఆక్రమించారని నిర్ధారిస్తూ, వాటిని ఖాళీ చేయాలంటూ బుగ్గమఠం అసిస్టెంట్ కమిషనర్/ఈవో మే 16న ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఆ ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ పెద్దిరెడ్డి మే 22న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, దేవదాయ అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాలని, అభ్యంతరాలన్నింటినీ ట్రైబ్యునల్ ముందు లేవనెత్తాలని హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశించారు. ఈ ఉత్తర్వులను ద్విసభ్య ధర్మాసనం ఎదుట పెద్దిరెడ్డి సవాల్ చేశారు. గురువారం ఆ పిటిషన్ విచారణకు వచ్చింది. పెద్దిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి.. రాష్ట్ర ప్రభుత్వం, బుగ్గమఠం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం దస్త్రాలను వారం రోజుల్లో పెద్దిరెడ్డికి అందజేయాలని బుగ్గమఠం ఈవోను ఆదేశించింది.

మద్యం స్కాం నిందితుల బెయిల్ పిటిషన్లు వాయిదా

విజయవాడ, జూలై 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నిందితులు దాఖలు చేసిన బెయిల్‌పిటిషన్లపై విచారణను ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. పైలా దిలీప్ బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగియడంతో తీర్పును శుక్రవారానికి వాయిదా వేస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులిచ్చారు. సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ వేయాలని ప్రాసిక్యూషన్‌ను ఆదేశిస్తూ విచారణను ఈనెల 8కి వాయిదా వేశారు. బాలాజీ గోవిందప్ప బెయిల్ పిటిషన్‌పై ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను 8కి వాయిదా వేశారు.

చెవిరెడ్డి చిందులు

- ప్రశ్నలు వేస్తే ఎదురు దాడి ఆధారాలు చూపితే ఆగ్రహం
- మూడురోజుల సిట్ విచారణలో వైసీపీ నాయకుడి వింత ప్రవర్తన
- తానే ప్రశ్నిస్తూ.. వార్నింగ్ ఇస్తూ హల్‌చల్
- మీ సంగతి తేలుస్తా..అందరి చరిత్ర తెలుసు.. మా ప్రభుత్వం రాగానే ఎవరినీ వదలిపెట్టను
- మద్యం ముట్టని నాపై లిక్కర్ కేసా?
- నన్ను ప్రశ్నించమన్నది ఎవరంటూ ఫైర్
- అదంతా వీడియోతీసిన సిట్ అధికారులు
- ఏసీబీ కోర్టుకు సమర్పించే అవకాశం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మద్యం కుంభకోణంలో అరెస్టయిన వైసీపీ నాయకుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పోలీసుల్నే బెదిరిస్తున్నారు. అరెస్టు నుంచి కస్టడీ దాకా... రిమాండ్‌లో ఉన్నప్పుడూ ఆయన బెదిరింపులకు దిగుతున్నారు. మూడు రోజుల విచారణలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వింత ప్రవర్తన, హెచ్చరికలు చేసిన వైనాన్ని సిట్ అధికారులు వీడియో తీశారు. దానిని ఏసీబీ కోర్టుకు వారు సమర్పించనున్నట్టు తెలిసింది. హైదరాబాద్‌లో లిక్కర్ వ్యాపారుల నుంచి రాజ్ కసిరెడ్డి(ఏ-1) ముడుపులు తీసుకుని ఏపీలో వైసీపీ అభ్యర్థులకు ఎన్నికల్లో పంచేందుకు చెవిరెడ్డి ద్వారా పంపిణీ చేసినట్లు సిట్ గుర్తించింది. వీడియో ఫుటేజీలు, వాంగ్మూలాలు, టవర్ లొకేషన్లన్నీ సేకరించిన సిట్ అధికారులు, అందుకు అనుగుణంగా చెవిరెడ్డిని ప్రశ్నించారు. అయితే, ఏ ప్రశ్న అడిగినా పొంతన లేని సమాధానాలు చెప్పారని, 'మీరు అడిగితే ఎందుకు చెప్పాలి? నేను చెప్పింది రికార్డు చేసుకోండి' అంటూ కేసుతో సంబంధం లేని రాజకీయపరమైన ప్రకటనలు ఇచ్చారని తెలిసింది. సిట్ కూడా అంతే దీటుగా ఆయనతో వ్యవహరించినట్లు సమాచారం. "రాజకీయ ప్రకటనలు బయట ఇచ్చుకోండి..మాకు కేసు విషయాలు మాత్రమే చెప్పండి.. డబ్బులు హైదరాబాద్‌లో తీసుకుని పలుమార్లు విజయవాడ, తాడేపల్లికి తీసుకొచ్చారు.. అక్కడ డంప్‌లో పెట్టి ఆ తర్వాత ఒంగోలు, తిరుపతికి తరలించారు.. ఇవిగో మీ కార్లు, వాటి నంబర్లు చూడండి.." అంటూ ఫొటోలు చూపించారు. దీంతో చెవిరెడ్డిలోని మరో కోణం బయటికి వచ్చింది. "నన్ను ఈ ప్రశ్నలు అడగమని మీకు చెప్పిందెవరు.. నాకు మద్యం అలవాటు లేదు.. ఎన్నికల్లో ఎప్పుడూ పంచలేదు.. నాపై లిక్కర్ కేసు పెడతారా.? మీ అందరి చరిత్ర నాకు తెలుసు. మేం అధికారంలోకి వస్తే ఎవ్వరినీ వదిలిపెట్టను.." అంటూ సిట్ అధికారులకే చెవిరెడ్డి వార్నింగ్ ఇచ్చారని తెలిసింది.



జైల్లోనూ అదే తీరు..

విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న చెవిరెడ్డి జైలు అధికారులను విసిగిస్తున్నట్లు తెలిసింది. లాకప్‌లోకి వెళ్లకుండా అటూ ఇటూ తిరగడం.. వంట గదిలోకి దూసుకెళ్లి ఏమి వండుతున్నారంటూ చూడటం, ఆహారం ప్లేటులో తనే వడ్డించుకుని వెళ్లడం చేశారు. ఇది జైలులో ప్రవర్తించే తీరు కాదని జైలు అధికారులు వారించే ప్రయత్నం చేశారు. అయితే, చెవిరెడ్డి ఒక ఉన్నతాధికారి పేరు చెప్పి 'మా మావకు నేనే చెబుతా..మీ రేంది చెప్పేది' అంటూ వారిని బెదిరించినట్లు తెలిసింది. దెబ్బకు ఆ ఉన్నతాధికారి జైలుకు వచ్చి 'నీకు, నాకు స్నేహం ఉంటే అదంతా బయట. ఇక్కడ కాదు. సీసీ కెమెరాలు ఉన్నాయి' అని హితబోధ చెయ్యడంతో తగ్గినట్లు సమాచారం. జైలులో ఖైదీలు వారానికి రెండు సార్లు కుటుంబసభ్యులతో ఫోనులో మాట్లాడుకునే అవకాశం ఉంది. ఒక రోజు చెవిరెడ్డి మాట్లాడేందుకు ఫోను అడిగారు. 'చార్జింగ్ అవుతోంది కాసేపు ఆగండి' అని బదులిచ్చిన జైలు ఉద్యోగిపై చెవిరెడ్డి చిందులేశారు. మూడు రోజుల క్రితం సిట్ అధికారులు కస్టడీకి తీసుకోవడానికి వెళ్లినప్పుడు.. జైలు బ్యారక్ నుంచి తీసుకొచ్చి ప్రధాన గేటు లోపల కూర్చోబెట్టారు. అక్కడ కొంచెం ఆలస్యం కావడంతో 'నన్ను ఇక్కడెందుకు కూర్చోబెట్టారు. నేను లాకప్‌లోకి వెళ్తా'నంటూ విసిగించారు. ఇవన్నీ భరించలేక జైలు సూపరిండెంట్ సెలవు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. సిబ్బందికి ధైర్యం చెప్పిన జైళ్ల శాఖ ఉన్నతాధికారులు రిమాండ్ ఖైదీ చెవిరెడ్డి ప్రవర్తనపై నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం.

ముగిసిన కస్టడీ

విజయవాడ, జూలై 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంకేసులో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అతని స్నేహితుడు చెరుకూరి వెంకటేష్‌నాయుడుల కస్టడీ ముగిసింది. గురువారం సిట్ కార్యాలయంలో విచారణ ముగిసిన అనంతరం వారికి ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా న్యాయాధికారి పి.భాస్కరరావుకు తన సమస్యను చెవిరెడ్డి విన్నవించుకున్నారు. తాను కొంతకాలంగా వెన్ను నొప్పితో బాధపడుతున్నానని, తిరుపతిలోని స్విమ్స్‌లో ఎప్పటి నుంచో వైద్యం చేయించుకుంటున్నానని తెలిపారు. తనను అక్కడికి పంపించాలని వేడుకున్నారు. దీంతో చెవిరెడ్డిని విజయవాడలో దగ్గరగా ఉన్న ఆస్పత్రిలో చూపించాలని జైలు అధికారులను న్యాయాధికారి ఆదేశించారు. అనంతరం చెవిరెడ్డి, వెంకటేష్ నాయుడులను జైలుకు తరలించారు.

నకిలీ నెయ్యి నిందితులకు బెయిల్

- భోలేబాబా డైరెక్టర్లు, వైష్ణవి డెయిరీ సీఈవోలకు మంజూరు

అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానం)కి నకిలీ నెయ్యి సరఫరా చేసిన కేసులో భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పోమిల్ జైన్(ఏ3), విపిన్ జైన్(ఏ4), వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ వినయ్‌కాంత్ చావడా(ఏ5)లకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తిరుపతి రెండవ అదనపు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సంతృప్తి మేరకు రూ.25వేలతో ఒక్కొక్కరూ రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం తీర్పు ఇచ్చారు. కాగా, పిటిషనర్లకు షరతులు విధించాలని సీబీఐ తరఫు న్యాయవాది పీఎస్‌పీ సురేష్‌కుమార్ కోరగా, ఇప్పటికే అధికారులు చార్జిషీట్ దాఖలు చేశారని, ఈ దశలో ఎలాంటి షరతులు విధించగలమని న్యాయమూర్తి ప్రశ్నించారు. అనంతరం ఆ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి దర్యాప్తునకు సహకరించాలని, దర్యాప్తు అధికారి కోరినప్పుడు విచారణకు హాజరుకావాలని పిటిషనర్లను ఆదేశించారు. ఈ కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న పోమిల్ జైన్, విపిన్ జైన్, అపూర్వ వినయ్‌కాంత్ చావడా దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై హైకోర్టులో ఇటీవల వాదనలు ముగియంతో న్యాయమూర్తి గురువారం బెయిల్ మంజూరు చేస్తూ నిర్ణయం వెల్లడించారు.

సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు!

- హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాసరెడ్డి వ్యాఖ్య
- రాజకీయనేతల పిటిషన్ల విచారణకు విముఖత

అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో తనను ట్రోల్ చేస్తున్నారని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. టీటీడీ లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో నిందితులకు గురువారం బెయిల్ మంజూరు చేసిన అనంతరం న్యాయమూర్తి ఈ విషయాన్ని వెల్లడించారు. ట్రోలింగ్ చేసే ట్రోలర్లకు ఈ తీర్పు మరో అంశం అవుతుందని వ్యాఖ్యానించారు. సింగయ్య మృతి కేసులో పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నేతలు ఇటీవల హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. వాహన ప్రమాదానికి డ్రైవర్ బాధ్యుడు అవుతాడని, అందులో ప్రయాణించేవారిని ఎలా బాధ్యులను చేస్తారని విచారణ సందర్భంగా న్యాయమూర్తి ప్రశ్నించారు. పోలీసులు నమోదు చేసిన బీఎన్‌ఎస్ సెక్షన్ 105 రెడ్‌విత్ 49 జగన్‌కు, ఆపార్టీ నేతలకు వర్తించదంటూ వారిపై తదుపరి చర్యలను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో గత రెండు రోజులుగా జస్టిస్ శ్రీనివాసరెడ్డిని సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు. గురువారం ఈ విషయాన్ని వెల్లడించిన న్యాయమూర్తి తదనంతరం తన ముందుకు వచ్చిన పలువురు రాజకీయనేతల పిటిషన్లను విచారించేందుకు విముఖత చూపారు.

కాకాణికి మరో షాక్!

- మద్యం డంప్ కేసులో 17 వరకు రిమాండ్

నెల్లూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం డంప్ చేసిన కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కోర్టు ఈ నెల 17 వరకూ రిమాండ్ విధించింది. నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట ఎక్సైజ్ పోలీసులు నమోదు చేసిన ఈ కేసులో కాకాణి(ఏ-8)ని గురువారం పీటీ వారెంట్‌పై నాలుగో అదనపు జిల్లా కోర్టులో హాజరుపరిచారు. ఇరుపక్షాల వాదనల అనంతరం కాకాణికి న్యాయాధికారి రిమాండ్ విధిస్తూ ఉత్తర్వు జారీ చేశారు.

కేసు నేపథ్యం ఇదీ...: గత సార్వత్రిక ఎన్నికల సమయంలో సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండలం విడవూరు, ముత్తుకూరు మడలం పంటపాళెంలలో 69వేల మద్యం సీసాల డంప్‌ను ఎక్సైజ్ ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకుంది. అప్పట్లో ఇద్దరు వైసీపీ నాయకులను అదుపులోకి తీసుకొని కేసును ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. అయితే వైసీపీ అధికారంలో ఉండటంతో కేసును అంతటితో ముగించారు. ఈ కేసును తిరగదోడాలని పొదలకూరుకు చెందిన కూరపాటి విజయబాబు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ కేసును రీ ఓపెన్ చేస్తే తన వద్ద ఉన్న ఆధారాలు సమర్పిస్తానని ఎక్సైజ్ శాఖకు తెలిపారు. విజయబాబు ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన ఎక్సైజ్ పోలీసులు ఈ కేసులో కాకాణిని ఏ-8గా చేర్చారు. పట్టుబడిన 69వేల బాటిళ్లు ఏ షాపు నుంచి, ఏ తేదీన వెళ్లాయనే అంశాలపై ఏ-1 సురేంద్రరెడ్డిని విచారించే క్రమంలో ఈ వ్యవహారంలో కాకాణికి ఉన్న లింకు బయటపడింది. అతని కాల్ లిస్ట్ పరిశీలించగా ఆ రెండు రోజులు కాకాణితో ఎక్కువసార్లు మాట్లాడినట్లు తేలింది. సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో మొత్తం 35 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండగా వాటిలో 25 దుకాణాల నుంచి అదనంగా అమ్ముడుపోయినట్లు రికార్డయింది. ఆ షాపుల్లో సగటు అమ్మకం రోజుకు వెయ్యి బాటిళ్లు అయితే దానికి అదనంగా 1,800 నుంచి 2,000 బాటిళ్లు చొప్పున సుమారు 80 వేల నుంచి లక్ష బాటిళ్లు ఆ రెండు రోజుల్లో డంప్ కింద వెళ్లినట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. వీటిని షాపు కోడ్‌తో డిపో నుంచే స్కాన్ చేసినట్లు భావిస్తున్నారు. దీన్ని నిర్ధారించుకోవడం కోసం విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ నుంచి వివరాలు వస్తే అప్పటి డిపో మేనేజర్‌ను బాధ్యుడ్ని చేసి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ కేసు విచారణ నిమిత్తం రెండు మూడు రోజుల్లో కాకాణిని ఎక్సైజ్ అధికారులు కస్టడీకి తీసుకునే అవకాశం ఉంది.

నోటిఫికేషన్‌కు ముందే మద్యం రెడీ

ఓటర్లను ప్రలోభపెట్టడానికి గత ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి 10 రోజుల ముందే లక్షలాది మందు బాటిళ్లను వైసీపీ నాయకులు డంప్ చేశారు. ఎన్నికల సమయంలో ఒకటి, రెండు రోజుల్లో భారీ ఎత్తున్న మద్యం విక్రయాలు జరిగాయా అనే కోణంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ పరిశీలించే అవకాశం ఉంది. ఈ విషయం నిర్ధారణ అయితే కాకాణి తరహాలో మరికొందరిపై కేసులు తప్పవని భావిస్తున్నారు.

హైకోర్టు న్యాయమూర్తిగా తుహిన్ కుమార్

- తెలంగాణకు మరో నలుగురు కొత్త జడ్జిలు
- కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు



న్యూఢిల్లీ/అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా మరో నాలుగు రాష్ట్రాల హైకోర్టులకు కొత్త న్యాయమూర్తుల నియామకానికి సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా సేవలందిస్తున్న గేదెల తుహిన్ కుమార్‌ను అక్కడే న్యాయమూర్తిగా నియమించాలని పేర్కొంది. అదేవిధంగా న్యాయవాదులు గౌస్‌మీరా మోహిద్దీన్, చలపతిరావు సుద్దాల, వాకిటి రామకృష్ణారెడ్డి, ప్రవీణ్ కుమార్‌లను తెలంగాణ హైకోర్టుకు జడ్జిలుగా సిఫారసు చేసింది. ఈ మేరకు ఈనెల 2న జరిగిన సమావేశంలో కొలీజియం నిర్ణయం తీసుకుంది. వీరి నియామకంపై రాష్ట్రపతి ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. కాగా, అదనపు న్యాయమూర్తులతో కలుపుకొని ప్రస్తుతం ఏపీ హైకోర్టులో 28 మంది న్యాయమూర్తులు ఉన్నారు. తుహిన్ నియామకంతో వీరి సంఖ్య 29కి చేరనుంది. రాష్ట్ర హైకోర్టులో 37 మంది జడ్జీల నియామకానికి ఆమోదం ఉంది. కాగా, ఢిల్లీ, రాజస్థాన్ హైకోర్టులకు ఇద్దరేసి, మధ్యప్రదేశ్ హైకోర్టుకు ఐదుగురు, పంజాబ్-హరియాణా హైకోర్టుకు 10 మంది జ్యుడీషియల్ అధికారులను న్యాయమూర్తులుగా నియమించాలని కొలీజియం సిఫారసు చేసింది.

తుహిన్ కుమార్ నేపథ్యం..

గేదెల తుహిన్ కుమార్ స్వగ్రామం పార్వతీపురం మన్యం జిల్లా వీరగట్టం మండలం కత్తులకవిటి గ్రామం. తల్లిదండ్రులు సరోజిని, కృష్ణమూర్తి నాయుడు. పాఠశాల విద్యాభ్యాసం విశాఖలో పూర్తి చేశారు. తుహిన్ కుమార్ విశాఖ ఎన్‌బీఎం న్యాయ కళాశాల నుండి ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. 1994లో హైకోర్టు న్యాయవాదిగా నమోదయ్యారు. 2000-2004 మధ్య ప్రభుత్వ సహాయ న్యాయవాది(ఏజీపీ)గా పనిచేశారు. 2016-17లో ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిగా కొనసాగుతున్నారు.

ఆ భూమి రెవెన్యూ అధీనంలో..

- 'ఆంధ్రజ్యోతి' కథనాలపై కాకినాడ కలెక్టరేట్ వివరణ

కాకినాడ, జూలై 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో సూర్యారావుపేటలోని వివాదాస్పద ప్రైవేటు భూమిపై న్యాయ వివాదం కొనసాగుతోందని కలెక్టర్ కార్యాలయం అధికారులు వెల్లడించారు. న్యాయస్థానం ఆదేశాలు వెలువడే వరకు రెవెన్యూ అధీనంలోనే భూమిని ఉంచామని పేర్కొన్నారు. సూర్యారావుపేటలోని రెండెకరాల ప్రైవేటు భూమికి కలెక్టరేట్‌లో రికార్డులు తారుమారు చేసేసి ఓ వైసీపీ నేత కొట్టేయడానికి స్కెచ్ వేసిన వైనంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనాలపై స్పందించారు. సర్వే నంబరు 195/3లోని రెండెకరాల భూమిని కొప్పుల ప్రభావతి అనే మహిళ వద్ద తాను కొనుగోలు చేశానని, ఈ భూమిలోకి వెళ్లడానికి భద్రత కావాలంటూ చలికి వీరేంద్ర అనే వ్యక్తి గతంలో పోలీసులను ఆశ్రయించారని పేర్కొన్నారు. అదే సమయంలో ముమ్మిడి ఇంటి పేరుతో ఉన్న మరో కుటుంబం ఆ భూమి తమదేనంటూ డాక్యుమెంట్లు, ఈసీతో ముందుకు వచ్చారని తెలిపారు. దీనిపై 2023లో కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ విచారణ జరిపి ఈ భూమికి సంబంధించి రికార్డుల ట్యాంపరింగ్ జరిగిందని, రెవెన్యూ రికార్డుల ప్రకారం భూమి ముమ్మిడి కుటుంబానిది కాదని తేల్చినట్లు తెలిపారు. అయినా ఆ భూమి తమదేనంటూ ముమ్మిడి కుటుంబం అందులోకి వెళ్లే ప్రయత్నం చేసిందని వివరించారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు ఆ భూమి తమదేనంటూ అందులోకి వెళ్లే ప్రయత్నం చేస్తుండడంతో సివిల్ కోర్టు ఆదేశాలు వచ్చే వరకు రెండు వర్గాలు ఆ వివాదాస్పద భూమిలోకి వెళ్లవద్దని నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఆ భూమిని ప్రస్తుతం కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయ అధీనంలో కొనసాగిస్తున్నట్లు వివరించారు. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం 'సరిదిద్దలేని దందా' శీర్షికతో కథనం వచ్చిన నేపథ్యంలో ఈ భూమిపై నెలకొన్న వివాదం, గత నేపథ్యంపై నిజానిజాలేంటనే దానిపై కాకినాడ జిల్లా కలెక్టర్ అమరావతిలోని సీసీఎల్ఏకు నివేదిక పంపారు.

తనిఖీలకు వచ్చిన వారికి లంచం

- ఎన్ఎంసీ అధికారులకు భారీగా ముట్టజెప్పిన పలు మెడికల్ కళాశాలలు

హైదరాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): తనిఖీలకు వచ్చిన జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులకు లంచాలు ఇచ్చిన విషయంలో దేశవ్యాప్తంగా పలు వైద్య కళాశాలలపై కేసు నమోదైంది. తమ కాలేజీలకు అనుకూలంగా నివేదికలు ఇవ్వాలని యాజమాన్యాలు మధ్యవర్తుల ద్వారా ఎన్ఎంసీ అధికారులకు పెద్ద మొత్తంలో సొమ్మును ముట్టజెప్పారు. దీనిపై జూన్ 30న సీబీఐ కేసు నమోదు చేసింది. ఇందులో ఏపీ, తెలంగాణకు చెందిన పలు మెడికల్ కాలేజీలు, మధ్యవర్తుల పేర్లు ఉన్నాయి. ఈ కేసుకు సంబంధించి సీబీఐ అధికారులు దేశవ్యాప్తంగా జరిపిన దాడుల్లో ఇప్పటి వరకు ఆరుగురిని అరెస్టు చేశారు. వరంగల్ జిల్లాలోని ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ట్రస్టీ ఫాదర్ జోసెఫ్ కొమ్మారెడ్డి రెండు విడతల్లో రూ.20 లక్షలు, రూ.46 లక్షలు లంచంగా చెల్లించినట్లు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఫాదర్ కొలంబో ట్రస్టు సభ్యులు, వరంగల్ డయాసీస్ ప్రస్తుత అడ్మినిస్ట్రేటర్‌తో పాటు మరికొంత మందిని విచారించడానికి సీబీఐ సిద్ధమైనట్లు సమాచారం. ఎఫ్ఐఆర్‌లో 36 మంది పేర్లు ఉండగా, అందులో ఆరుగురు ఏపీ, తెలంగాణ వారు. ఎన్ఎంసీ పెద్దలు లంచాల కోసం పలు ప్రాంతాల్లో తమ అనుకూల వ్యక్తుల సాయం తీసుకున్నారు. దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి అనంతపురం కదిరి ప్రాంతానికి చెందిన డాక్టర్ హరిప్రసాద్, హైదరాబాద్ శ్రీనగర్ కాలనీకి చెందిన డాక్టర్ అంకం రాంబాబు, విశాఖపట్నం అక్కయ్యపాలెంకు చెందిన డాక్టర్ కృష్ణకిషోర్‌లు మెడికల్ కాలేజీల నుంచి లంచాలు వసూలు చేసి ఢిల్లీలోని ఎన్ఎంసీ సభ్యుడు డాక్టర్ వీరేంద్రకుమార్‌కు పంపినట్లు దర్యాప్తులో వెల్లడైంది. వీరిలో హరిప్రసాద్ పలు ప్రైవేటు వైద్య కళాశాలలకు కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తూ తనిఖీల సమయంలో డమ్మీ ఫ్యాకల్టీలను ఏర్పాటు చేయడం, ఎన్ఎంసీ లైసెన్సు పునరుద్ధరణ కోసం లేఖలు తేవడం, ఇందుకోసం లంచాలు వసూలు చేయడంలో కీలకపాత్ర పోషించినట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. విశాఖపట్నంలోని గాయత్రి మెడికల్ కాలేజీ డైరెక్టర్ వెంకట్ నుంచి రూ.50 లక్షలు వసూలు చేసి ఆ మొత్తాన్ని డాక్టర్ కృష్ణ కిషోర్ ద్వారా హవాలా మార్గంలో ఢిల్లీకి పంపినట్లు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఇదే కేసుకు సంబంధించి గతంలో చత్తీస్‌గఢ్‌లోని శ్రీరావత్‌పురా మెడికల్ కాలేజీకి చెందిన ముగ్గురు డాక్టర్లు, ముగ్గురు మధ్యవర్తులను సీబీఐ అధికారులు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఈ కుంభకోణానికి సంబంధించి ఇప్పటి వరకు కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ, ఏపీల్లోని 40 చోట్ల సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు. ఎన్ఎంసీతో కుమ్మక్కైన మరికొన్ని ప్రైవేటు మెడికల్ కాలేజీలపైనా సీబీఐ దృష్టి సారించినట్లు సమాచారం.

జేబులో సెల్‌ఫోన్‌తో సినిమా రికార్డింగ్!

- టెలిగ్రాం లింకుల ద్వారా విక్రయం.. నిందితుడి పట్టివేత

హైదరాబాద్ సిటీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): అతడు చదివింది ఐటీఐ.. పని చేస్తున్నది ఏసీ టెక్నీషియన్‌గా! కానీ అది పైకి ముసుగు మాత్రమే. అతడి ప్రధాన వ్యాపకం.. సినిమాల పైరసీ! ఏడాదిన్నరగా అలా కొత్త సినిమాలను సెల్‌ఫోన్‌తో వీడియో తీసి, ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న ఆ నేరగాణ్ని హైదరాబాద్ సైబర్ క్రైమ్ అధికారులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా జనా కిరణ్‌కుమార్ ఐటీఐ చదివి వనస్థలిపురంలో ఉంటూ ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం 'తమిళ్ఎంవీ'.. పైరసీ వెబ్‌సైట్ వీడియో చూసి, వారిని మెయిల్ ద్వారా సంప్రదించి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ ఒప్పందం మేరకు.. ఏడాదిన్నరగా తెలుగులో రిలీజైన ప్రతి కొత్త సినిమానూ రికార్డ్ చేసి వారికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఒక్కో సినిమాకూ అతడు రూ.30 వేల నుంచి రూ.40 వేల దాకా తీసుకుంటున్నాడని సైబర్ క్రైం డీసీపీ కవిత తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.